వాయిస్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital



కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 278 పేజీలు: 8+16 వెల: 8.00


# రోడ్లకు మహర్దశ

## రాష్ట్రంలో రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం

## రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ.36వేల కోట్లు

## రూ.10,400 కోట్లతో హైదరాబాద్-విజయవాడ హైవే 8 లేన్లుగా విస్తరణ

### కనీవినీ ఎరుగని స్థాయిలో రోడ్లు నిర్మిస్తాం: మంత్రి కోమటిరెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్8:** తెలంగాణలో మౌలిక వసతుల రంగంలో ఎన్నడూ లేని బారీ పెట్టుబడులు ప్రవహిస్తున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో వివిధ రహదారి ప్రాజెక్టులకు మొత్తం రూ.60,799 వేల కోట్లు మంజూరు కావడం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో కనీ విని ఎరగని పెద్ద రికార్డు అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సహకరించిన, గొప్ప కార్యక్రమానికి అనుమతులు ఇచ్చి నిధుల మంజూరుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు ధన్యవాదాలు తెలుపుతన్నట్లు ప్రకటించారు. మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారబోతోందన్నారు. లక్షలకోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి, లక్షలాదిమంది గ్రామీణ యువతకు ఉపాధి కలగనుందన్నారు. ప్రధాన ప్రాజెక్టుల్లో భాగంగా రూ.10,400 కోట్లతో హైదరాబాద్- విజయవాడ హైవేను ఎనిమిదిలైన్లుగా విస్తరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే ఆర్ఆర్ఆర్ రహదారి నిర్మాణానికి రూ.36,000 వేల కోట్లు కేటాయించారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణం. సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం చేపడుతారు. హెచ్ఏఎం(హామ్) ప్రాజెక్టుకు 11,399 రూ.కోట్లు ఖర్చు చేస్తామని, కొద్ది రోజుల్లో టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. వీటితోపాటు ప్రపంచంలోని పెట్టుబడిదారులు అంతా తెలంగాణ రాష్ట్రానికి తరలివచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం

>>2



## ఓటమి భయంతో సిఎంకు

# సోయి తప్పింది

## కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పి ఓట్లు అడగాలి

## తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో నేను చెప్తా

### మీడియాతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఓడిపోతుందనే భయంతో ముఖ్యమంత్రి సోయి తప్పి మాట్లాడుతున్నాడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాయలంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రజల్లోకి వెళ్లేటప్పుడు, తాను ఏమి చేశారో వివరించి, ఆ తర్వాత ప్రత్యర్థిని విమర్శిస్తూ ఓట్లు అడగాలని, కానీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మీద ఒక్క మాట మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన హామీలు ఏమాత్రం ఉన్నాయో ఒక్కటంటే ఒక్క మాట మాట్లాడలేదని, కేవలం రెండు నెలల్లో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా, ప్రత్యర్థిపై విమర్శలు మాత్రమే చేస్తున్నారని అన్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను మళ్లించే వ్యూహంలో భాగంగానే తమపై, ప్రధానమంత్రిపై, తమ పార్టీపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసిపోయాయని దిగజారుడు రాజకీయాలు రేవంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇలాంటి ప్రచారమే చేశారని, మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తూ నాపై వ్యక్తిగత

>>2



## డిసెంబరు 1నుంచి

# శీతాకాల పార్లమెంటు

### 19 రోజులు సమావేశాలు

**న్యూఢిల్లీ, నవంబరు 8:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈతేదీలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ప్రకటిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు

>>2

## అప్పుల బాధతో

# కానిస్టేబుల్ ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

**హైదరాబాద్ (ఉప్పల్), నవంబరు 8 ప్రభాతవార్త:** అప్పుల బాధతో ఒక కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం.. ఉప్పల్ మల్లికార్జుననగర్ కాలనీలో నివసించే మాణిక్‌రావు కుమారుడు దన్ని శ్రీకాంత్ (43) పిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. 2009 బ్యాచ్‌కు చెందిన దన్ని శ్రీకాంత్ గత పది రోజులుగా డ్యూటికి వెళ్లడంతో లేదని తెలిపారు. ఇదే క్రమంలో అక్కడి పోలీస్‌స్టేషన్ నుంచి కూడా సమాచారం అందినట్లు తెలిపారు. కాగా శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో తన గదికివెళ్లి గడియ పెట్టుకుని చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు గంత కొంత కాలంగా

>>2

## యుపిలో నీట్ విద్యార్థి ఆత్మహత్య 2



# ఓటుకు రూ.2,500!

## జూబ్లీహిల్స్‌లో మొదలైన ప్రలోభాల పర్వం!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్8:** జూబ్లీహిల్స్ లో ఉప ఎన్నిక వేళ ప్రలోభాల పర్వం మొదలైంది. మొదటి విడతగా ఓ పార్టీ ఓటుకు రూ.1500, మరో పార్టీరూ.2500 ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొన్ని ఏరియాల్లో డబ్బులకు బదులు కాస్ట్‌లీ గిఫ్టులు ఇస్తున్నట్లు సమాచారం.స్థానిక నేతలు తమవారికే పంపకాలు చేస్తారని భావించి,బయటి నాయకులను పిలిపించి డబ్బులు పంచుతున్నట్లు తెలుస్తోంది. ఓటరు లిస్ట్‌లో పేరు, ఓటరు కార్డులను చెక్ చేసి నగదు పంపిణీ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఒక పార్టీ వారు ఏకంగా ఆధార్ కార్డును తీసుకుని డబ్బులు పంపిణీ చేస్తున్నారని, ఎన్నికల ఓటింగ్ అయ్యాకే ఓటర్లకు తిరిగి ఆధార్ కార్డు అందజేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారని ప్రచారం. దీనికి కౌంటర్‌గా

>>2



శనివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కోటి దీపోత్సవంలో పాల్గొన్న సిఎం రేవంత్

# కోటి దీపోత్సవాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తాం

### వచ్చే యేడాది నుంచి అధికారిక ఉత్సవంగా నిర్వహణ

### జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి లేఖ రాస్తా

### ఉత్సవానికి సతీసమేతంగా హాజరైన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్8:** భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటీ దీపోత్స వం వేడుకలు ఎన్టీఆర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. వెంట మనువడిని కూడా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రేవంత్‌రెడ్డి దంపతులకు వేద మంత్రాలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భక్తి టీవీ నిర్వహిస్తున్న కోటీ దిపోత్స వాన్ని

>>2

# ఢిల్లీలో భట్టి ఇంటిలో ఐటి రైడ్స్‌ను ఎందుకు దాచారు?

### రేవంత్, బిజెపిది ఫెవికాల్ బంధం: మాజీ మంత్రి హరీష్‌రావు



శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్8:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, బీజేపీది ఫెవికాల్ బంధమని ఆరోపించారు. ఢిల్లీలో మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ రైడ్స్ జరిగితే ఎందుకు బయటకు రాలేదని ప్రశ్నించారు. భట్టి ఢిల్లీ వెళ్తే తెలంగాణ భవన్‌లో ఉండరని..గురుగాంలోని అత్తగారింట్లో ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే భట్టి ఇంట్లో ఐటీ రైడ్స్ బయటకు రాలేదని ఆరోపించారు. భట్టి ఇంట్లో హార్డ్ డిస్క్‌లు కూడా ఐటీ అధికారులు తీసుకెళ్లారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బయట ఉన్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిల మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీ పోతే ఎవర్ని కలిసేది.. ఎవరి కారులో తిరిగేది బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు ఉండటం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం ఇష్టం లేదని విమర్శించారు. అందుకే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం కూర్చుంటున్నారని ఎద్దేవా చేశారు. పీజేఆర్ కొడుకుకు టికెట్ ఇవ్వని రేవంత్‌రెడ్డికి ఆయన పేరు తీసే నైతికత లేదని ధ్వజమెత్తారు. పీజేఆర్‌ను మానసికంగా వేధించి చనిపోయేలా చేసిందే కాంగ్రెస్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానసిక‌స్థితిపై మాకు అనుమానంగా ఉంది. మాట తప్పటం రేవంత్‌రెడ్డి నైజం. జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమైంది. రేవంత్‌రెడ్డి భూదందాలు, వసూళ్లు, హైడ్రాతో తెలంగాణ ఆదాయం పడిపోయింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారు. ప్రభుత్వాన్ని నడపటం చేతకావటం లేదని రేవంత్ చేతులెత్తేశాడు. హైదరాబాద్ అభివృద్ధిలో కేసీఆర్

>>2

# రాష్ట్రమంతా చలిగాలులు

## రాత్రివేళ 14 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

### వచ్చేవారం నుంచి మరింత తగ్గుతాయన్న వాతావరణ శాఖ



**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది చలి కాలం ఎట్టకేలకు మొదలయ్యింది. వారం రోజుల క్రితం వరకు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీచిన వేడి గాలులతో పాటు వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రంలో ఓవైపు భారీ వర్షాలకు తోడుగా పగటి పూట ఎండ వేడిమి 33 డిగ్రీలను మించడం తెలిసిందే. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు కూడా నమోదయ్యాయి. ఇదే సమయంలో ఉక్కపోత ఎక్కు వగా వుండడంతో ప్రజలు వేడి వాతావరణంలో అల్లాడిపోయారు. ఒక రకంగా చెప్పాలంటే చలి కాలంలో వేసవి

>>2






శనివారం వారణాసిలో 'వందేభారత్'ను ప్రారంభించిన అనంతరం ట్రైన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## 1నుంచి శీతాకాల పార్లమెంటు

>> జరగాలని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత క్లుప్తమైన శీతాకాల సమావేశాల్లో ఇది ఒకటి కావడం గమనార్హం. గతేడాది శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయి. 26 రోజుల వ్యవధిలో లోక్‌సభ 20 సార్లు, రాజ్యసభ 19 సార్లు సమావేశమయ్యాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ ఉత్పాదకత 54.5 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 40 శాతంగా నమోదైంది. అప్పుడు ఐదు బిల్లులను ప్రవేశపెట్టగా, 'భారతీయ వాయుయాన్ విధేయక్ 2024' బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి.

ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరిగాయి. ఆ సమావేశాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఉభయ సభల్లో ఉత్పాదకత గణనీయంగా తగ్గింది. లోక్‌సభ కేవలం 31 శాతం, రాజ్యసభ 38.8 శాతం ఉత్పాదకతను మాత్రమే నమోదు చేశాయి. ఆ సెషన్‌లో 15 బిల్లులు చట్టరూపం దాల్చాయి.

## ఎందుకు దాచారు?

>> ముద్రను రేవంత్‌రెడ్డి చెరపలేరు. రేవంత్ ఇంటి కిటికీ నుంచి కనిపించే తీగల వంతెనను కట్టింది కేసీఆరే. రేవంత్‌రెడ్డి తన అసమర్థతను తానే బయట పెట్టుకున్నారు. రెండేళ్లల్లో ఏమీ చేయలేదు కాబట్టే.. 2004 నుంచి 2014 వరకు గత కాంగ్రెస్ పాలన చూసి జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో ప్రజలని ఓటేయమంటున్నారు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి 2014 వరకు టీడీపీలో ఉన్నారు. కాంగ్రెస్ పాలనను రేవంత్‌రెడ్డి ఎలా క్లెయిమ్ చేసుకుంటారు..?. వైఎస్‌ఆర్‌ని రేవంత్‌రెడ్డి విమర్శించలేదా..? వైఎస్‌ఆర్ జలయజ్ఞాన్ని.. ధనయజ్ఞం అని రేవంత్‌రెడ్డి అనలేదా..?. గతంలో వైఎస్‌ఆర్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గంటలు కూడా కరెంట్ రాలేదు. కేసీఆర్ కట్టిన ప్రతి దాన్ని ఉపయోగించుకుంటూ.. అబద్ధాలు చెబుతున్నారు. అప్పుల మీద ముఖ్యమంత్రి పూటకో మాట మాట్లాడుతున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా కాకుండా దారిన పోయే దానయ్యలా రేవంత్ మాట్లాడుతున్నారు. రూ.30 కోట్ల అంచనాలతో ఎంసీహెచ్‌ఆర్‌డిలో ప్రారంభమైన సీఎం క్యాంపు ఆఫీస్ రూ.100కోట్లకు ఎందుకు పెంచారు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ కట్టిన నిర్మాణాలకి రేవంత్‌రెడ్డి రిబ్బన్ కత్తిరిస్తున్నారు అని హరీశ్‌రావు విమర్శలు చేశారు.

## ఓటుకు రూ.2,500!

>> మరో పార్టీ ఓటర్ల నుంచి ఓటు గ్యారంటీ పొందేందుకు కౌంటర్ వ్యూహంలో వెడుతున్నారని ప్రచారం. ఎన్నికల ప్రచార పర్వం ముగిసిన తర్వాత రెండో విడతగా కూడా డబ్బులు పంచేందుకు ఇప్పటి నుంచే ఆయా ప్రధాన పార్టీల వారు ప్లాన్ చేసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. మొత్తంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో రాష్ట్ర రాజకీయ వాతావరణం ఒక్కసారిగా హీటెక్కింది. ఎవరు గెలుస్తారో అన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ఆదివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ప్రస్తుతం అన్ని పార్టీలు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ ప్రధాన నాయకులను రంగంలోకి దించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఇంకా రోడ్ షోలు నిర్వహిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో పురుష ఓటర్లు 2,07,367, మహిళలు 1,91,590, ఇతరులు 25, మొత్తం 3,98,982 ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 407 ఏర్పాటు చేశారు. సగటున ఒక్కో కేంద్రం పరిధిలో ఓటర్లు 980 ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ఉల్లంఘనలపై ఫిర్యాదుల కోసం సీవిజిల్ యాప్‌ను ఉపయోగించాలని, అన్ని రకాల ఫిర్యాదులను కంట్రోల్ రూం నంబర్ 1950కు చేయాలని అధికారులు ఇప్పటికే సూచించారు. ఎన్నికల సంబంధ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు నియమావళి అమలు కోసం 9 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు , వీడియో సర్వైలెన్స్ బృందాలు 2, వీడియోలను పరిశీలనకు 2, వ్యయాన్ని నమోదుకు 4 బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఇంకా బృందాల సంఖ్య పెంచుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఉపఎన్నికను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హైదరాబాద్ సీపీ హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించాయి.

## కోటి దీపోత్సవాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తాం

>> రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని తెలిపారు. అంతేకాదు జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి లేఖ రాస్తామని సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాల నుంచి ఈ కోటి దిపోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మొదట హైదరాబాద్ నగరంలో ప్రారంభించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా ఈ రోజు భారతదేశ సరిహద్దులు దాటి ప్రపంచ దేశాలలో ఉన్న భక్త కోటీకి హరహర మహదేవ్ నామస్మరణ వినిపిస్తున్నారు. ఈ కోటీ దీపోత్సవం కార్యక్రమంలో నా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జీవితకాలం గుర్తిండిపోయే ఓ మధుర జ్ఞాపకంగా భావిస్తాను అని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎంత కష్టంలో ఉన్నా ఈ కార్యక్రమంలో పాల్గొంటే గొప్ప శక్తిని అందిస్తుందని, ఈ శక్తితో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## పోలవరం అథారిటీ కార్యాలయం అమరావతికే!

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించనున్నారు. ఈ మేరకు అథారిటీ ప్రతిపాదనను రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ఆహ్వానించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖతో చర్చిం,ఇ ఓ నిర్ణయానికి వచ్చి కార్యాలయాన్ని తరలించవచ్చేనే అభిప్రాయానికి వచ్చారు. గతంలో ప్రాజెక్ట్ అథారిటీ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం తరలించాలనే ప్రతిపాదన ఉంది. ఇప్పటికే పోలవరం అథారిటీ చీఫ్ ఇంజనీర్ (పీ అండ్ డీ) ఆయన సిబ్బందిని రాజమహేంద్రవరం తరలించారు. ఇతర పాలనాపరమైన వ్యవస్థలతో కూడిన అథారిటీ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తరలిస్తామంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

## యుపిలో నీట్ విద్యార్థి ఆత్మహత్య

**కాన్పూర్, నవంబరు 8:** నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన తల్లిదండ్రులను క్షమించమని కోరుతూ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. రాంపూర్‌కు చెందిన మహమ్మద్ ఆన్ (21) నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితమే చేరాడు. అతని రూమ్‌మేట్ ఇమ్దాద్ హసన్ ప్రార్థనలకు వెళ్దామని పిలవగా, మహమ్మద్ నిరాకరించాడు. ఇమ్దాద్ తిరిగి వచ్చి చూసేసరికి గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా మహమ్మద్ నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ మహమ్మద్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. అతని మృతదేహం వద్ద ఒక సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మా, నాన్న నన్ను క్షమించండి. నేను తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాను. మీ కలలను నేను నెరవేర్చలేను. అందుకే నా జీవితాన్ని ముగిస్తున్నాను. దీనికి నేనే బాధ్యుడిని అని ఆ లేఖలో మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని, విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల బాధతో కానిస్టేబుల్ ఆత్మహత్య

>> ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడని, గతంలో అన్‌లైన్ గేమింగ్‌లు ఆడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు తండ్రి మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

09-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
పంచమి రా.1.59
ఆరుద్ర రా.8.10, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.32 - 9.03
దు.సా.4.04-4.46
శుభసమయం : ఉ.6.30-7.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** రాజకీయ, పారి శ్రామిక కళారంగాల లోని వారికి కొంత అనుకూలం. అయో మయం, అస్పష్టత అనుమానాలకు దారితీస్తాయి.

**వృషభం:** జీవితభాగస్వామితో స్పర్థలు ఏర్పడ కుండా జాగ్రత్తలు తీసుకోండి. భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మిథునం:** సుదూర ప్రాంత ప్రయాణాలకు తాత్కాలిక విరామం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**కర్కాటకం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడు తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగు వడు తుంది. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**సింహం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నూతన మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు.

**కన్య :** ఆప్తుల నుండి ముఖ్య సమాచారం అందు కుంటారు. స్త్రీ మూలంగా ధనలాభం. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**తుల :** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో చేదు అనుభవాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడు తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**ధనుస్సు:** స్వంత మనుషులు మీద ఆరోపణ లను ఏకపక్షముగా నమ్మకండి. పెట్టుబడులలో తొందరపాటు వద్దు. వస్త్రలాభం పొందుతారు.

**మకరం:** శత్రు వర్గము నుండి పరోక్షముగా చికాకులు ఏర్పడినా సులువుగానే తప్పించు కుంటారు. ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలకు హాజరుతారు.

**కుంభం:** సమయమును వృథాకానివ్వకుండా అంశా లను అనుకూలముగా మార్చుకుంటారు. కీలక నిర్ణ యాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**మీనం :** ఆర్థికంగా ఋణాలు తీర్చకపోయి కొత్త ఋణాలు చేయరు. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఓటమి భయంతో సిఎంకు సోయి తప్పింది

>> విమర్శలు చేశాడని, నన్ను వ్యక్తిగతంగా విమర్శించినా, తప్పుడు ఆరోపణలు చేసినా, నా వ్యక్తిత్వాన్ని విమర్శించినా, ప్రజలు దానిని విశ్వసించలేదని అన్నారు. బిజెపి అంటే ఏమిటో, కిషన్ రెడ్డి అంటే ఏమిటో దేశ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు తెలుసునని అన్నారు. మాది కుటుంబ పార్టీ కాదు, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే పార్టీ బిజెపి అన్నారు. మోడి నాయకత్వంలో ఒక్క చిన్న అవినీతి ఆరోపణ కూడా లేకుండా పనిచేస్తున్న పార్టీ అన్నారు. గత ఎన్నికల్లో ఫేక్ వీడియోలు తయారు చేసి ప్రచారం చేసిన పార్టీ కాంగ్రెస్, బిఆర్‌ఎస్. జూబ్లీహిల్స్‌లో కూడా అదే పరిస్థితి. లక్షకోట్ల అవినీతి డబ్బులు కక్కిస్తానన్న రాహుల్ గాంధీ లక్ష రూపాయలను కూడా బయటకు తీశాడా?ఢిల్లీ స్థాయిలో బిఆర్‌ఎస్,కాంగ్రెస్ మధ్య ఒప్పందం కుదిరింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. కెటిఆర్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని తప్పించాలనుకున్నాడు అని ప్రచారం చేసింది నిజం కాదా? ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు... కెటిఆర్ సోషల్ మీడియాలో బిజెపికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌ను కలుపుకొని పోరాటం చేయాలన్నది నిజం కాదా? మరి ఏ విధంగా బిజెపికి, బిఆర్‌ఎస్‌కు సంబంధం అంటగడుతున్నారు? బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటయ్యాయో చూపించాల్సిందిగా సవాల్ చేస్తున్నాను. నోటికి ఏదో వస్తే అది మాట్లాడడం కాదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? విద్యుత్ కొనుగోళ్ల కేసు ఏమైంది? ధాన్యం కొనుగోళ్ల కేసు ఏమైంది? భూముల కొనుగోళ్ల కేసు ఏమైంది? ఒక్క బిఆర్‌ఎస్ నేతలపై చర్యలు తీసుకున్నారా అంటూ ప్రశ్నించారు. ప్రచారంలో బిఆర్‌ఎస్‌పై ఎన్ని ఆరోపణలు చేశావో మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. మీ పార్టీలో నీ మీద నీకు నమ్మకం ఉందా? మీ మంత్రులు నిన్ను నమ్ముతున్నారా? మీ మంత్రులు ఏ మాట్లాడుకుంటున్నారో వింటున్నావా? వాళ్ల కార్యకర్తలతో ఏం చెబుతున్నారో నీకు తెలుసా?ఆరు గ్యారంటీల విషయంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. అసలు కేంద్రం ట్రిపుల్‌ఆర్‌కు ఆమోదం తెలిపినప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నావు? తెలంగాణ అభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. రేవంత్ రెడ్డి, కెసిఆర్‌కు సమయం ఉంటే, తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో వివరించడానికి సిద్ధంగా ఉన్నాను. వచ్చే, వినే ధైర్యం మీకు ఉందా? కెటిఆర్, కిషన్ రెడ్డిని బ్యాడ్ బ్రదర్స్ అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు. "ఉల్టా చోర్ కోత్వాల్ కో డాంటే" (దొంగే పోలీసును బెదిరించినట్లు) ముఖ్యమంత్రి రేవంత్ వ్యవహరిస్తున్నాడు. తెలంగాణ తెచ్చుకుంది కెసిఆర్ కుటుంబం కోసం కాదు, తెలంగాణ బాగు కోసమన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌పై పెత్తనం చేసింది మజ్లీస్ పార్టీ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు రెండు పార్టీలను పాతర వేసే సమయం త్వరలోనే ఉంది. మూసి ప్రక్షాళనలో అధికార, మజ్లీస్ పార్టీ నేతల భవనాల జోలికి వెళ్లారు. కానీ పేద ప్రజల ఇళ్లను మాత్రం కూలగొడతారు. పేదవాడి గూడు కూల్చడానికి బిజెపి ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదు. మూసి రివర్ ఫ్రంట్‌తో వ్యాపారం చేస్తామంటే కుదరదు.సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో రేవంత్ రెడ్డిపై విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఢిల్లీలో బిగ్ బ్రదర్ కెసిఆర్, రాష్ట్రంలో హరీష్ రావు మంత్రులుగా చేశారు. ఈ రెండు పాలనా వ్యవహారం ఒక్కటే."చైనా సరిహద్దులో చైనా సైనికులను భారత సైనికులు కొట్టారని, సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయా? అంటూ, పాక్ సైనికులను పొగుడుతూ భారత సైనికులను అవమానించాడు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే భాషేనా? ఏ మతాన్ని బిజెపి అవమానించదు. ఓట్ల కోసం ఎంతకైనా దిగజారే పార్టీ కాంగ్రెస్ అని, మోసాలు, కుంభకోణాలు చేసి దేశాన్ని వెనుకబాటుకు గురిచేశారని మండిపడ్డారు.

# రాష్ట్రమంతా చలిగాలులు

>> వాతావరణంలా వుండేది. అయితే ఈ ఏడాది చలికాలం గత సంవత్సరంతో పోలిస్తే 20 రోజులు ఆలస్యంగా ప్రవేశించిందని చెప్పాలి. సాధారణంగా దసరా పండగ తరువాత అంటే అక్టోబర్ మొదటి వారంలోనే రాష్ట్రంలో చలికాలం మొదలవడం జరుగుతుంది. అయితే ఈసారి ఆలస్యంగా నవంబర్ రెండవ వారంలో చలికాలం వచ్చింది. గత ఏడాది అక్టోబర్ మూడవ వారంలో చలికాలం రాగా ఈ ఏడాది ఆలస్యంగా రావడం గమనార్హం. చలికాలం ప్రభావం వల్ల రాష్ట్రంలో వేడి గాలుల ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. రాత్రి వేళలో, తెల్లవారుజామున చలిగాలుల కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల బడడం తో అన్నిచోట్ల అహ్లాదకర పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం నాడు హైదరాబాద్‌లో పగటిపూట 28 డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా రాత్రి వేళ 21 డిగ్రీ లుగా వుంది. నిన్నమొన్నటి వరకు పగటి పూట ఎండ వేడి 35 డిగ్రీల వరకు వుండగా రాత్రి వేళ 25 డిగ్రీల వరకు వుండేది. రాబోయే రోజుల్లో చలి ప్రభావం వల్ల వాతావరణం మరింత చల్లబడే వీలుందని అధికారులు తెలిపారు. కాగా ఉత్తరాది నుంచి వేడిగాలులకు బదులు శీతల గాలులు రావడం మొదలవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు శుక్రవారం నుంచి ఒక్కసారిగా తగ్గడం మొదలు పెట్టాయి. ఆదిలాబాద్‌లో రా త్రి ఉష్ణోగ్రత 14.7 డిగ్రీలు వుండగా రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 14.7 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 14.8 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 14.9, మొయినాబాద్‌లో 15 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 15.3, సంగారెడ్డి పట్టణంలో 15.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోనూ రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గాయి. కాగా ఈ ఏడాది తెలంగాణలో చలి ప్రభావం ఎక్కువగా వుండే వీలుందని వాతావరణ శాఖ అధికారులంటున్నారు. కాగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చలి ప్రభావం ఎక్కువగా వుండే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. గతంలో తెలంగాణలో అనేకచోట్ల పది డిగ్రీలకు తక్కువగానే నమోదైన ఉదంతాలున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబా ద్ జిల్లాలో చలి ప్రభావం బాగా కనిపించింది. హైదరాబాద్‌లోనూ పది డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాలు వున్నాయి. మరోవైపు రాష్ట్రంలో చలికాలం మొదల వడంతో విద్యుత్ వినియోగం బాగా పడిపోయింది.



పుట్టినరోజు సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌కు యాదగిరిగుట్ట పండితుల ఆశీర్వచనం దృశ్యం

# సిఎం రేవంత్‌కు శుభాకాంక్షల వెల్లువ

### బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రధాని మోడీ, రాహుల్, చంద్రబాబు, మమత, స్టాలిన్ సహా పలువురు ప్రముఖులు

### రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించిన కార్యకర్తలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్8:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు శనివారం నిరాడంబరంగా జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెస్ చెప్పారు. రేవంత్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోడీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మోదీతో పాటు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, కర్ణాటక సిఎం సిద్ధిరామయ్య, తమిళనాడు సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు,ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ పందమూరి బాలకృష్ణలు తెలంగాణ ముఖ్యమంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని, మరిన్ని సంవత్సరాలు ప్రజా సేవ చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి బర్త్‌డే విషెస్‌ను రాహుల్‌గాంధీ చెప్పారు. రేవంత్‌రెడ్డికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మరిన్ని సంవత్సరాలు ప్రజల కోసం ప్రజాసేవలో కొనసాగలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, సచిన్ ఫైలట్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, సుఖ్వీందర్ సింగ్, డిఎంకె నాయకురాలు కనిమొళి, యుకె గారెత్ వ్యాన్ ఓవెన్ తదితరులు సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు చేసే సేవలో భగవంతుడు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని విష్ చేశారు. బిజెపి ఎంపీలు ఈటల రాజేందర్,డాక్టర్ లక్ష్మణ్ రేవంత్‌కు ట్విట్టర్ ద్వారా విష్ చేశారు. అలాగే ప్రముఖ నటులు చిరంజీవి, మహేశ్‌బాబు, అజయ్ దేవ్‌గన్, జూనియర్ ఎన్టీఆర్, రామచరణ్, సినీనిర్మాతలు, డైరెక్టర్లు వంగా సందీప్‌రెడ్డి, అనిల్ రావిపూడి బర్త్‌డే విషెస్ తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఇలాగే ప్రజాసేవలో కొనసాగాలని పేర్కొన్నారు. సిఎం సోదరుడి కుమార్తె వివాహ కార్యక్రమం ఉండటంతో రాష్ట్ర మంత్రులందరూ ఆ వివాహానికి హాజరై అక్కడే సిఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటర్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డికి బర్త్‌డే విషెష్ తెలిపారు. ఆయన ఆయుర్యోగాలతో, ప్రజలకు మరిన్ని సంవత్సరాలు సేవ చేయాలని సీతక్క పేర్కొన్నారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు రేవంత్ రెడ్డికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని జూపల్లి ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు. రేవంత్ రెడ్డి దూరదృష్టితో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు**

సిఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు వేడుకలు చేసుకున్నారు. ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేస్తూ టపాసులు పేలుస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఇప్పటికే పలువురు మంత్రులు, పార్టీల ముఖ్య నేతలు సహా సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చిలుక మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ప్రజా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి. అన్ని వర్గాల ఆశీస్సులు ఉన్న మన ముఖ్యమంత్రికి భగవంతుడు గట్టి బలం, సంకల్పం అందించాలి. ఈ రాష్ట్రానికి మరో 20 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం రేవంత్ రెడ్డికి ఇవ్వాలి అని ఆకాంక్షించారు.

**సీఎంకు యాదగిరిగుట్ట అర్చకులు ఆశీర్వచనం : సీఎం రేవంత్**

రెడ్డి పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్ట అర్చకులచే వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం యాదగిరిగుట్ట వ్రత మండపాన్ని ఆయన పరిశీలించారు.ఈ పరిశీలనలో భాగంగా శ్రీసత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించుకొనుభక్తులకు ఇచ్చే పూజా సామాగ్రి నాణ్యతను పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం శని, ఆదివారాల్లో సెలవులు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లను సక్రమంగా చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్8:** ఢిల్లీ తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద బంజారా జన సంఘం, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ధర్నాకు దిగారు. ఆదివాసీలు, లంబాడీల మధ్య సిఎం రేవంత్ రెడ్డి చిచ్చు పెడుతున్నారని వారు ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని తెలంగాణలో కుట్ర జరుగుతోందని వారు ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని కుట్ర చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సోయం బాపూరావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మంత్రులు సీతక్క, పొంగులేటిపై కూడా చర్యలు తీసుకోవాలని నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనేఏఐసిసి కార్యాలయంవద్ద ధర్నాకువెళుతున్న బంజారా జనసంఘం,గిరిజన విద్యార్థి సంఘం నేతలను తెలంగాణ భవన్ వద్ద ఢిల్లీ పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు.

## రోడ్లకు మహర్దశ

>> అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రహదారుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో రానున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాదిమంది రాష్ట్ర యువతకు ఉపాధి లభించనుంది. రూ. 8,000 వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ చేపడుతామన్నారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే చేపడతామని, దీనిని రూ.20 వేల కోట్లతో నిర్మించనున్నామని, ఈ రహదారి నిర్మాణంతో రాష్ట్ర ముఖచిత్రమే మారుతుందన్నారు. న భూతో న భవిష్యత్తు అన్న రీతిలో రహదారుల నిర్మాణానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలని తెలిపారు.. ఈ పనులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

## కులం, మతం విశ్వాసాల ఆధారంగా రాజకీయాలు చేయం

### సిఎం రేవంత్‌రెడ్డి మాటలు విని షాక్‌కు గురయ్యా: కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**హైదరాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ఇటీవల జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మాటలను విని నేను షాక్‌కు గురయ్యాయనని హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ విజయం సాధించారని దుయ్యబట్టారు. బిహార్‌లో రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ రోహ్తాస్‌లోని దినారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. మేము కులం, మతం, విశ్వాసాల ఆధారంగా రాజకీయాలు చేయమన్నారు. మాకు గెలుపు ఓటములు ఎలా ఉన్నా కులం, మతం, నమ్మకాలపై రాజకీయం చేయమని న్యాయం, మానవత్వం ఆధారంగానే రాజకీయాలు చేస్తామన్నారు. బిహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ప్రజలకు అబద్ధాలు చెప్పి విజయం సాధించాలని చూస్తున్నారని ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నారని రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. బిహార్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ నిజంగా భావిస్తే ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు. చేయాలన్నారు.

## మేం లాప్‌టాప్‌లు ఇస్తే వాళ్లు రివాల్వర్లు ఇస్తున్నారు..

### ఆర్జేడిపై రెండో విడత ప్రచారంలో ప్రధాని మోడీ

**సీతామర్హి(బీహార్), నవంబరు 8:** చదువులో ఉన్నతస్థాయికి చేరేందుకు మేం లాప్‌టాప్‌లు ఇస్తే బీహార్‌లోని జంగిల్‌రాజ్ పార్టీ రివాల్వర్లు ఇస్తున్నారంటూ ప్రధానిమోడీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధానిమోడీ బీహార్‌లోని తేజస్వియాదవ్ ఆధ్వర్యంలోని ఆర్జేడీపైనే విమర్శలతో ధ్వజమెత్తారు. బీహార్ విద్యార్థులకోసం మేం కంపూనయటర్లు, ఫుట్‌బాల్, హాకీస్టిక్‌లు అందిస్తున్నామని, కానీ ఆర్జేడి ప్రజలకు తుపాకులు ఇవ్వడంగురించే మాట్లాడుతోందని, బీహార్‌ప్రజలు తుపాకుల ప్రభుత్వం కోరడంలేదని, వారు ప్రతిపక్షనాయకులకు నిద్రలేని రాత్రులు ఇస్తున్నారని ఎద్దేవాచేసారు. రాష్ట్రంలోని యువతకోసం ఆర్జేడి ఏంచేయాలనుకుంటుందో వారి ఎన్నికల ప్రచారంలో స్పష్టంగాకనిపిస్తోందని, జంగిల్‌రాజ్‌ల పాటలు, నినాదాలు వింటే మీరే షాక్ అవుతారని వారి వేదికలపై అమాయక యువతతో దోపిడీదారులుగా మారాలనుకుంటున్నామని చెప్పాలంటే నిర్బంధం చేస్తున్నారని, బీహార్‌లో పిల్లలు డాక్టర్లు అవ్వాలా దోపిడీదారులు కావాలా అని మోడీ ప్రశ్నించారు. మన పిల్లల్ని చెడ్డవారిగా మారాలని కోరుకునేవారిని మనం గెలిపిద్దామా అని మోడీ బిగ్గరగా ప్రశ్నించారు. ఆర్జేడి కాంగ్రెస్‌లకు పరిశ్రమల్లో ఎబిసిడిలు కూడా తెలియవని మోడీ ఎద్దేవాచేసారు. పరిశ్రమలు ఎలా మూసేయాలోమాత్రమే వారికి తెలుసని విమర్శించారు.

## తుంగభద్ర ఆయకట్టుకు క్రాప్ హాలిడే

### యాసంగి పంటలకు సాగునీరు బంద్

### సాగుపై ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో యాసంగి పంటలకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ మేరకు దీనికి సంబంధించి అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని రాజోలీబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆయకట్టు పరిధిలోని 1,17,559 ఎకరాల విస్తీర్ణానికి యాసంగి సాగుకు నీటి ఎద్దడి ఏర్పడనుంది. రాష్ట్రం లోని గద్వాల తదితర జిల్లాల పరిధిలోని రైతులు ఆర్డీఎస్ ప్రాజెక్టు నీటిపైనే యాసంగి పంటలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా అలంపూర్ నియోజకవర్గంలో 87,500 ఎకరాలకు టీబీ డ్యాం ద్వారా యాసంగి పంటలకు సాగునీరు అందాల్సి ఉన్నది. యాసంగిలో వరి, జొన్న, వేరుశెనగ, కంది, పత్తి తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కానీ ఈ యాసంగి పంటల సాగుకు క్రాప్‌హాలిడే ప్రకటించారు. ఇప్పటివరకు కేవలం వరద జలాలను వినియోగించారు. వచ్చేనెల 20 వరకు ఆర్డీఎస్ ఆయకట్టుకు జరిపిన కేటాయింపు నీటిని మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నదని, మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఆర్డీఎస్ ఆయకట్టులో యాసంగి పంటలకు సాగునీరు అందించే వీలు లేదని, రైతులు గ్రహించి, యాసంగి పంటల సాగుపై పునరాలోచన చేయాలని సూచించారు. టీబీ బోర్డు నిర్ణయంతో ఆర్డీఎస్ ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారే అవకాశాలు ఉన్నాయని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



## రోడ్డు పక్కన చెల్లాచెదురుగా వివి పాట్ స్లిప్పులు

### బీహార్‌లో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

### ఎఆర్‌ఒ సస్పెన్షన్, కేసు నమోదు

**సమస్తిపూర్(బీహార్), నవంబరు 8:** భారీ సంఖ్యలో వివిపాట్ స్లిప్పులు రోడ్డు పక్కన పడి ఉండటం తీవ్రస్థాయిలో వివాదం చెలరగేడంతో ఎన్నికల సంఘం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఒకరిని సస్పెండ్‌చేసి ఆయనపై కేసునమోదుకు ఆదేశించింది. సరైరంజన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఉన్న ఒక కళాశాల సమీపంలో రోడ్డుపక్కన ఈ వివిపాట్ స్లిప్పులు భారీ సంఖ్యలో చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని విపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసాయి. అంత ే కాకుండా సోషల్‌మీడియాలో ఈ స్లిప్పులు బయటపడిన ఉదంతాన్ని వైరల్ చేసారు. జిలా మేజిస్ట్రేట్ ఎన్నికల అధికారిని ఈ స్లిప్పులు పడి ఉన్న ప్రాం తానికి వెళ్లి తనిఖీచేయాలని ఆదేశించామని, అంతేకాకుండా సమగ్ర నివేదికను కోరినట్లు ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది. అయితే ఈ స్లిప్‌లు మాక్‌పోల్‌కు సంబంధించినవని, ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా రాజీ పడలేదని, నిష్పాక్షికంగా జరిపించామని సిఇఒ కార్యాలయం తన ప్రకటనలో వివరించింది. పోటీచేస్తున్న అభ్యర్థులందరికీ కూడా జిల్లామేజిస్ట్రేట్ సమాచారం ఇచ్చారని, ఎఆర్‌ఓను నిర్లక్ష్యానికి బాధ్యునిచేసి సస్పెండ్‌చేసామని ఎఫ్‌ఐఆర్ కూడా రిజిస్టరు అయిందని సిఇఒ కార్యాలయం వెల్లడించింది.

## రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో కలిసి ఆఫ్రికా వెళ్లిన ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి విదేశీ యాత్రలకు బిజెపి ఎంపి డికె అరుణ వెళ్లారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలం గాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. ఈ పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డికె అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్ ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడింప చేస్తుంద ్నారు.



## ఘనా దేశంలో సింగరేణి పెట్టుబడులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం తదితర ఉత్పత్తులకు ప్రముఖ దేశంగా పేర్కొనే రిపబ్లిక్ ఆఫ్ ఘనా దేశం సింగరేణి సంస్థను తమ దేశంలో పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. హైదరాబాద్‌లో శనివారం ఘనా దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి సిఎండి ఎన్. బలరామ్ తో సమావేశమైంది. ఈ సందర్భంగా ఘనా దేశ ప్రతినిధి బృందం మాట్లాడుతూ తమ దేశం లో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని, ఈ విషయంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామన్నారు. తమ దేశంలో ప్రధానంగా వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్ , లిథియం వంటి పలు ఖనిజాల తవ్వకం, ఉత్పత్తులు పెద్ద ఎత్తున జరుగుతుంటాయని విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటామన్నారు. అయితే ఉత్పత్తి పెంచడానికి ఇందుకు అవసరమైన పెట్టుబడులను ఆహ్వానించడం కోసం వచ్చామని, మైనింగ్ లో ఎంతో అనుభవం ఉన్న సింగరేణి సంస్థ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ కూడా ఉందని, ఇందులోనూ సింగరేణి సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై బలరామ్ స్పందిస్తూ తమ సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా విదేశాల్లో కీలక ఖనిజ రంగాల్లో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించి ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఘనా దేశంలో కూడా మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజ తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక బృందం కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానుందని ఆ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. ఆ సమయంలో మరో దఫా సమావేశం కావాల్సిందిగా, అలాగే తమ దేశానికి సింగరేణి బృందాన్ని కూడా పంపించాల్సిందిగా వారు సీఎండీని కోరారు. ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, రాయబారి అహ్మద్ ఉమర్ సాండా, స్టాండర్డ్స్ బోర్డ్ ఛైర్మన్ మొగ్తారి హుదు తదితరులు ఉన్నారు.



## సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బులో రూ.5 లక్షలు జప్తు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ఎపికె ఫైల్ ద్వారా ఓ విశ్రాంత ఉద్యోగిని బురిడి కొట్టించి అతని ఖాతా నుంచి పది లక్షల రూపా యలను కొట్టేసిన సైబర్ నేరగాళ్లకు సైబర్ క్రైం పోలీసులు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగి నుంచి కొట్టేసిన డబ్బులో ఐదు లక్షల రూపాయలను సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలలో వుండగా జప్తు చేశారు. వివరాలు ఇలావున్నాయి. ఈ నెల నాలుగవ తేదీన నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యో గి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆన్‌లైన్ సేవ విభాగంలో తన ఫించన్ కోసం వాకబు చేస్తుండగా ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు అతని సెల్‌ఫోన్ వా ట్సాప్‌కు ఎపికె ఫైల్‌ను పంపారు. తాము పంజాబ్ నేషనల్ బ్యాంకుకు చెందిన అధికారులమని నమ్మించారు. అతని నుంచి పూర్తి వివరాలు సేకరి ంచారు. అనంతరం నిమిషాల వ్యవధిలో అతని బ్యాంకు ఖాతా నుంచి పది లక్షల రూపాయలను కాజేశారు. దీనిపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు విచారణ చేబట్టారు. బాధితుడి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు ఆ నగదును పలు మ్యూల్ ఖాతాలలో వుంచగా అందులో నగదు వున్న ఖాతాలను జప్తు చేశారు. వీటిలో ఐదు లక్షల రూపాయలున్నాయి. ఈ డబ్బులను బాధితుడికి ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో బాధితుడిని మోసం చేసిన నేరగాళ్ల కోసం గాలిస్తున్నారు.

### స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర లేనివారు

## వందేమాతరంపై మాట్లాడడమా?

### ముంబయి హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ కోల్సే పాటిల్




మాట్లాడుతున్న ముంబయి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోల్సే పాటిల్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), నవంబరు 8, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర పోరాటంలో పాత్ర లేనివారు వందే మాతరం గురించి మాట్లాడ్డం విడ్డురంగా ఉందని ముంబై హైకోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోల్సే పాటిల్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ పౌరహక్కుల సంఘం 8 వ మహాసభలు రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. జస్టిస్ పాటిల్ మాట్లాడుతూ సంఘ్ పరివార్ ఈ దేశ మూల సూత్రానికి భిన్నంగా పనిచేస్తోందని అన్నారు. వనరుల దోపిడీ కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ మావోయిస్టులను హతమార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఎన్నో నేరాలకు పాల్పడిన నరేంద్ర మోడీ, అమిత్ షాలను కూడా ప్రాసిక్యూషన్ చేయాలనీ, రాజ్యాంగ బద్ధమైన హోదాలలో కొనసాగే నైతిక హక్కు లేదని స్పష్టం చేసారు. నక్సలైట్లను తీవ్రవాదులతో సమానంగా చూడడం సరికాదని, వారు తీవ్రవాదులైతే పహల్గావ్, పుల్వామా, సింధు ఘటనల్లో విశ్వసనీయత లేదన్నారు. జీవి తాంతం సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మనోరంజన్ మొహంతి మాట్లాడుతూ ఆదివాసీలు అనాదిగా స్వరాజ్యం కోసం, స్వతంత్రం కోసం పోరాటం చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. హక్కుల చట్టాలు పోరాటం చేస్తేగాని లభించలేదని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండి అమలు చేయాల్సిన నైతికత ఉందని ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఇందిరాగాంధీ మొదలు మోడీ వరకు ప్రాథమిక హక్కుల అణచివేతే తప్ప ప్రజాస్వామికంగా పరిపాలనకు ఈ దేశ ప్రజలు నోచుకోలేకపోతున్నారని, కనీసం భావ ప్రకటనా స్వేచ్ఛ. ప్రశ్నించడానికి కూడా ఆస్కారం లేని పరిస్థితులు కొనసాగుతున్నదని విమర్శించారు. ప్రతిఘటన ద్వారానే పరిష్కారం సాధ్యమనే సహజ సూత్రీకరణకు అనుగుణంగా ఇప్పుడు ప్రభుత్వాలను పౌరహక్కుల కార్యకర్తలు, సంస్థలు నిలదీసి సాధించుకోవాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకుడు ప్రొఫెసర్ జి.హర గోపాల్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ డి.నరసింహ రెడ్డి, ఛత్తీస్ ఘడ్ సామజిక కార్య కర్త బేలా భాటియా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడలకు 59 మంది ఇఎంఆర్‌ఎస్ విద్యార్థులు

### రాష్ట్రస్థాయి క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ ఇఎంఆర్‌ఎస్



రాష్ట్రస్థాయి ట్రోఫీతో విద్యార్థులు, ప్రిన్సిపాల్

**చింతూరు, నవంబరు 8, ప్రభాతవార్త:** చింతూరు మండలం లక్కవరం కేంద్రంగా నిర్వహించ బడుతున్న ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రస్థాయి క్రీడల్లో చరిత్ర సృష్టించింది. మొత్తం 28 ఇఎంఆర్‌ఎస్ పాఠశాలల రాష్ట్రస్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. అదే పాఠశాలకు చెందిన 59 మంది విద్యార్థినీవిద్యార్థులు ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలోని రూర్కెలాలో ఈనెల 10వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రిడలకు ఎంపిక అయ్యారు.
ఎపిలోని మొత్తం 28 ఎకలవ్య మోడల్ పాఠశాలల నుండి జాతీయ స్థాయి క్రిడలకు 428 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయితే వారిలో చింతూరు ఇఎంఆర్‌ఎస్ నుంచి 59 మంది విద్యార్థినీవిద్యార్థులు ఎంపిక కావటం మరో విశేషం. అదే పాఠశాలకు చెందిన ప్రధానాచార్యులు డాక్టర్ ధలీప్‌సింగ్‌ను ఎపిలోని ఇయంఆర్‌యస్ పాఠశాలల నుండి ఓవరాల్ కంటిన్‌జెంట్ మేనేజర్‌గా సైతం భాద్యతలు అప్పగించారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి కేంద్రంగా మొత్తం ఎపిలోని 28 ఇయంఆర్‌యస్ పాఠశాలలకు రాష్ట్రస్థాయి క్రిడా పోటిలను ఈనెల 3నుండి 5వరకు నిర్వ హించారు.
మొత్తం 980 మంది విద్యార్థిని,విద్యార్థులు ఈ క్రిడల్లో పాల్గొనగా చింతూరు ఇఎంఆర్‌ఎస్ సంగీతం, కళలు, సాహిత్య కార్యక్రమాల్లో 13 బహుమతులు గెలుపొంది రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ సాధిం చింది. దాంతో రాష్ట్రస్థాయి 2025 సాంస్కృతిక, సాహిత్య ఉత్సవం చాంపియన్‌గా ఇఎం ఆర్‌ఎస్ చింతూరు ఎంపిక అయినట్టు ప్రకటించారు. మన్యంలో మారుమూల ఉన్న పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్ కావటం, జాతీయ స్థాయి పోటీలకు అదే పాఠశాల నుండి 59 మంది విద్యార్థినీ,విద్యార్థులు ఎంపిక కావటం మన్యం ప్రాంతానికే గర్వకారణంగా మారింది.

### చేవెళ్ల రోడ్డుప్రమాద కారకుడు టిప్పర్ డ్రైవర్ ఆకాష్‌కామ్లే

## మద్యం తాగలేదని ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదిక

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మిర్జాగూడలో ఈ నెల మూడవ తేదీ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అనే క కుటుంబాలను ఛిద్రం చేయడం తెలిసిందే. తాండూరు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును చేవెళ్ల నుంచి వికారాబాద్ వైపు ఓవర్ లోడ్ కంకరతో ఓవర్ స్పీడ్‌లో వెళుతున్న టిప్పర్ ఢీకొనడం వల్ల జరిగిన ఈ ఘటనలో మొత్తం 19 మంది మరణించడం విదితమే. మృతుల్లో టిప్పర్ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కామ్లే కూడా వున్నాడు. వాహనం నడిపే సమయంలో అతను మద్యం తాగివున్నట్లు అనుమానాలు రావడంతో అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సమయంలో అతని శరీరంలో ఏమైనా మద్యం ఆనవాళ్లు వున్నాయేమోనని పరీక్షించారు. అనంతర ం ఎఫ్‌ఎస్‌ఎల్ నిపుణులను కూడా సంప్రదించారు. నిపుణుల పరీక్షలో కామ్లే మద్యం తాగినట్లు నిర్ధారణ కాలేదు. ఇదే విషయాన్ని సైబరాబాద్ ఉన్నతాధికారులు శనివారం మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. అయినప్పటికీ దీనిపై తుది నివేదిక వచ్చాకే అధికారికంగా ప్రకటిస్తామని వారు వెల్లడించారు.

## డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టిన ఇన్నోవా.. హైవేపై దగ్ధం

**చిట్యాల రూరల్, నవంబరు 8, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామశివారులో జాతీయ రహదారిపై శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాదుకు చెందిన ప్రకాష్ పటేల్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇన్నోవా కారులో హైద రాబాదు నుంచి చైన్నై కు బయలుదేరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారుకు రాగానే యూటర్న్ వద్ద తెల్లవారుజామున డివైడర్ ను ఢీ కొట్టి పల్టీ కొట్టి అవతలి వైపు రోడ్డుపై అడ్డుగా పడింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారు గమనించి వెంటనే బయటకి వచ్చారు. ప్రమాదం చోటు చేసుకున్న కారులో 8 మంది ఉండగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికంగా ఉన్నటువంటి వాహనదారులు కారు పల్టీ పడిన వెంటనే కారులో ఉన్నవారికి సహాయం అందించడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే కారులో మంటలు చెలరేగుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శకటం వచ్చేలోగా కారు పూర్తిగా దగ్ధమైంది. ఈప్రమాదంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై అడ్డంగా పడడంతో అక్కడ కొద్దిసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్ హెచ్‌ఏఐ, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వాహనాన్ని పక్కకు తరలించి, ట్రాఫిక్ ను నియంత్రించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక వాహనదారులు వారికి సహాయం అందించడంతో స్థానిక ఎస్సై మామిడి రవికుమార్ వారిని అభినందించారు.




## రాత్రికిరాత్రి రూ 240 కోట్లకు అధిపతి అయిన భీమవరం వాసి!

**సత్తుపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త:** సామాన్య రైతు కుటుంబంలో జన్మించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు లాటరీ టికెట్ ద్వారా రాత్రికి రాత్రి కోట్లకు అధిపతి అయిన బృహత్తర సంఘ టన వెలుగు చూ సింది. వివరాల్లో కెళితే.. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండలం భీమవరంలో గొల్ల మాధవరావు, తల్లి గొల్ల భూలక్ష్మి ్మ దంపతుల కుటుంబంలో జన్మించిన గొల్ల అనిల్ కుమార్ యేడాదిన్నరగా యూఏఈలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన తల్లి పుట్టినరోజు 11 అనే సంఖ్యతో టిక్కెట్టు కొనుగోలు చేసి దుబాయిలో నిర్వహించే లాటరీ దక్కించుకున్నాడు. ఆ దుబాయ్ లాటరీ టికెట్ పేరుతో రాత్రికిరాత్రే 240 కోట్ల రూపాయలు విలువగల లాటరీ టికెట్ తగల డంతో అనిల్‌కుమార్ రాత్రికి రాత్రి జీవితం మారి కోట్లకు అధిపతి అయ్యాడు. యువకుడు ఉద్యోగరీత్యా కొంతకాలంగా యూఏఈలో జీవిస్తున్నట్లు గ్రామ వాసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడికి అన్ని కోట్ల రూపాయల విలువైన లాటరీ తగలటంతో గ్రామంలో పలువురు ఆ కుటుంబానికి అభినందనలు తెలిపారు.



## కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో జియోకు 2 ఎకరాలు కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో రిలయన్స్ కంపెనీ జియో డిజిటల్ ఫైబర్ ప్రైవేట్ లిమిటెడ్ దాదాపు 2 ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వం కేటాయించింది. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో ఈ భూమిని ఇచ్చారు. ఆ సంస్థ ఆ భూమిలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ చేయనుంది. ప్రభుత్వం కొన్ని షరతులతో జీఓ విడుదల చేసింది. కేంద్ర అటవీ నిబంధనలకు లోబడి ఈ భూమిని కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి లక్ష్మణ్

## వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు బిజెపిపై నిందలా?

### కాంగ్రెస్‌పై ఎంపి డా.లక్ష్మణ్ ఆగ్రహం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు బిజెపిపై నిందలు వేస్తుందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాయలంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ఫ్రస్టేషన్లో ఉన్న సిఎం రేవంత్‌రెడి బిజెపిపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటికొక ఉద్యోగం అంటూ.. మీ మిత్రుడు బిహార్లో హామీ ఇచ్చారు. ఏడు కోట్ల మంది ఉన్న బిహార్‌లో ఇంటికొక ఉద్యోగం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు మీరిచ్చే గిఫ్ట్ ఏంటో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ చెట్టాపట్టాలు వేసుకొని అధికారాన్ని పంచుకున్నారని ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం ఇంకా దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు. పాముకు పాలు పోసి పెంచినట్టు.. పాతబస్తీలో ఎంఐఎంకు అవకాశం ఇస్తే ఈరోజు విష నాగుల మాదిరిగా పరిస్థితి తయారైందని అన్నారు.

# దూకుడు పెంచిన హైడ్రా.. 954 కబ్జాల తొలగింపు

### 1,045.12 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ

### వాటి విలువ రూ. 50వేల కోట్ల పైనే..

### ప్రజల మద్దతు మాకు స్ఫూర్తి : హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** సామాజిక మాధ్యమాలు వేదికగా.. వేల ఇళ్లను హైడ్రా కూల్చిందంటూ కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని ర్యాలీలు, ప్రదర్శనల ద్వారా తిప్పి కొట్టిన వారికి హైడ్రా ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన మద్దతు హైడ్రాకు మరింత స్ఫూర్తినిచ్చింది అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని.. పర్యావరణ హితమైన నగరంలో ప్రజలు మెరుగైన జీవనాన్ని కొనసాగించాలనే ప్రభుత్వ లక్ష ్యం మేరకు హైడ్రా పని చేస్తోందని స్పష్టం చేశారు. హైడ్రా వల్ల జరిగిన మేలును వివరిస్తూ.. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలపడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా వల్ల లక్షల మందికి లాభం చేకూరిందంటూ.. నగరవ్యాప్తంగా జరిగిన మేలును వివరిస్తూ ప్లకారు లు ప్రదర్శించి తీరుమాలో స్ఫూర్తిని నింపిందన్నారు. మీడియా సంస్థలతో పాటు.. చాలా వరకు సామాజిక మాధ్యమాలు కూడా హైడ్రా కార్యక్రమా లను ప్రజలవద్దకు చేరవేసిన తీరును అభినందిస్తు న్నామన్నారు.

**చట్టాలను గౌరవిస్తూనే..**

చట్టంలో ఉన్న అక్షరాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం, ఆంతర్యం, లక్ష ్యం తెలుసుకుని హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ తెలిపారు. రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టాలపైన హైడ్రాకు ఎనలేని గౌరవం ఉందని.. వాటి స్ఫూర్తితోనే ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్నా మ న్నారు. పేదవారిని అడ్డం పెట్టుకొని బడాబాబులు సాగిస్తున్న కబ్జాలను వెలికి తీస్తుందన్నారు. ధనదాహంతో ఇష్టానుసారం కబ్జాలు చేసి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నవారు హైడ్రాపై దాదాపు 700ల వరకూ కేసులు పెట్టారని.. వ్యక్తిగతంగా తనపై కూడా 31 వరకూ కంటెంప్ట్ కేసులు వేశారని గుర్తు చేశారు. చట్టాలను గౌరవిస్తూ.. ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో పర్య వరణాన్ని, ప్రజల ఆస్తులను పరిరక్షి ంస్తామన్నారు. ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన విధంగా చెరువులు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు పని చేస్తున్నామన్నారు. 2024 జూలైకి ముందు నుంచే నివాసం ఉన్నవారి ఇళ్ళ జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేశారు. తప్పనిసరి అయి తొలగించాల్సివస్తే వారికి ప్రత్యామ్నాయం, పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. హైడ్రా ఏర్పాటయిన నాటి నుంచి నేటి వరకు మొత్తం 181 డ్రైవ్స్ నిర్వహించి 954 కబ్జాలను తొలగించామని మొత్తం 1,045.12 ఎకరాల భూమిని హైడ్రా కాపాడిందని.. వీటి విలువ సుమారు ..50,000 కోట్ల నుండి ..55,000 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఇందులో ప్రభుత్వ భూములు 531.82 ఎకరాలు కాగా.. రహదారుల కబ్జాలు 222.30 ఎకరాల వరకూ ఉన్నాయి. చెరువుల కబ్జా 233.00 ఎకరాలు, పార్కుల కబ్జాలు 35 ఎకరాలు ఇలా.. మొత్తం 1045.12 ఎకరాలను హైడ్రా స్వాధీనం చేసుకుందన్నారు. వర్షాలు వచ్చినప్పుడు కాకుండా.. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడంతో.. ఈ ఏడాది వరదలు చాలావరకు నియంత్రించామన్నారు. క్యాచ్‌పిట్స్ క్లీనింగ్ 56,330, నాళాల క్లీనింగ్ 6,721, నీటి నిల్వ పాయింట్లు క్లియర్ చేయడం 10,692, కల్వర్టు క్లియర్ చేయడ వల్ల 1,928, ఇతర పనులు 21,301 ఇలా మొత్తం 96,972 పనులు హైడ్రా ఈ వర్షాకాలంలో చేపట్టిందన్నారు.
అలాగే రూ. 58.40 కోట్లతో చెరువుల పునరుద్ధరణ చేపట్టామని మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల్లో ఇప్పటికే బతుకమ్మకుంట ప్రారంభమవ్వగా.. తమ్మిడికుంట (మాధాపూర్),కూకట్‌పల్లి నల్ల చెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్ ఉద్‌దౌలా చెరువులు ఈ నెలాఖరుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సున్నం చెరువు (మాదాపూర్), నల్లచెరువు (ఉప్పల్) చెరువుల పునరుద్ధరణతో వరద ముప్పును తగ్గించామని అంతే కాకుండా చెరువుల ఆక్రమణలను తొలగించి 105 ఎకరాల నుండి 180 ఎకరాలకు పెంచామన్నారు. 75 ఎకరాల భూమి తిరిగి ప్రజలసొంతమయింది. బతుకమ్మకుంట పునరుద్ధరణతో అక్కడ లోతట్టు ప్రాంతాలను, కూకట్‌పల్లి నల్లచెరువుతో చుట్టూ ఉన్న బస్తీలు, తమ్మిడికుంటతో శిల్పారామం ప్రధాన రహదారిపై వరద లేకుండా చేశామని కమిషనర్ తెలిపారు. ప్రాధాన్య క్రమంలో మరిన్నిచెరువులు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోందని చెప్పారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ సమీపంలోని మీర్జాగూడలో కంకర లారీ, ఆర్టీసి బస్సు ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మంది మృతిచెందిన సంఘటనతో తెలంగాణ ప్రజలు ఉలిక్కిపడి నిద్రలేచి ఉక్కిరి బిక్కిరి అవుతుండగా సోమవారం రోజునే యాదృచికంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రమాద భరితమైన రోడ్డు విస్తరణకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయరహదారి 163రంగారెడ్డి జిల్లాలోనిమొయినాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ మధ్య విస్తరణకు అనుమతి ఇచ్చింది. జాతీయ రహదారి 163 రెండు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరణచేయడానికి ఎనిమిది ఏళ్ల క్రితం సిద్ధంకాగాహైదరాబాద్‌కు చెందినకొంత మంది పర్యావరణ ప్రియులు జాతీయ



హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా రోడ్డు విస్తరణలో భాగంగా900 మర్రి చెట్లను నరికి వేసేందుకు సిద్దం కాగా వాటిని సంరక్షించేందుకు నగరంకు చెందిన పర్యావరణ వేత్తలు అడ్డుచెప్పారు. దీనితో రోడ్డునిర్మాణం విస్తరణ పనులు హరితట్రిబ్యునల్‌లో ఎటు తేలకపోవడంతో సంవత్సరాలుగా నిలిచిపోయాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పట్టు వదలకుండా రోడ్డువిస్తరణకు కేసు ఉపసంహరణకు అనేకమార్గాలు ప్రత్యామ్నాయగా చూపినాఎన్‌జిటి మాత్రం పర్యావరణ, అటవీవాతావరణమార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ మదింపు కమిటీమార్చి 2025లో మర్రి చెట్లను కాపాడేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని సిఫార్సునుఅనుసరించి ఎన్‌జిటి రోడ్డువిస్తరణను అబయన్స్‌లో పెట్టింది.

# మరణమృదంగం మోగిస్తున్న రహదారులు

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

జాతీయ రహదారి 163పై చెవెళ్ళ సమీపంలో మీర్జాగూడలో కంకర లారీ, ఆర్టీసి బస్సు ఢీకొన్నసోమవారం నాటి రోడ్డు ప్రమాదం దేశంలో జరిగే అనేక ప్రమాదల తరహాలో బాధిత కుటుంబాలలో విషాదం నింపి ప్రభుత్వం నమోద చేసే ప్రమాదాల చిట్టాలలో చేరుకొంది. రోడ్ల నిర్మాణాలలో లోపాలు, అతివేగం, లైసెన్స్‌ల జారీలో అక్రమాలు, డ్రైవర్ల బాధ్యతారాహిత్యం భద్రతా ప్రమాణాలు అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి రహదారులు రక్తంతో తడుస్తునాయి. చెవెళ్ళ సంఘటనలు ఎన్ని జరిగినా భారతదేశంలో ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన హేతువైన రోడ్ల స్థితిగతులను సంస్కరించబడవు. దేశంలో రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతూ యుద్ధం ఉగ్రదాడులకు మించి మరణమృదంగం మ్రోగిస్తున్నాయి. భారత దేశంలో గత సంవత్సరం 4,79,753 ప్రమాదాలు సంభవిచాయి. ఒకలక్షా 73వేల మంది మృతిచెందగా, ఐదులక్షల మంది తీవ్రగాయాలపాలైనారు ఇందులో లక్షా పదివేల మంది జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నారు. ప్రతి గంటకు 55ప్రమాదాలు, 20 మరణాలు సంభవిస్తున్నాయి. అమెరికా, కెనడావంటి అభివృద్ధిచెందిన దేశాలలో వంద ప్రమాదాలలో కనిష్ఠంగా ఒకరు గరిష్ఠంగా ఇద్దరు చనిపోతుంటే భారతదేశంలో వంద ప్రమాదాలకు32నుంచి 33మంది వరకు చనిపోతున్నారట. అంతర్జాతీయ రహదారి సమాఖ్య ప్రకారం, ఒక ప్రాణం కోల్పోతే రూ.4కోట్ల నష్టం జరుగుతుంది. భారత దేశవ్యాప్తంగా రహదారి ప్రమాదంలో రోజుకు పాదాచారులు, బస్సులు, లారీలు నడిపేవారు, కార్లు, జీపులు ద్విచక్రవాహన దారులు సగటున నాలుగు వందల మందికిపైగా చనిపోతున్నారు. అరుదుగా జరిగే ఒక ఖండాంతర విమాన ప్రమాదంలో చినిపోయే ప్రయాణీకుల సంఖ్యకంటే ఇది అధికం. విమాన ప్రమాదాలు సంభవిస్తే ప్రభుత్వాలు వెంటనేపూనుకొని అలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకొంటాయి. అనేక సంస్థలతో భద్రతపై విచారణలు జరిపి వాటిని నియంత్రిస్తాయి. రోడ్డు ప్రమాదాలకు కాలం చెల్లిన, సరైన ఫిట్‌నెస్ వాహనాలు, రోడ్లు, మానవ తప్పిదాలు వంటి ప్రధాన కారణాలున్నప్పటికి మన పాలకులు అంత వేగంగా స్పందించరు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయేవారు అత్యధికంగా పేదలు ఉంటారు. అందుకే ఏలాంటి విచారణలు ఉండవు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 15లక్షల కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. తెలుగురాష్ట్రాలను ఇటీవల కర్నూలు జిల్లా చిన్నటేకూరులో బస్సు దగ్ధం సంఘటన కుదిపివేసింది. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా దారులు వెతకడం కంటే యాజమాన్యంను రక్షించడానికి మన ప్రభు



త్వాలు శ్రద్ధవహించాయి. ఓబైకును ట్రావెల్స్ బస్సు ఢీకొన్నది. అనంతరం 300మీటర్ల వరకు బైక్‌ను లాక్కొని వెళ్లిపోయింది. బైక్ బస్సు కిందిభాగంలో చిక్కుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈక్రమంలో బస్సు మొత్తానికి మంటలు వ్యాపించడంతో క్షణాల్లోనే కాలి బూడిదైంది. అయితే బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 19మంది ఎమర్జెన్సీ డోర్ పగులగొట్టుకుని నుంచి బయటకు వచ్చారు. మిగిలినవారు కాలిబూడిదయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 41మంది ప్రయాణికులున్నారు. వారిలో 11మంది సజీవ దహనమయ్యారు. మరణించిన 19మంది మృతదేహాలను వెలికితీసిన అధికారులు అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు చేసి వారి బంధువులకు అప్పగించారు. బస్సు ఫిటెనెస్ పై అనేక అనుమానాలు అటువైపు ప్రజల దృష్టి మళ్ళించకుండా బైకర్‌దే పూర్తిగా తప్పనే రీతిలో కేసును తప్పుదారి పట్టించడానికి మాత్రమే పూర్తిశక్తి యుక్తులను మన పాలకులు కేంద్రీకరించారు. ప్రైవేటు బస్సులు ప్రమాదానికి గురైనప్పుడు డ్రైవర్లతో పాటు యజమానులను కూడా బాధ్యులను చేసే అంశంపై కూడా ప్రభుత్వం ఉదాసీనత ఉంటుంది. ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించడానికి రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించడంలేదు. కార్తీకపౌర్ణమి రోజు జగిత్యాల డిపో బస్సులో 170మంది ప్రయాణిస్తుంటే దాని రెండు చక్రాలు వూడిపోయి ప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏం నష్టం జరగలేదు. 2014 నుండి తెలంగాణలో 2.57 లక్షల ఘటనలు జరిగాయి. ఈ ఘటనలలో 83 వేల మందికి పైగా మరణించారు. పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన యువత, నడివయస్సు వ్యక్తులు ఎక్కువగా బలవుతున్నారు. ప్రమాదం నింపిన శోకం ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా కూడా కుంగదీస్తున్నది. వాహనాల తయరీలో అధునాత భద్రత అంశాలు జోడిస్తున్నప్పటికి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆధునిక బ్రేకింగ్ వ్యవస్థలు, ఎయిర్ బెలూన్లు అందుబాటులోకి వచ్చినా సీట్‌బెల్ట్ వంటివి పెట్టుకోకపోవడంతో అవి సకాలంలో తెరుచుకోని పరిస్థితి నెలకొంది. మనదేశంలోపాదాచారుల భద్రత విషయంలో ఏమాత్రం శ్రద్ధతీసుకోవడంలేదు. అభివృద్ధి చెందిన దేశాలలో పాదాచారులకు ప్రత్యేకంగా విలువ ఇవ్వడంతోపాటు వారి ఫుట్‌పాత్‌లుంటాయి. మోటారువాహనాలకు సైకిళ్ళకు ద్విచక్రవాహనాలకు వేర్వేరు మార్గలు ఉండేలా మనం శ్రద్ధ తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రాణాంతకంగా అంబులెన్స్ ఆలస్యం ప్రమాదాల బారినపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలిస్తే బాధితుల ప్రాణాలను కాపాడుకోవచ్చు కానీ మనం 108కి ఫోన్ చేసి చేతులు దులుపుకొంటున్నాం. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో అనేక మంది ప్రాణాలు వదులుతున్నారు. ఆసుపత్రికి రోడ్డు ప్రమాదబాధితుడి తరలించడం వల్ల ఏదైనా చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయే శంకతో కూడా అనేక మందికి బాధితుడికి సహాయం చేయాలే తపన ఉన్నప్పటికి సాహసం చేయలేకపోతున్నారు. చట్టం ప్రకారం ఎటువంటి ఇబ్బందులు ఉండవు కానీ మనపోలీసుల అత్యుత్సాహ ప్రవర్తన కూడాసాయం చేసే చేతులను కట్టడిచేసేలా చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. రోడ్డుప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు జనంలో చైతన్యం నింపేందుకు అవగాహన పెంచాలి. ప్రమాదాల కారణంగా ప్రాణాలు మాత్రమే పోవడంలేదు మన జిడిపిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. రాష్ట్రరోడ్డు భద్రత నిధికి సుప్రీంకోర్టు భద్రతా కమిటి సిఫార్సు చేవెళ్ల రోడ్డు ప్రమాదం పైదృష్టి సారించిన సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డుభద్రత నిధినిఏర్పాటుచేయా లని సూచించింది. సుప్రీంకోర్టు నియమించిన రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహార్ సప్రే తనసభ్యులు సంజయ్ బందోపాధ్యాయ ఇవాళ హైదరాబాద్‌కు గురువారం వచ్చి చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సంబంధిత శాఖల అధికారుల తో సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కమిటీ అడిగి తెలుసుకుంది. సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి ప్రమాదం జరగడానికిగల కారణాలను కమిటీకి తెలియ జేశారు. ఆర్టీసీబస్సుల ఫిట్‌నెస్ మరోసారి తనిఖీ చేయాలని, వాటితో పాటు ఇతర బస్సులు, కమర్షియల్ వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్‌చేయాలని అధికారులను కమిటీఆదేశించింది. ప్రతివాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్నెస్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తి చేయాలని ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులకు సూచించారు. మైనింగ్ క్వారీల నుంచి పరిమితికి మించి లోడ్ వెళ్లకుండా చూడాలని మైనింగ్, రవాణా శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారతదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీచేయడంలో కూడా అలసత్వం నెలకొంది. ట్రాఫిక్ నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఫోటోగ్రాఫర్లుగా మారికేవలంచాలానాలు వేయ డమే తమ ప్రాథమిక విధిఅన్నట్లు వ్యవహరిస్తున్నారు. డ్రైవింగ్ చేసేవ్యక్తి ఆ వాహనం నిర్వహించే శక్తి యుక్తి ఉందా ఆయనలో రక్షణాత్మక డ్రైవింగ్ విధానం ఉందా డ్రైవింగ్ నైపుణ్యం, రోడ్డుచిహ్నం అర్థం చేసుకొనే పరిజ్ఞానం ఉందా అనేవిషయం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా లైసెన్స్ జారీచేస్తున్నారు. ఇప్పుడు ఎంతోమంది డ్రైవింగ్‌తోఉపాధి పొందుతున్నా వారికి సరైన శిక్షణ లేదు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో చేయకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలి. ●

# ఆ 'పది' ఎవరిది?

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

యుద్ధంలో మొదటి అంకం పూర్తయింది. అధికార, విపక్ష శిబిరాలలోని క్షతగాత్రులు తమకు తగిలిన గాయాలకు లేపనం రాసుకొంటూ మలివిడతపోరాటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎవరి శిబిరాలలో వారు అంచనాలు వేసుకోవడం సాధారణమే అయినా, ఈసారి ఒక అసాధారణ దృశ్యం బీహార్ పోలింగ్‌లో కనిపించింది. అది పోలింగ్ దాదాపు పది శాతం పెరగడం. ఈ పెరుగుదల పట్ల పరిశీలకులే కాదు, రాజకీయ పార్టీల నేతలు కూడా ఆశ్చర్యపోతున్నారు. ఇసి అనుసరించిన 'సర్' వల్ల గత గురువారం (6, నవంబరు) మొదటి విడత జరిగిన 121 నియోజకవర్గాలలో దాదాపు 15 లక్షల ఓట్లు తగ్గడంతో ఓటింగ్ శాతం కూడా తగ్గవచ్చనే అంతా భావించారు. కానీ ఊహించనంతగా పెరగడమే ఈ ఆశ్చర్యానికి కారణం. అయితే ఈ పెరిగిన ఓట్లు ఏ పార్టీకి లభించి ఉంటాయన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అధికార ఎన్డీయే కూటమికే ఆ అదనపు శాతం లభిస్తుందని ప్రధాని మోడీ, అమిత్ షాలు అంటుండగా, ఓటింగ్ పెరిగితే అది ఎప్పుడూ విపక్షానికే అనుకూలమని మహాగఠ్ బంధన్ నేతలు లాలూ, తేజస్వియాదవ్ అంటున్నారు. రాహుల్ గాంధీ సరేసరి. ఆయన చాలా ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఎన్నికల సంఘం సర్ విధానం వల్ల బీహార్‌కు ఏదో అన్యాయం జరిగిపోతోందని కాలికి బలపం కట్టుకుని ఊరూ వాడా ప్రచారం చేసిన రాహుల్ గాంధీ మొదటి విడత పోలింగ్ తర్వాత ఆ ఊసే ఎత్తకుండా ఓటింగ్ పెరుగుదల ప్రజాస్వామ్య విజయమని వ్యాఖ్యానించడం గమనించవలసిన అంశం. పెరిగిన పదిశాతం ఓట్లలో మహిళలు, యువత ఎక్కువగా ఉన్నట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు. వారు ఆ మాట అనగానే ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక ప్రకటన చేస్తూ మహిళా సంక్షేమానికి తాము అహరహం శ్రమిస్తున్నామనీ, గెలుపొందితే వారికి మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తామనీ హామీఇచ్చారు. రాష్ట్రంలోని దాదాపు 1.21 కోట్ల మంది మహిళలకు ప్రతినెలా పదివేల రూపాయలు 'సంక్షేమం' పేరుతో వారిఖాతాల్లో ఇప్పటికే జమ చేస్తుంటే వారు వచ్చి ఓటు వేయకుండా ఎలా ఉంటారు! తాము అధికారంలోకి వస్తే వచ్చే సంక్రాంతి నాటికిఒక్కో మహిళకు 30 వేలు ఇస్తామని మహాగఠ్ బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన తేజస్వి యాదవ్ ఆశచూపినప్పుడు ఆ మహిళలు మొత్తం కదిలి వచ్చారనే అనుకోవాలి. పట్టపగలే అనేకానేక నేరాలు, ఘోరాలతో అట్టుడుకుతూ 'జంగిల్ రాజ్' గా పేరు మోసిన బీహార్‌లో, 50 శాతం ఓట్లు రావడమే అబ్బురమనుకున్న బీహార్‌లో పరిస్థితి ఎంత మారిందో ఈ ఎన్నికలను బట్టే అర్థమవుతోంది. ఇప్పుడదే రెండు ప్రధాన రాజకీయ శిబిరాల్లో ఆశలను కూడా పెంచుతోంది. రెండు కూటములు వాగ్దానాల వర్షం భారీగానే కురిపించాయి. ముఖ్యంగా యువత, మహిళలు, రైతుల కోసమే తాముపుట్టినట్లుగా రెండు కూటములు విరివిగానే వాగ్దానాలు చేశాయి.



పోలింగ్ క్యూ

ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ కూడా ఎన్నికలపై పెద్ద ఆశలే పెట్టుకుంది. విద్య, వైద్యం వంటి పలు అభివృద్ధి అంశాలపై ప్రశాంత్ కిశోర్ ( పికె) ముమ్మరంగా చేసిన ప్రచారం ఓటర్లలో కొంత మేర 'కదలిక' తెచ్చిందనే భావిస్తున్నారు. పోలింగ్ జరిగిన 121నియోజకవర్గాలలో 60శాతం దాకా గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధిం చింది. మిథిల, కోసి వంటి కొన్ని ప్రాంతాలలో స్పష్టత లేకపోయినా, దాదాపు 90 నియోజక వర్గాలలో గత ఎన్నికల ఫలితాలే లభించగల వన్నది పరిశీలకుల అంచనా. తమకు కనీసం 15సీట్లు అదనంగా లభించగలవని ఎన్డీయే నేతలు అంటుండగా, తమబలం కనీసం పదిశాతం పెరుగుతుందని ఇండియా కూటమి నేతలు ఆశాభావంతో కనిపిస్తున్నారు. వారి అంచనాలు ఎలాఉన్నా, యువతను ఆకట్టుకొనడానికితేజస్వి యాదవ్ చేసినయత్నాలకు తగిన ఫలితం లభించగలదనే తెలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్నఉచితవిద్యుత్, ఉపాధి కల్పనల ప్రభావం కూడా ఎక్కువే ఉంది. ఓటింగ్ పెరగడానికి అవికూడా కారణాలే. చిరాగ్ పాశ్వాన్ తిరిగి ఎన్డీయేకు చేర డంతో ఎస్సీల్లోని పాశ్వాన్ ఓట్లు తమకు కలిసి వస్తాయని బిజెపి భావిస్తుండగా, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధినేత ముఖేష్ సహానీ మద్దతు లభించడంతో తమకు అదనపు సీట్లు లభిస్తాయని ఆర్జేడీ భావిస్తోంది. ముస్లిం యాదవ్ సమీకరణం తమకు కలిసి వస్తుందనీ, ఇబిసిలు, దళితులు తమవెంటే ఉంటారనీ ఇండియా కూటమి లెక్కలు వేసుకొంటోంది. 1951నుంచి 2020దాకా జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే 42నుంచి 57దాకా మాత్రమే ఓటింగ్ శాతాలుకనిపిస్తాయి. వాటిలో తొలుత కాంగ్రెస్, తర్వాత ఆర్జేడీ, ఆతర్వాత బిజెపిజెడియు కూటమి విజయాలు సాధించి బీహార్ అభివృద్ధికి దారిచూపాయి. ఈసారి ఓటింగ్‌శాతం బాగా పెరగడానికి అభివృద్ధి కంటే పార్టీలు ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలే ఎక్కువ ప్రభావం చూపాయని అంటున్నారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే వచ్చే అయిదేళ్లలో కోటి ప్రభుత్వఉద్యోగాలు కల్పిస్తామని ఎన్డీయే అంటుండగా, తామువస్తే ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మహాగఠ్ బంధన్ నేతలు హామీలు గుప్పిస్తున్నారు. యువత అధికంగా పోలింగ్ బూత్‌ల వద్దకు రావడానికి ఇదొక కారణంగా కనిపిస్తోంది. అయితే వారిద్దరూ ఇచ్చిన హామీలు నెరవేర్చడం అంత తేలికేనా? అన్నది ఫలితాల తర్వాత, ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తెలుస్తుంది. కోటిప్రభుత్వ ఉద్యోగాలు, లేదా ఇంటికో సర్కారీ కొలువు అందమైన ఊహ మాత్రమే అని తేలితే ఆ తర్వాత ఎన్నికలకు ఇక చెప్పడానికి ఏమీ ఉండదని కూడా తెలుస్తుంది. ఏదిఏమైనా మొదటి విడతలో పెరిగిన పదిశాతం ఓట్ల పైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఆ పది శాతం ఎన్డీయేకు లభిస్తుందా, గఠ్ బంధన్ కా అన్నది 14 వ తేదీన ఫలితాల్లో తేలిపోతుంది. మరో విడతలో 122 స్థానాలకు 11న పోలింగ్ జరుగుతుంది. దానిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కనిపిస్తుందో లేదో చూడాలి. ●

# ట్రిలియన్ డాలర్ 'మస్క్'!

అమెరికా

**గన్ని మోహన్**

ఎలాన్ మస్క్. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఈ పేరు మారుమోగిపోతోంది. నిజానికి డొనాల్డ్ ట్రంప్ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నప్పటి నుంచీ మస్క్‌పేరు వార్తల్లోకి వచ్చింది. అవన్నీ ఒక ఎత్తు. ఇప్పుడు మస్క్ పేరు వాణిజ్యరంగంలో మారుమోగుతోంది. ఇందుకు ప్రధాన కారణం లక్షకోట్ల డాలర్ల వేతన ప్యాకేజి. ఎలాన్ మస్క్ మానస పుత్రికగా భావించే టెస్లా బోర్డు ఆయనకు వేతన ప్యాకేజి లక్షకోట్ల డాలర్లు అంటే వాణిజ్య భాషలో ట్రిలియన్ డాలర్లు అన్నమాట. భారతీయ కరెన్సీలో రూ.84 లక్షల కోట్ల రూపాయలు. ఈ రికార్డు వేతన ప్యాకేజికి షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. 75శాతం మంది వాటాదారులు కూడా ఆమోదం తెలిపారు. వాణిజ్య ప్రపంచంలో ఇంతటి భారీస్థాయి వేతన ప్యాకేజి పొందిన మొదటి సిఇఒ బహుశా మస్క్ ఒక్కరే అవుతారు. ఇందుకు వాటాదారుల్లో పెరిగిన విశ్వాసంతోపాటు ఆయన ముందు పెద్ద లక్ష్యాలు కూడా పెట్టారు. టెస్లా విద్యుత్ కార్ల మార్కెట్ విలువలు పదేళ్లలో రెట్టింపుచేయాల్సిన బాధ్యతను ఆయన భుజాలపై ఉంచింది. టెస్లా వాహనాల సేల్స్, ఉత్పత్తి రెట్టింపు చేయడంతో పాటు పది లక్షల రోబోల ఉత్పత్తి, పంపిణీ ఆయన పర్యవేక్షించాలి. వాణిజ్య వినియోగావసరాల కోసం పది లక్షల రోబో ట్యాక్సీ వాహనాలు కూడా ప్రవేశపెట్టాలి. ప్రస్తుతం ఉన్నటెస్లా మార్కెట్ విలువలు 1.4లక్షల ట్రిలియన్ డాలర్లను 8.5లక్షలకోట్ల డాలర్లకు పెంచాల్సి ఉంటుంది. ఈ లక్ష్యాలన్నీ అధిగమిస్తే ఆయనకు 400 మిలియన్ డాలర్లఅదనపు టెస్లాషేర్లు కూడా వస్తాయి. కంపెనీ మార్కెట్ విలువలు పెరిగితే వీటివిలువ లక్షకోట్ల డాలర్లు అవు తుంది. అన్నింటి కంటే ముందు టెస్లా అధినేత 2022లో ప్రోటోటైప్ ఆప్టిమస్ అనే స్వయం చాలిత హ్యుమనాయిడ్ రోబోను రూపొందించారు. టెస్లాకార్లకు అమర్చిన కృత్రిమ మేధవ్యవస్థలే ఇందులోను ఉపయోగించారు. భవిష్యత్తులో ఆప్టిమస్ రోబోలే కీలకం అవుతాయని కూడా ఎలాన్‌మస్క్ ప్రకటించారు. అదే విధంగా స్వయంచాలిత డ్రైవింగ్ వ్యవస్థతో కూడిన టెస్లా కార్లను కూడా అమలులోకి తెచ్చే యోచన ఉంది. సెల్ఫ్‌డ్రైవింగ్ వ్యవస్థ డ్రైవర్లు ఫోన్‌లో సందేశాలు పంపినా ప్రమాదం లేని స్థాయికి చేరుకుందని ఆయనే ధీమాగా ఉన్నారు. నిజానికి ఇటీవలికాలంలో మస్క్ వ్యాపార విలువలు మార్కెట్లలో దెబ్బతిన్న సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో ఆయనకు విభేదాలు పొడసూపడం బహిరంగంగానే ఆయన్ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలతో టెస్లా షేర్లు దెబ్బతిన్నాయి. అమెరికా ప్రభుత్వం నుంచి ఆయనకు వచ్చే సబ్సిడీలను వాయిదా వేస్తూ రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయినా మస్క్ తట్టుకోగలిగారు. నిజానికి ట్రంప్‌నకు వెన్నుదన్నుగా నిలిచి 250 మిలియన్ డాలర్ల వరకూ ట్రంప్ విజయం కోసం ప్రచారంలో వ్యయంచేసారు. అలాగే ట్రంప్ పర్యటించిన ప్రతిచోటా కూడా ఆయన్ను వెన్నంటి నడిచి వెళ్లారు. అనూహ్య మెజార్టీతో ట్రంప్ గెలిచిన తర్వాత ఆయన చేపట్టిన గ్రేట్ అమెరికా మేక్ అగైన్ బిల్లుపై మస్క్ అభ్యంతరాలు తెలపడంతో ఇద్దరి మధ్య ఉన్న భేదాలు తారస్థాయికి చేరాయి. అక్కడితే ఆగలేదు ట్రంప్‌తో కటీఫ్ చెప్పేంతవరకూ వెళ్లాయి. అక్కడి నుంచే టెస్లా షేర్ల విలువలు మాత్రం క్షీణిస్తూ వచ్చాయి. ఇకమస్క్ చెపుతున్నట్లుగా హ్యుమనాయిడ్ రోబోలకు భారీ డిమాండ్ ఉంటుందన్న అంశంపై స్పష్టతరాలేదు. ఆటోమొబైల్ రంగంలో ఇతర పెద్ద కంపెనీల నుంచి రోబో ట్యాక్సీ పరిశ్రమలో టెస్లాకు గట్టి పోటీ కూడా ఎదురవుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఇక మస్క్‌కు సొంతంగా 13 శాతం టెస్లాషేర్లు ఉన్నాయి. ఇదికాకుండా మార్కెట్ విలువలు పదిరెట్లు పెరిగితే ప్యాకేజి మళ్లీ అందుకునే అవకాశం ఉంది. గతంలో కూడా రెండుస్లార్లు వాటాదారుల ఆమోదంతో మస్క్ లక్షల కోట్ల ప్యాకేజిని అందుకున్నారు. అయితే న్యాయపరమైన చిక్కులతో డెలావేర్ న్యాయమూర్తి ఈ వేతన ప్యాకేజి ఒప్పందం తిరస్కరించారు. ప్రస్తుతం ఈ ఒప్పందం సుప్రీం పరిశీలనలో ఉంది. మస్క్ ప్యాకేజిని వ్యతిరేకిస్తున్న వారిలో నేషనల్ వెల్త్‌ఫండ్స్‌లో ఒకటైన నార్వే సావరిన్ వెల్త్‌ఫండ్, కాలిఫోర్నియా పబ్లిక్ ఎంప్లాయీస్ రిటైర్‌మెంట్ సిస్టమ్ వంటిసంస్థలు టెస్లాలో వాటాలు కలిగి ఉండటంతో ఈకొత్త ప్యాకేజి వ్యతిరేకిస్తున్నాయి. దీనితో ఇప్పుడు రిటైల్ ఇన్వెస్టర్లవైపు ఫోకస్ పెంచి ఆమోదం పొందగలిగారు. మస్క్ కొత్తప్యాకేజికోసం టెస్లా బోర్డు డైరెక్టర్లు ఒక మార్కెటింగ్ సంస్థతో లాబీయింగ్ చేరారన్న సమాచారంతో కార్పొరేట్ గవర్నెన్స్ నిపుణులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్యాకేజికి విముఖత వ్యక్తంచేసారు. అయితే వోట్‌టెస్లా డాట్‌కామ్‌లో పోస్టుచేసిన ఒక విడియోలో బోర్డు ఛైర్మన్ డెన్‌హోమ్, డైరెక్టర్ కథ్లీన్ విల్సన్ థాంప్సన్‌లు మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ కొత్త పేప్యాకేజితో టెస్లాకు కంపెనీలో ఓటింగ్ పవర్‌ను పెంచుతుందని కూడా నిపుణులు చెపుతున్నారు. యూరోప్ ఇతర ఆసియా దేశాల్లో కూడా తనమార్కు బిజినెస్‌వ్యూహాలుఅమలుచేస్తున్న ట్రంప్ ఇప్పుడు ఈ భారీవేతన ప్యాకేజితో కంపెనీ బోర్డు తనముందుంచిన సవాళ్లను అధిగమించే వ్యూహాలు విధిగా సిద్ధంచేసుకోవాల్సిందే. మొత్తంగా చూస్తే ప్రపంచంలోనే ఎవ్వరూ అందుకోని విధంగా మస్క్ అన్నిచోట్లా రికార్డులు నెలకొల్పిన విధంగానే ఇప్పుడు తన వేతన ప్యాకేజిని నిర్ధారించుకోవడంలో కూడా తన రికార్డు సాధించారు. అయితే తనముందు న్న వాణిజ్య సవాళ్లను ఎలా అధిగమిస్తారన్నది మాత్రం కాలమేచెప్పాలి. కేవలం టెస్లా మాత్రమే కాకుండా స్టార్‌లింక్ శాటిలైట్ సర్వీసులు కూడా ఆయనకు ఉన్నాయి. విభిన్న రంగాల్లోకి విస్తరించిన మస్క్‌కు ఈ వేతన ప్యాకేజి ఒక పెద్ద అంశంగానే భావించడంలేదు. అయితే టెస్లాను వరల్డ్ నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎలా ఉంటుందన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్న అనే చెప్పాలి. ●



ఎలాన్ మస్క్

# చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలేవి?

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**


దేశం అభివృద్ధి చెందాలంటే పెద్ద ప్రాజెక్టు మాత్రమే కాదు చిన్నపరిశ్రమలు కూడా బలపడాలి కానీ ప్రభుత్వ దృష్టి అంతా లార్డ్జ్ మెగా ఇండస్ట్రీస్ వైపుకే పోతోంది. పెద్ద పరిశ్రమలకు అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, భూములు, టారిఫ్ రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు నిశ్శబ్దంగా మూతపడుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్యోగ కల్పనలో ఎంత నిబద్ధత కలిగి ఉన్నదో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐనీ ప్రవేశపెట్టడమే తెలియజేస్తోంది. టెక్నాలజీ అనేది మనిషి శ్రమను తగ్గించడానికి దోహదం చేయాలి కానీ మనిషికి జీవనాధార అవకాశాలను దూరం చేయడానికి దారి తీయకూడదు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అదే జరుగుతోంది. ఇదే సోషలిజంలోనైతే ఇటువంటి కొత్త టెక్నాలజీ ప్రవేశం వలన కార్మికులు ఉపాధి కోల్పోరు. అదే కొత్త టెక్నాలజీని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశపెట్టినప్పుడు కార్మికులు ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగానికి దారితీస్తుంది. దీనివలన ఆర్థిక వ్యవస్థలో ఆదాయ అసమానతలు పెరగడం, ఇది కొంతమంది పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడం అశేష ప్రజానీకం వినియోగస్థాయి పడిపోవడం, డిమాండ్ తగ్గిపోవడం ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిపోతుంది. ఇటీవలనే అమెజాన్ కంపెనీలో ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్ ఏఐ వినియోగం వలన 14 వేల ఉద్యోగాలు పోతున్నాయని తెలియజేసింది. ఇలా ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులు ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టకుండా ఆదాయాలను పెంపొందించుకునే దిశగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఇప్పటికే అమెజాన్ నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ వరకు ఉద్యోగం కోల్పోయే వారి సంఖ్య 80000 వరకు ఉంటుందని ఒక అంచనా. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రభావం వలన మొత్తం మీద 81 వేల 416ఉద్యోగాలు పోతున్నాయని ఒకఅంచనా. రాబోయే ఐదేళ్లలో 2026-2030 సుమారు లక్ష 30 వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్బును విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తోంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారబోతోంది అని మన పాలకులు అంటున్నారు. ఎందుకంటే గూగుల్ దాని సముద్రం అడుగున కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి వాటిని ప్రపంచవ్యాప్త నెట్వర్క్‌తో అనుసంధానం చేయబోతోంది అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా దాని సబ్సి కేబుల్ నెట్వర్క్ కనెక్టివిటీ హబ్ తద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడడమే కాకుండా దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లో విశాఖపట్నం రావడానికి అవకాశం ఏర్పడుతుంది. దీని ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని పాలకులు చెబుతున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న గూగుల్ కంపెనీలో ఉద్యోగాల సంఖ్య 1,82,000 మాత్రమే. రాబోయే రోజుల్లో ఏఐ కారణంగా మనదేశంలో 20 లక్షల సంప్రదాయ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని కానీ సరైన అనుకూల వాతావరణాన్ని ముందు నుంచే ఏర్పాటు చేయగలిగితే కొత్తగా 80 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చని కేంద్రం భావిస్తోంది అందుకోసమే మూడో తరగతి నుంచి విద్యను అనుసంధానం చేసే పనిలో దిగింది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంలో మన దేశం 25 దేశాల కన్నా తక్కువ స్థాయిలో ఉన్నదని సర్వే తెలియజేసింది. 14 శాతం భారతీయులకు మాత్రమే ఈ పరిజ్ఞానం గురించి ఇంతో అంతో తెలుసు. ముఖ్యంగా 18-34 వయసు మధ్య ఉన్న వారిలో 19 శాతం మందికి మాత్రమే మన దేశంలో ఏఐ గురించి తెలుసు. ఏఐ పరిజ్ఞానం లేని మనదేశంలో ప్రస్తుతం ఏఐ ప్రవేశపెట్టడం ద్వారా నిరుద్యోగం ఏర్పడే ప్రమా



దం ఎక్కువగా ఉంటుంది మన పాలకులు ఏమో ఏఐ క్వాంటం కంప్యూటింగ్ యుగం కోసం పరుగులు తీయాలని తాపత్రయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్లో ఆర్థిక అభివృద్ధి పరంగా మొత్తం పారిశ్రామిక రంగాన్ని ఇంజన్ లాగా పనిచేస్తున్నాయని ఆర్థికవేత్తలు గుర్తించారు. 145 కోట్ల మంది జనాభా గల మన దేశంలో పేదరికం పోవాలన్న ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదాయ అసమానతలు తగ్గాలన్న సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఐ అభివృద్ధితోనే సాధ్యం. చైనాలో ఇంటింటికి ఒక కుటీర పరిశ్రమ ఉంటూ చైనా ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా చలామణి అవుతున్నాయి అంటే అక్కడి ప్రభుత్వ పెద్దల నిబద్ధత ఉంది. అందుకే చైనా నేడు ప్రపంచ కర్మాగారంగా ఉంది. మన దేశంలో పాలకులు లాగా ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని చైనా పాలకులు అనుకోవడం లేదు. చైనాలో స్థానికంగా పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి పరిచింది. అందువలన అక్కడి పేదరికం పోయింది. దీనికిగానో ప్రజలకు రుణాల రూపంలో పెట్టుబడులు సమకూర్చడం వారికి తగిన శిక్షణ ఇవ్వడం, పరిశ్రమలకు కావలసిన సాంకేతిక సామాగ్రిని అందించడం, మార్కెట్లను చూపించడం, ఇలాంటి పనుల్లో ప్రభుత్వం ఒక వైపు ప్రైవేట్ పారిశ్రామిక రంగం మరొక వైపు భాగస్వాములు అవుతున్నాయి. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయి. అనేక పారిశ్రామిక యూనిట్లను ఎక్కడికక్కడ నెలకొల్పుతున్నారు. వీటి ఆధారంగా చైనాలో 1.3 కోట్ల మందికి గ్రామీణ ఉపాధి లభించింది. ఇళ్లలోనే పెట్టే చిన్న చిన్న ఉత్పత్తి యూనిట్లద్వారా ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి దీనికి టూరిజం పర్యావరణ ఆర్థిక కార్యకలాపాలు తోడు చేయడం వలన ఈ చిన్న తరహా పరిశ్రమలో మరింతగా పేదరిక నిర్మూలనకు ఉద్యోగ కల్పనకు తోడ్పడ్డాయి. మన దేశంలో ఎప్పటి నుంచో 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా చేపట్టిన కుటీర పరిశ్రమల స్వదేశీ ఉత్పత్తులను అభివృద్ధి పరచుకునేందుకు ఆనాడు స్వాతంత్ర సంగ్రామాన్నే నడిపించడం జరిగింది. ఈ ఎమ్ఎస్ఎమ్ఈల ద్వారా నేడు మనదేశంలో 97శాతం ఉద్యోగ కల్పన జరుగుతున్నది. భారీ పరిశ్రమల ద్వారా కేవలం 3 శాతం మాత్రమే ఉద్యోగిత ప్రజలకు లభిస్తున్నది. ఇవి ప్రస్తుతం దేశంలో 6.3కోట్ల సంస్థలు ఎనిమిది వేల రకాల ఉత్పత్తులను చేస్తూ మన స్థూల జాతీయఉత్పత్తికి 30 శాతం కల్పించుచున్నది. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో 33శాతంగా ఉంది. ఈ పరిశ్రమలన్నీ అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీటిని సంఘటితపరచి ఆర్థికపరమైన సాంకేతికపరమైన తదితర సబ్సిడీలు కల్పిస్తే చిన్నతరహా పరిశ్రమలు ఉపాధి కల్పనలో ఆదాయాలు పెంపొందించడంలో దేశంలో ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. నేటి ఆర్థిక విధానాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగి ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీమానవ శ్రేయస్సు పెంపొందించలేకపోవడం శోచనీయం. అందుకే ఆనాడు గాంధీజీ అన్నారు భారీ ఉత్పత్తులు కాదు ముఖ్యం భారీ సంఖ్యలో ప్రజలు ఉత్పత్తిలో పాల్గొనాలి. తద్వారా ఉపాధి ఆదాయం ఉండి ప్రజలు సౌభాగ్యంతో ఉంటారు. ధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి. సత్య నాదేల్లా వేతనం సంవత్సరానికి 850 కోట్ల రూపాయలు. అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ గా ఉన్నారు. ఆ కంపెనీలో పనిచేసే ఉద్యోగస్తులు ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షల ఇరవై ఎనిమిది వేలు మాత్రమే. అదే తరహా పెద్ద కంపెనీఅయిన గూగుల్‌లో పనిచేసే వారిసంఖ్య1,82,000 మాత్రమే. పెద్ద పరిశ్రమలలో కోటి రూపాయలు పెట్టుబడికి ఒకరికి ఉద్యోగం వచ్చేదే కష్టం అదే కోటి రూపాయలను చిన్న తరహా కుటీర పరిశ్రమంలో పెడితే పదిమందికిపైగానే ఉద్యోగాలు కల్పించవచ్చు. దేశం అభివృద్ధి చెందాలంటేపెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు చిన్న పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాలి. కానీ ప్రభుత్వాలు దృష్టిఅంతా మెగా ఇండస్ట్రీస్ వైపునే పోతుంది. పెద్ద పరిశ్రమలకు అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకదానికి ప్రోత్సాహకాలుసబ్సిడీలు భూములు టారిఫ్ల రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు చిన్న మధ్య తరహా కుటీర పరిశ్రమలు ప్రోత్సాహాలు లేక మూతపడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద ప్రాజెక్టులకు ప్రభుత్వం అందిస్తున్న అనేకప్రోత్సాహకాలు ఈ చిన్న పరిశ్రమలకు కూడా ఇవ్వవలసి అవసరం ఉంది. ●

# మునిగేందుకు అది ప్రాక్టీస్..


## రాహుల్ గాంధీపై ప్రధాని మోడీ సెటైర్లు!

**పాట్నా, నవంబరు 8:** బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఇటీవల చేపల వేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోడీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బీహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకు గాను సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్‌గాంధీ సైతం నీళ్లలోకి దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపట మార్కెట్ల ఏర్పాటు, మత్స్యసంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది. రూ.10వేలు ఇచ్చి, ఓట్లు కొల్లగొట్టవచ్చని బిజెపి భావిస్తోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు మహాత్మాగాంధీ చేసిన పోరాటమే కాంగ్రెస్ చేస్తోంది. ప్రధాని మోడీ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ స్నేహితులకు అప్పగిస్తున్నారు. ఆయన కట్టా వంటి పదాలను ఉపయోగించి ప్రజలను రెచ్చిగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## పాక్ అణ్వాయుధ కార్యాచరణ ధ్వంసానికి ఇందిరాగాంధీయే తిరస్కరించారు

### అమెరికా సిఐఎ మాజీ డైరెక్టర్ రిచర్డ్ బార్లో



**వాషింగ్టన్, నవంబరు 8:** పాకిస్థాన్ అణ్వాయుధ కార్యాచరణను అడ్డుకునేందుకు భారత్- ఇజ్రాయెల్ కలిసి చేసిన రహస్య ప్రణాళికను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తిరస్కరించారని అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి రిచర్డ్ బార్లో వెల్లడించారు. అప్పటి ప్రభుత్వం ఈ ఆపరేషన్‌ను తిరస్కరించడాన్ని ఆయన సిగ్గు చేటుగా అభివర్ణించారు. పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు రూపొందించిన ఈ ఆపరేషన్‌కు ఇందిర ఆమోదం తెలిపి ఉంటే ప్రపంచానికి ఎన్నో సమస్యలు తప్పి ఉండేవని ఆయన అభిప్రాయపడ్డారు. 1980లో పాక్ రహస్య అణు కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్న సమయంలో అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలో బార్లో పని చేశారు. ఆసమయంలో ఈ ప్రణాళిక గురించి తాను విన్నట్లు ఓ ఇంటర్వ్యూలో బార్లో తెలిపారు. 'ఆసమయంలో నేను ప్రభుత్వ సర్వీసులో లేను. కానీ ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఈ ఆపరేషన్ గురించి విన్నాను. అది కార్యరూపం దాల్చలేదు. ఇందిరా గాంధీ ఈ ప్రణాళికను అడ్డుకున్నారు. అలా చేయడం సిగ్గుచేటు. ఆ ఆపరేషన్‌ను ఆమోదించి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవి' అని ఆయన వివరించారు. నివేదికల ప్రకారం పాక్‌లోని కహూతా అణుకేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేసేందుకు ఇజ్రాయెల్, భారత్ ప్లాన్ చేశాయి. అణ్వాయుధాలను పాక్ అభివృద్ధి చేయకుండా, వాటిని ఇతర దేశాలకు అందించకుండా నిరోధించేందుకు దాడి చేయాలని ప్రణాళిక రచించాయి.



## భారత్‌పై మరోసారి అగ్గిరాజేసిన యూనస్ సర్కార్

### భారత్ ఈశాన్యప్రాంత మ్యాప్ ఉన్న బుక్ విదేశీ ప్రతినిధులకు అందచేత

**ఢాకా, నవంబరు 8:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని ముహమ్మద్ యూనస్ మరోసారి మ్యాప్ వివాదాన్ని రాజేశారు. గత నెలలో పాకిస్తాన్ జనరల్‌కు బహుమతిగా ఇచ్చి ఆర్ట్ ఆఫ్ ట్రయాంప్ అనే పుసక్తాన్ని ఈసారి తుర్కియే పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి బహుకరించి మరోసారి వివాదాన్ని రాజేశారు. ఇంతకు ఆ పుసక్తంలో ఏం ఉంది అంటే ఇది ప్రధానంగా గ్రేటర్ బంగ్లాదేశ్ ఉద్దేశాన్ని తెలుపుతుంది. అంటే బంగ్లాదేశ్‌లో భారతదేశం ఈశాన్య ప్రాంతాలు మరీ ముఖ్యంగా అస్సాంను కలుపుకుని గ్రేటర్ బంగ్లాదేశ్‌గా అవతరించబోతున్నామనే సంకేతాలను ఇస్తోంది. ఇది యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశ్యాలపై కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. బంగ్లాదేశ్ మీడియా ప్రకారం, నవంబర్ 3న ఢాకాను సందర్శించిన మెహ్మెట్ అకిఫ్ యిల్మాజ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల తుర్కియే పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి యూనస్ ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్ అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. ఈ పుస్తకంలో గత ఆగస్టులో షేక్ హాసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన నిరసనల సమయంలో చోటు చేసుకున్న ఘటనలు, ఆ తర్వాత విద్యార్థులు, యువత గీసిన గ్రాఫిటీ గురించి రచించినట్లు సమాచారం. ఈ పుస్తకంలోని మ్యాప్ భారతదేశ ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా అస్సాంను బంగ్లాదేశ్ ఊహాజనిత భవిష్యత్తులో కలుపుకునే గ్రేటర్ బంగ్లాదేశ్ ప్రణాళికను వివరిస్తుంది అని సమాచారం. ఇంటిలిజెన్స్ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆ పుస్తకంలో యుద్ధ ప్రణాళికలు, విజయానంతర నిర్వహణ ఫ్రేమ్ వర్క్‌లు ఉన్నాయని తెలుస్తోంది. అలానే అస్సాంను ఢాకా నియంత్రణలో ఉత్పాదక , లాభదాయక ప్రాంతంగా మార్చే ప్రస్తావనలు కూడా ఉన్నాయని సమాచారం. యూనస్ తాత్కాలిక ప్రభుత్వ ఈ చర్యలు యాదృచ్ఛికంగా రెచ్చగొట్టడం కన్నా ఉద్దేశపూర్వక సైద్ధాంతిక సంకేతంగా కనిపించిందని ఇంటిలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. పైగా ఇది కళా ప్రదర్శన ఎంత మాత్రం కాదని ఇది బంగ్లాదేశ్ భారతదేశానికి ఇస్తోన్న సందేశం అని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం విస్తృత వ్యూహాత్మక ధోరణులను ఇది స్పష్టం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మ్యాప్ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం ప్రాదేశిక ఆశయాలకు మొదటి స్పష్టమైన సంకేతం అంటున్నారు.

## లాలూ కుటుంబంపై ప్రజలను రెచ్చగొడుతున్న మోడీ

### జన్‌సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్‌కిశోర్ ధ్వజం



**పాట్నా, నవంబరు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీహార్ ఎన్నికల్లో ఓట్లు దక్కించుకోవడం కోసం, లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) పాలన గురించి ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈసారి బీహార్ ప్రజలు ఓటు వేయడానికి జన్ సురాజ్ రూపంలో ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ఆర్జేడీ భయాన్ని చూపించి ఓట్లు రాబట్టాలని మోదీ ప్రయత్నిస్తున్నారు, ఎందుకంటే ఆయన చెప్పడానికి మరేమీ లేదు. దశాబ్దాలుగా ఎన్డీయే, బీజేపీ, నితీశ్ కుమార్ ఓట్లు పొందడానికి లాలూ భయాన్ని చూపడమే ఉత్తమ మార్గంగా ఎంచుకున్నారు. పనులు జరిగాయా? లేదా? అన్నది పక్కనపెడితే, కనీసం జంగిల్ రాజ్ తిరిగి రాలేదు కదా అని ప్రజలు అనుకునేలా చేశారు. కానీ ఈసారి పరిస్థితి మారింది. జంగిల్ రాజ్ తిరిగి రాకూడదంటే, మరి మీకెందుకు ఓటేయాలి? జన్‌సురాజ్ ఒక కొత్త ప్రత్యామ్నాయంగా ఉందని కిశోర్ వివరించారు. ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పాలన కాలాన్ని జంగిల్ రాజ్‌గా బీజేపీ అభివర్ణిస్తుంటుంది. లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో బీజేపీ ఈ పదాన్ని విపక్షాలపై విమర్శలకు అస్త్రంగా వాడుతోంది. గత వారం ప్రధాని మోదీ మాట్లాడుతూ బీహార్‌లోని జంగిల్‌రాజ్‌ను మరో 100 ఏళ్లయినా మర్చిపోలేరని అన్నారు. ఆనాటి పరిస్థితులను యువతరానికి వివరించాలని రాష్ట్రంలోని బీజేపీ కార్యకర్తలకు, వృద్ధులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్ష కూటమిని ఘట్‌బంధన్ (కూటమి) కాదని, లఠ్‌బంధన్ (నేరగాళ్ల గుంపు) అని అభివర్ణించారు. ఢిల్లీ నుంచి బీహార్ వరకు ఉన్న విపక్ష నేతలంతా బెయిల్‌పై బయట ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో రికార్డుస్థాయిలో 64.66శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యధికం. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

## పోలీసు విభాగంలో 'గీతా'పఠనం

### మధ్యప్రదేశ్‌లో 4వేల మంది సిబ్బందికి ఆదేశాలు




**భోపాల్, నవంబరు 8:** మధ్యప్రదేశ్ పోలీస్ ట్రెనింగ్ విభాగం ఇటీవల తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. భగవద్గీత పఠనాన్ని తప్పనిసరి చేయాలంటూ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) ట్రైనింగ్ రాజా బాబు సింగ్ జారీ చేసిన ఆదేశాలు వివాదానికి తెర తీశాయి. దాదాపు 4 వేల మంది కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ ఆదేశాల పరిధిలోకి వస్తారు. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ విరుద్ధమంటూ తీవ్రంగా విమర్శించింది. ప్రతి ఒక్కరూ తమ మతాన్ని అనుసరించే స్వేచ్ఛ ఉండాలని.. పోలీసు బలగాలను కాషాయీకరణ చేసి రాడికలైజ్ చేసే ప్రయత్నం మధ్యప్రదేశ్‌లో మొదలైందని ఇది రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న చర్య అని హస్తం పార్టీ ఆరోపించింది. ఇలాంటి ఆదేశాలు జారీ చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై అధికార బీజేపీ ఘాటుగా స్పందించింది. భారత్ వంటి దేశంలో భగవద్గీతను మతపరమైనదిగా ఎవరైనా భావిస్తే వారి భారతీయతపై అనుమానం ఉందని ఇది తన స్పష్టమైన ఆరోపణ అని బీజేపీ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది పేర్కొన్నారు. భగవద్గీత కేవలం మతం గురించి కాదని తత్వశాస్త్రం గురించి చెబుతుందని దాని సారాంశాన్ని అర్థం చేసుకుంటే పోలీసుల పనితీరు మెరుగుపడుతుందని వెల్లడించారు. దాని వల్ల సమాజం మెరుగుపడుతుందని పంకజ్ చతుర్వేది సమర్థించారు. అప్పుడే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుందని.. దీన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని వ్యాఖ్యానించారు. ఇక ఈ భగవద్గీత పఠనం నిర్ణయాన్ని సమర్థించుకున్న ఏడీజీపీ రాజా బాబు సింగ్ మార్గశిర మాసం ప్రారంభమైందని.. ఇది శ్రీకృష్ణుడి మాసమని పేర్కొన్నారు. ఈ పవిత్ర మాసంలో ధ్యానానికి ముందు భగవద్గీతలోని ఒక అధ్యాయాన్ని ట్రైనీ కానిస్టేబుల్‌లు చదివితే వారికి ధర్మబద్ధమైన జీవితానికి మార్గనిర్దేశం లభిస్తుందని వివరించారు. భగవద్గీత పఠనంతో పాటు.. గతంలో కూడా ఈ పోలీస్ ట్రైనింగ్ సంస్థల్లో తులసీదాస్ రచించిన రామచరితమానస్ పద్యాలను పఠించేలా రాజా బాబు సింగ్ ప్రోత్సహించారు. ప్రస్తుతం శిక్షణార్థులు భగవద్గీత, రామచరితమానస్ పఠనం, అరగంట ధ్యానంతో కూడిన దినచర్యను అనుసరిస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెషన్‌లను నిర్వహించాలని కూడా మధ్యప్రదేశ్ పోలీసులు నిర్ణయించారు. భోపాల్‌లోని అప్పర్ లేక్, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర ఆలయం వంటి ముఖ్యమైన చారిత్రక ప్రదేశాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఏడు జన్మలెత్తినా లాలూ తరహా కుంభకోణాలు మోడీకి చేతకావు

### తేజస్వి కామెంట్‌కు అమిత్‌షా కౌంటర్



**పాట్నా, నవంబరు 8:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీనేత తేజస్వీ యాదవ్‌లు సీమాంచల్‌ను చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి దేశం నుంచి బహిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా తేజస్వి ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోడీ కుంభకోణాలు చేయలేరని చురకలంటించారు. బీహార్‌లో 160స్థానాల్లో విజయం సాధించి ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సగం రాష్ట్రం కాంగ్రెస్, ఆర్జేడీ కూటమికి తలుపులు మూసివేసింది. రాహుల్, తేజస్విలు కలిసి సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదారుల అడ్డాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, ఎన్నికల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తాం. వారి దేశానికి పంపిస్తాం అని అమిత్ షా పేర్కొన్నారు. రైల్వేలో లాలూప్రసాద్ యాదవ్ తీసుకొచ్చిన లాభాలను ప్రధాని మోడీ ఏడు జన్మలెత్తినా తీసుకురాలేరంటూ ఇటీవల తేజస్వి యాదవ్ చేసిన విమర్శలకు గట్టిగా బదులిచ్చారు. ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోడీ కుంభకోణాలు చేయలేరంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమైనవి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఉద్ఘాటించారు. అందుకు సంబంధించి ఏమైనా ఆధారాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని సూచించారు. రోహ్‌తాస్‌లో ఎన్నికల ప్రచారసభలో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. సాయుధ బలగాలను రాజకీయాల్లోకి లాగొద్దని ఈ సందర్భంగా రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### స్కూల్ పిల్లలకు న్యూస్‌పేపర్‌లో

## భోజనం పెడతారా! నా హృదయం ముక్కలైంది..

### రాహుల్ తీవ్ర ఆవేదన



**భోపాల్, నవంబరు 8:** మధ్యప్రదేశ్‌లో కొంతమంది చిన్నారులకు న్యూస్‌పేపర్‌లో మధ్యాహ్న భోజనం వడ్డించినట్లు కనిపిస్తున్న దృశ్యాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇది చూసి హృదయం తల్లడిల్లిందన్నారు. ఇంత దయనీయస్థితిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కొంత మంది చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌లో వడ్డిస్తున్నట్లు తెలుసుకుని నా హృదయం ముక్కలైంది. ఈ పిల్లలపైనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ, వారికి కనీస గౌరవం దక్కడం లేదు. అక్కడ అభివృద్ధి అంతా భ్రమే. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికారంలోకి వస్తున్నారు. ఇటువంటి దుర్భర స్థితిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నందుకు అధికార నేతలు సిగ్గుపడాలి అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. స్వయం సహాయక సిబ్బంది సేవలను నిలిపివేశారు. నెటిజన్లు దీన్ని ఖండించారు. మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని పేర్కొన్నారు. పోషకాహారం పేరిట అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారంటూ విమర్శించారు.




## రూ.200 కోట్ల భూమి మూడు కోట్లకే కొనుగోలు!

### మహారాష్ట్రలో మరో మంత్రి నిర్వాకం

**ముంబయి, నవంబరు 8:** మహారాష్ట్రలో రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ.3కోట్లకే దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూకుంభకోణం కేసు ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతుండగా, తాజాగా రాష్ట్ర మంత్రిపై వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయాందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ. 3 కోట్లకే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ స్థలంలోనే ఆయన ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. ఈ విషయం గురించి తాను కూడా విన్నానని, కానీ దీనిపై ఎవరి దగ్గరి నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం మానేసి, మీడియా ముందుకు వచ్చిఆరోపణలు చేసేందుకే సమయం కేటాయిస్తున్నాయని విమర్శించారు. ఈ భూమికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, రూ. 18వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ. 300 కోట్లకే విక్రయించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దర్యాప్తునకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంత్రిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.

## నెతన్యాహు, మంత్రులకు తుర్కియే అరెస్టు వారంట్లు



**ఇస్తాంబుల్, నవంబరు 8:** ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు సహా ఆయన ప్రభుత్వంలోని సీనియర్ అధికారులపై.. మారణహోమం సృష్టించారనే ఆరోపణలతో తుర్కియే అరెస్ట్ వారెంట్లను జారీ చేసింది. గాజాలో ఇజ్రాయెల్ పద్ధతి ప్రకారం పాల్పడిన మారణహోమం, మానవత్వానికి వ్యతిరేకమైన నేరాలపై తుర్కియే చట్టపరమైన చర్యకు పూనుకుంది. ఇస్తాంబుల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ కేసులో మొత్తం 37 మంది అనుమానితుల జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో నెతన్యాహుతో పాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్, జాతీయ భద్రతా మంత్రి ఇతమార్ బెన్ గ్విర్, ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎయాల్ జమీర్ వంటి కీలక అధికారులు ఉన్నారు. అయితే పూర్తి జాబితాను మాత్రం ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించలేదు. టర్కీ ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోవడంపై ఫిర్యాదు వచ్చింది. ఈ అరెస్ట్ వారెంట్ల జారీకి సంబంధించిన ఫిర్యాదులో గాజా స్ట్రిప్‌లో టర్కీ సర్కారు నిర్మించిన టర్కిష్‌పాలస్తీనియన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ అంశాన్ని కూడా ప్రస్తావించింది. మానవతా సేవలకు అంకితమైన ఈ ఆసుపత్రిని ఇజ్రాయెల్ సైన్యం మార్చి నెలలో బాంబు దాడి చేసి ధ్వంసం చేసిందని ఫిర్యాదులో తెలిపింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ మానవతా చట్టాల ఉల్లంఘన కిందకు వస్తాయని టర్కీ బలంగా వాదిస్తోంది.

## తీవ్రస్థాయికి చేరిన ఢిల్లీ వాయుకాలుష్యం

**న్యూఢిల్లీ, నవంబరు 8:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో కాలుష్యం వెరీపూర్ కేటగిరీలో నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం శనివారం ఉదయంఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 355 గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 332గా, అలీపూర్ వద్ద 316, అశోక్ విహార్‌లో 332,ఇండిగా గేట్ వద్ద ఏక్యూ 322గా, పాలెం ప్రాంతంలో 320, ధౌలా కువాన్‌లో 269, అశోక్ విహార్ ప్రాంతంలో 332, బవానాలో 366, బురారి క్రాసింగ్ వద్ద 345, ఛాందిని చౌక్ ప్రాంతంలో 354, ద్వారకా సెక్టార్8లో 310,ఐటీఓ ప్రాంతంలో 337, జహంగీర్‌పురిలో 342, ముండ్కా ప్రాంతంలో 335, నరేలా వద్ద 335, ఓఖ్లా ఫేజ్2లో 307, పట్పర్‌గంజ్ వద్ద 314,పంజాబీ బాగ్ 343, ఆర్‌కే పురంలో 321, రోహిణి ప్రాంతంలో 336, సోనియా విహార్ వద్ద 326గా ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది.


# సంక్షిప్తంగా..

## మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్



**బమాకో, నవంబరు 8:** మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్‌నకు గురయ్యారు. కోబ్రి ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని భద్రతా వర్గాలు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. విద్యుద్దీకరణ ప్రాజెక్టులకు సంబంధించి ఆ భారతీయులు స్థానికంగా ఓ కంపెనీలో పని చేస్తున్నారని మాలి భద్రతా వర్గాలు తెలిపాయి. గురువారం కొందరు దుండగులు ఈ ఉద్యోగులపై అకస్మాత్తుగా దాడులు జరిపారని పేర్కొన్నాయి. అనంతరం ఐదుగురు భారతీయులను అపహరించుకుని వెళ్లిపోయారని తెలిపాయి. ఘటన నేపథ్యంలో ఈ కంపెనీలో పనిచేసే మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు అధికారిక వర్గాలు వివరించాయి. ఈ కిడ్నాప్‌ను కంపెనీ ప్రతినిధులు కూడా ధ్రువీకరించారు. అయితే బాధితుల వివరాలను మాత్రం వారు వెల్లడించలేదు.

## డిఎన్‌ఎ ఆవిష్కర్త జేమ్స్ వాట్సన్ కన్నుమూత



**న్యూయార్కు, నవంబరు 8:** ఆధునిక విజ్ఞాన శాస్త్ర గతిని మార్చేసిన డీఎన్‌ఏ డబుల్ హెలిక్స్ నిర్మాణ ఆవిష్కర్తల్లో ఒకరైన, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ జేమ్స్ డి.వాట్సన్ (97) కన్నుమూశారు. న్యూయార్క్‌లోని ఈస్ట్ నార్త్‌పోర్ట్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన్ను ఈ వారం ప్రారంభంలో హాస్పిస్ కేర్‌కు తరలించగా, అక్కడ ప్రశాం తంగా మరణించినట్లు ఆయన కుమారుడు డంకన్ వాట్సన్ ధ్రువీకరించారని ఆంగ్లపత్రిక ఒకటి పేర్కొంది. 1928 ఏప్రిల్ 6న షికాగోలో జన్మించిన వాట్సన్, కేవలం 24 ఏళ్ల వయసులోనే కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఫ్రాన్సిస్ క్రిక్‌తో కలిసి డీఎన్‌ఏ నిర్మాణంపై పరిశోధనలు చేశారు. 1953లో వారు ప్రతిపాదించిన డబుల్ హెలిక్స్ నమూనా, జీవులలో అనువంశిక సమాచారం ఒక తరం నుంచి మరో తరానికి ఎలా వెళ్తుందో వివరించి, సైన్స్ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. ఈ ఆవిష్కరణకు గాను వాట్సన్, క్రిక్‌లతో పాటు మరో శాస్త్రవేత్త మారిస్ విల్కిన్స్‌కు 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

## దక్షిణాఫ్రికా జి20 సమావేశాలు బాయ్‌కాట్: ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 8:** దక్షిణాఫ్రికాలో జరుగ నున్న జీ20 శిఖరాగ్ర సమావేశానికి అమెరికా అధికారులెవరూ హాజరుకాబోరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. శ్వేత జాతి రైతులతో క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన జీ20 శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల చివర్లో జరిగే జీ20 శిఖరాగ్ర సమావేశానికి తాను హాజరు కాబోనని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. నవంబర్ 22,23 తేదీల్లో జరిగే ప్రపంచంలోని ప్రముఖ, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల దేశాధినేతల వార్షిక శిఖరాగ్ర సమావేశానికి తాను హాజరు కాబోనని ట్రంప్ గతంలో తెలిపారు. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ తనస్థానంలో హాజరవుతారని భావించారు. వాన్స్ కూడా ఈ సమావేశానికి వెళ్లరని ట్రంప్ పేర్కొన్నారు. జీ20శిఖరాగ్ర సమావేశం దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తిగా అవమానకరమని ట్రంప్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## వివేక్ రామస్వామికి ట్రంప్ ప్రశంసలు



**ఒహాయో, నవంబరు 8:** భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయనను ప్రత్యేకమైన వ్యక్తి (సమ్‌థింగ్ స్పెషల్) అంటూ ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. వివేక్ రామస్వామి ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా ట్రంప్ ఈ పోస్టు పెట్టారు. ఒహాయో రాష్ట్రాన్ని గ్రేట్ స్టేట్‌గా అభివర్ణిస్తూ, వివేక్ రామస్వామి ఎన్నికైతే గొప్ప గవర్నర్ అవుతారని ట్రంప్ పేర్కొన్నారు. ది గ్రేట్ ఒహాయో రాష్ట్రానికి వివేక్ రామస్వామి పోటీ చేస్తున్నారు. నాకు ఆ ప్రాంతం అంటే ఎంతో ఇష్టం. 2016, 2020, 2024 ఎన్నికల్లో నేను భారీ విజయం సాధిం చాను. వివేక్ నాకు బాగా తెలుసు. అధ్యక్ష ఎన్నికల్లో నాతోనే పోటీకి వచ్చాడు. అతడు ప్రత్యేకమైన వ్యక్తి. వివేక్ యువకుడు, తెలివైనవాడు, చాలా మంచి వ్యక్తి. అతనికి మన దేశం అంటే ఎంతో ఇష్టం అని ట్రంప్ తన ట్రూత్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి



శనివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

## దేశంలో జరుగుతున్న ఓటు చోరీపై రాహుల్‌గాంధీ ఎనలేని పోరాటం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తూ బిజెపి అవకతవకలకు పాల్పడుతుందని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరుగు తున్న ఓటు చోరీలపై రాహుల్‌గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలిపారని తెలిపారు. లోక్‌సభతోపాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన అవకతవకలను కాంగ్రెస్ ఆధారాలతో సహా నిరూపిస్తున్నట్లు కర్ణాటకలోని మహదేవ్‌పుర నియోజక వర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పి దాలు, బిజెపి మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహ బయట పెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం దురదృష్టకర మన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బిజెపి చేసిన కుట్రలను రాహుల్‌గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని తెలిపారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓట్లు, 5 లక్షల డూప్లికేట్ ఓట్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్లుగా రాహుల్ గాంధీ నిర్ధారణ చేశారని చెప్పారు. బీహార్‌లో బిజెపి సహకారంతో సర్ పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని విమర్శించారు. ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం బిజెపి చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బీహార్‌లో ప్రారంభించిన ఓటు అధికార్ ర్యాలీ బిజెపిలో వణుకు పుట్టించిందని మహేష్‌గౌడ్ అన్నారు. హర్యానా ఫార్ములాను అనుసరించి బిజెపి ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గతంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బిజెపి సహకారంతో బీఆర్ఎస్ గెలిచిన ఉదాహరణ ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కు కాలరాసే హక్కు ఎవరికీ లేదు అని మహేష్‌గౌడ్ స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, అల్లం భాస్కర్, హనుమంతరావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి ఎత్తేయాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పత్తి ఎకరానికి 7 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధనను ఎత్తి వేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిఎండి లలిత్ కుమార్‌గుప్తాతో మాట్లాడినట్లు మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే 20 శాతంకు ఉన్న పత్తి కొనేవిధంగా చర్యలు తీసుకుని, ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు పరిమితి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా కాపాస్ కిసాన్ యాప్ రాత్రి 10 గంటల సమయంలో మాత్రమే ఓపెన్‌గా ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యాప్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు ప్రకటనలో వెల్లడించింది. జిన్నింగ్ మిల్లర్లు, రైతుల విన్నపం మేరకు అన్ని మిల్లులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సీసీఐని కోరినట్లు వెల్లడించింది. కాగా యాసంగి ప్రాంతంలో రైతులు పండించిన పంటల కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.5 లక్షల టన్నుల యూరియా బఫర్ స్టాక్ నిల్వ ఉందగా, ఈ నెలలో 2 లక్షల టన్నులు, వచ్చే నెలలో మరో 2 లక్షల టన్నుల యూరియా కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. యూరియా సరఫరా త్వరగా జరిగేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. మ్యొంథా తుఫాన్ వల్ల జరిగిన పంట నష్టంపై సర్వే నివేదిక వివరాలు వెంటనే అందించాలన్నారు.

## ఎన్టీపిసి ద్వారా 84,849 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

### ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** దేశ విద్యుత్ అవసరాల్లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) కీలకంగా ఎదుగుతోందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) చందన్ కుమార్ సమంత అన్నారు. ఎన్టీపీసీ ఆడిటోరియంలో నిర్వహించిన సంస్థ 51వ ఆవిర్భావ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. దేశానికి కరెంట్ కొరతను తీర్చడంలో సంస్థ అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ప్రస్తుతం ఎన్టీపీసీ దేశంలో 108 ప్లాంట్ల ద్వారా 84,849 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి చేస్తోందన్నారు. వీటిలో బొగ్గు, గ్యాస్, హైడ్రో, సౌర మరియు పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తున్నదన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తుందన్నారు. 2032 నాటికి 150 గిగావాట్ల లక్ష్యంతో కొత్త ప్రాజెక్టులను ఏర్పాటుకు కృషి చేస్తోందని తెలిపారు. మరోవక్క తెలంగాణలో సౌర, పవన విద్యుత్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో 400 బిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా విద్యుత్ ఉత్పత్తితో పాటు అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని అన్ని విభాగాల్లో ఎన్నో అవార్డులు అందుకొందన్నారు. పర్యావరణ పరిరక్షణకు లక్షలాది మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు.

## ఫీజు బకాయిల పోరాటం కాలేజీ యాజమాన్యాల కోసం కాదు

### ముఖ్యమంత్రి ప్రకటనపై ఎంపి ఆర్.కృష్ణయ్య వివరణ

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం బీసీలు చేస్తున్న పోరాటం కాలేజీ యాజమాన్యాల కోసంకాదని, విద్యార్థుల కష్టాలు బాధలు తీర్చడం కోసం చేస్తున్నానని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'కృష్ణన్న యజమాన్యాల ఉచ్చులో పడకు' అంటూ చేసిన వ్యాఖ్యాలపై ఆయన వివరణ ఇచ్చారు. '50 యేళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల చదువుల కోసం పోరాడుతున్నాను. ఫీజుల రీయింబర్స్‌మెంట్ స్కీమ్ కోసం 2004–08 వరకు అనేక పోరాటాలు చేశాను. చివరకు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అప్పుడు సిఎం రాజశేఖర్‌రెడ్డి స్పందించి, మంత్రివర్గ ఉపసంఘం నిర్మించి, వారితో చర్చించి ఈ పథకం ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ఈ పథకం కింద లక్షలాదిమంది విద్యా ర్థులు పైసా ఖర్చు లేకుండా ఉన్నత విద్య చదువుచున్నారు. ఈ స్కీం ప్రవేశ పెట్టినప్పుడు జీవో జారీ చేసిన జీవో నం, 8, 50లపైన నా పేరు రిఫరెన్స్‌లో ఉంది' అని అన్నారు. 'ఫీజుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులు విడు దల చేయడంలో ప్రభుత్వ జాప్యంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి బాధలు చూసి స్పందించి ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఫీజులు కట్టాలని విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు. చదువులు పూర్తయిన ఫీజులు లేక సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్లు తీసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. విదేశాలకు చదువుకోవడానికి సీట్లు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు లేక వెళ్లలేకపోతున్నారు' అని కృష్ణయ్య పేర్కొన్నారు.

## గంజాయి సేవిస్తూ ఈగల్ పోలీసులకు పట్టుబడిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ భరతం పట్టేందుకు ఏర్పాటైన ఈగల్ (పూర్వపు టి.నాబ్) నగరంలోని ఓ ప్రముఖ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజిలో చదువుతున్న ఆరుగు రు విద్యార్థులు పార్టీలో గంజాయి సేవిస్తుండగా పట్టుకుంది. పట్టుబడ్డ ఆరుగురు విద్యార్థులను పున రావాస కేంద్రానికి తరలించారు. దీనిపై నార్కోటిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబం ధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాం డిల్యా శనివారం మీడియాకు వెల్లడించారు. బేగంపేట్‌లోని క్యులినరీ అకాడమి ఆఫ్ ఇండియా అనే కాలేజిలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో చివరి సంవత్స రం చదువుతున్న 11 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి కాళాశాల ప్రాంగణంలో పార్టీ చేసుకున్నారు. అయితే ఈ పార్టీలో కొందరు విద్యార్థులు గ ంజాయి సేవిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దాడి చేశారు. 11 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ఇందులో సా క్షి ఎమాలియ (22), మోహిత్ షాహి (21), కరోలినా రావత్ (27), అరిక్ జనాథన్ అంటోని (21), లాయ్ బారువ (22)లు గంజాయి సేవించినట్లు తేలింది. ఈ పరీక్షలు విద్యార్థుల కుటుంబీకుల సమక్షంలోనే నిర్వహించారు. దీనిపై నార్కోటిక్ పోలీసులు కేసు నమోదు చేసి గంజాయి సేవించిన ఆరుగురిని వెంటనే ఎర్రగడ్డలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ కేంద్రంలో వీరంతా కొన్ని రోజుల పాటు వుండాల్సి వుంటుంది. అక్కడ పూర్తిగా ఆరోగ్యవంతులయ్యే వరకు వుండాల్సి వుంటుంది.

ఒకవేళ ఈ కేంద్రంలో ఏదైనా గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమి నల్ కేసులు నమోదు చేస్తారు. కాగా ఆరుగురిలో మోహిత్ గతంలో పలుమార్లు డ్రగ్స్ సేవిస్తూ దొరికిపోయినట్లు ఈగల్ పోలీసులు తేల్చారు. ఇతని పై కఠిన నిఘా వుంచాలని నిర్ణయించారు. వీరికి ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన జాసన్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు తేల్చిన ఈగల్ పోలీసులు అ తని కోసం గాలింపు చేబ ట్టారు. ఈ ఘటనలో కాలేజి యాజమాన్యం నిర్లక్ష్యం వుండడంతో దానిపైనా విచారణ చేబట్టారు. గతంలో ఇదే కాలేజికి చెందిన కొందరు విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తూ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు లకు పట్టుబడడంతో తాజా ఘటనను ఈగల్ పోలీసులు తీవ్రంగా పరిగణించారు.

విద్యార్థుల విషయంలో తల్లిదండ్రుల నిఘా వుండాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. తమ పిల్లలు ఏం చేస్తునా న్నరనే దానిపై తల్లి దండ్రులు నిరంతరం గమనిస్తూ వుండాలని ఆయన కోరారు. లేకుంటే పిల్లల భవిష్యత్తు పాడవుతుందని ఆయన తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 1908 లేదా 8712671111కు ఫోన్‌చేసి తెలపాలని ఆయన కోరారు. డ్రగ్స్ నిర్మూలన లో అందరి సహకారం కావాలని సందీప్ శాండిల్యా కోరారు.

## యువతలో బ్రహ్మాసమాజం జ్ఞానదీప్తిని వెలిగించాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న గరవ్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** బ్రహ్మా అనేది ప్రతి చోటా ఉన్న పరమాత్మ తత్వం, మనలో, మన చుట్టూ, సృష్టిలో ప్రతి అణువులో బ్రహ్మాతత్వం ఉందని గ్రహించడం ఆధ్యాత్మిక బోధనలో మొదటి అడుగు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. హైదరాబాద్ దక్కన్ బ్రహ్మాసమాజం ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో 134వ ఆల్ ఇండియా బ్రహ్మో కాన్ఫరెన్స్ జరిగింది. ఓం ఏకమేవాద్వితీయం అనే ఆధ్యాత్మిక సందేశాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ బ్రహ్మా సమాజం వంటి మానవతా, ధార్మిక ఆలోచనలను ముందుకు తీసుకెళ్తున్న సంస్థల్లో యువతరం చురుకుగా పాల్గొని సూచించారు. సమాజ సేవ, నీతి, ధర్మం, జ్ఞానం ఇవన్నీ మన దేశానికి బలమైన పునాదన్నారు. 'వర్క్ ఈజ్ వర్షిప్' పని అంటేనే పూజ అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ధర్మం అంటే కేవలం ఆచారం కాదు. అది సత్యం, కర్తవ్యబోధ, నైతికతతో నిండిన సజీవమైన జీవన విధానం అని అన్నారు. విశ్వభారతి విశ్వ విద్యాలయం భారత ఆధ్యాత్మి కత, జ్ఞానం, సంస్కృతికి ప్రతీకగా నిలిచిందని. బ్రహ్మా సమాజం కూడా అదే భావజాలాన్ని సమాజంలో వ్యాప్తి చేస్తోందని ఆయన అభినందించారు. బ్రహ్మా సమాజం యువతలో ఆత్మవిశ్వాసం. సేవాభావం, జ్ఞానదీప్తిని వెలిగించే వేదికగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. బ్రహ్మా సమాజం ఆధ్యాత్మిక తత్వాలు సమానత్వం, మానవతా సిద్ధాంతాలను ప్రోత్సహించడమే బ్రహ్మా సమాజం ప్రధాన ఉద్దేశమని హైదరాబాద్ డెక్కన్ బ్రహ్మా సమాజ్ అధ్యక్షులు కేశవ్ చందు చల్ల, ఆల్ ఇండియా బ్రహ్మో కాన్ఫరెన్స్ కమిటీ చైర్పర్సన్ డి. అభిగన్య. అధ్యక్షురాలు రేఖ శహాణి, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ బ్రహ్మా సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ వుడై పి. కృష్ణ, కార్యదర్శి అనిరుద్ రక్షి త్ తెలిపారు. బ్రహ్మా సమాజం స్థాపకులాలోచనలను స్మరించుకుంటూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. బ్రహ్మా సమాజం అనేది కేవలం ఒక తమ ఉద్యమం కాదని, ఇది మనిషిని మనిషిగా చూడడం, సమానత్వం. ప్రేమ. నీతి, జ్ఞానం అనే విలువలపై ఆధారపడి ఉన్న ఆధ్యాత్మిక స్ఫూర్తి ఉద్యమం అని వారు అన్నారు. 19వ శతాబ్దం లో రాజా రామ్మోహన్ రాయ్ స్థాపించిన ఈ బ్రహ్మా సమాజం దేశంలో సామాజిక సంస్కరణలకు పునాది వేసిందన్నారు. నేటి కాలంలో కూడా బ్రహ్మా సమాజం ఆత్మ, నైతికత, విద్య, సాంఘిక సమానత్వం వంటి విలువలను మళ్లీ ప్రజల్లో నాటించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. యువతరం ఆలోచనలో సత్యం, సౌమ్యత, మానవత్వం నాటే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మా సమాజం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగుతుందని నిర్వహాకులు తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి

### ప్రతిపక్షం గెలిస్తే ధర్నాలు.. రాస్తారోకోలే : కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి చేస్తాడని అపోజిషన్ గెలిస్తే ధర్నాలు, రాస్తా రోకోలకే పరిమితం అవుతారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిపంచుకోవాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండు సంవత్సరాలు గడిచాయని మరో మూడేళ్లు అధికారంలో ఉంటమాని రాబోయే మరో ఐదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి స్థానికులు, విద్యా వంతులు రెండుసార్లు పోటీచేసిన అనుభవం ఉందని అలాంటి యువనాయకుడిని ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ద్వారా రాష్ట్రముఖ్య మంత్రి కావాల్సిన అంత నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తారన్నారు. గత పదేళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. తమ అభ్యర్థి పైనా, అతని తండ్రిపైనా కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారం చేస్తున్నారని వారిని దగ్గర పరిశీలిస్తే వాళ్లు ఎలాంటి వాళ్లో అర్థమవుతుందన్నారు. కేటీఆర్ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తున్నాడని అందుకు జూబ్లీహిల్స్ ఎన్నికలను ఉపయోగించు కోవాలని చూస్తున్నారన్నారు. హైడ్రాను బూచీగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని జూబ్లీహిల్స్‌లో ఏ ఒక్క ఇల్లు కూల్చలేదన్నారు. బాధ్యతలేని సోషల్ మీడియాను నమ్మి మోసపోకండి అని సూచించారు.

## గుర్తింపు పొందిన స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి లోని గుర్తింపు పొందిన పాఠశాలలు సమస్య లను పరిష్కరిం చాలంటూ రికగనైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వారి సమస్యలపై పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా పాఠశాలలపై ప్రొఫెషనల్ ట్యాక్స్ (వృత్తి పన్ను) విషయమై, ట్రేడ్ లైసెన్స్‌లపై మంత్రికి విన్నవించుకోగా పాఠశాలలు స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు వాణిజ్య పన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అదేవిధంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా సొసైటీ ద్వారా నడుస్తున్న పాఠశాలలకు ట్రేడ్ లైసెన్స్ వర్తించదని ఆయనకు వర్తించదని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి కమిటీ సభ్యుల సమక్షంలోనే వాణిజ్య పన్నుల కమిషనర్‌కు ఫోన్‌లో మాట్లాడి ఈ సంవత్సరం నుంచి పాఠశా లల యాజ మాన్యాలు స్వచ్ఛందంగా రిజిస్టర్ చేసుకుని పన్ను చెల్లిస్తారని తెలిపారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ ల విషయంలో కూడా తగిన విధంగా వారికి సహకరించాలని సూచిం చారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో ఆర్ ఎస్ఎంఏ మరోసారి విజయం సాధించడంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అగస్టీన్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి క్వాజా కుద్బుద్దీన్, ఎమ్ఎస్ ప్రసాద్, కేపీఎమ్ అసీఫ్ అలీ, దస్తగిరి ఖాన్, ఏ శ్రీకాంత్‌రాజు, ఎల్ సుధాకర్, ఎమ్ ఆర్ దేవీ ప్రసాద్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.


గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ కమిటీ సభ్యులు.

## మినరల్స్ తవ్వకంలోకి ఖనిజాభివృద్ధి సంస్థ

### అనుమతి కోసం సర్కార్‌కు ప్రతిపాదనలు

### రాష్ట్రంలో గ్రానైట్, సున్నపురాయి నిక్షేపాలు గుర్తింపు

### ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న ప్రైవేటు సంస్థలు

### సొంతంగా తవ్వకాలు జరపాలని సంస్థ నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** తెలంగాణలో మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండగా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొందిన సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణ యించింది. ఈ నేపథ్యం లో దీనికి సంబంధించిన ప్రతిపాద నలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికా రులు ప్రభుత్వానికి సమ ర్పించారు. రాష్ట్రంలో ఇసుకతో పాటు, డోలమై ట్, గ్రానైట్, సున్నపు రాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణ యించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజా భివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది.

ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాధపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివాంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అను మతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

## దుండిగల్‌లో వివాహిత దారుణహత్య

### అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 8, ప్రభాతవార్త:** వివాహితను గొంతు కోసి హత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా, తిమ్మాపూర్‌కు చెందిన సుజాత(30)దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం దంపతుల ఇరువురి మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో సుజాత తన పిల్లలతో కలిసి భర్తకు దూరంగా బహాదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటుంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను పోషించు కుంటుంది. ఈ క్రమంలో ఆమెకు ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి కొంతకాలంగా సన్నిహి తంగా ఉంటున్నారు. గత పదిరోజులుగా వీరి ఇరువురి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. శనివారం సుజాత ఇంట్లో దారుణ హత్యకు గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరు కొని ఆధారాలు సేకరించారు. సిసి కెమెరాలు ఉండడంతో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మృతురాలితో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తికి సంబంధించిన వారే హత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.


సుజాత (ఫైల్)

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైంది

### బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాల అనంతరం తన పదవికి గండం పొంచి ఉందనే భయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మానసిక్థితి దెబ్బతిన్నట్లుందని అందుకే సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శిం చారు. ముఖ్యమంత్రిని చూసి సిగ్గే సిగ్గుపడేలా ఉందని వ్యాఖ్యా నించారు. నగరంలో నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ నిర్మిస్తే, రేవంత్‌రెడ్డి అదే కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నారని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సచివాలయం అంశాలపై కమిషన్ వేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో ఎన్ని గదులు ఉన్నాయో చూడటానికి రావాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధి అజెండా పైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్‌ను, సోనియా గాంధీని రేవంత్ రెడ్డే తిట్టారని ఆరోపించారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడతారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని జోస్యం చెప్పారు. రేవంత్ రెడ్డి చేసే తప్పులను చరిత్ర క్షమించదని అన్నారు. రేవంత్ రెడ్డి తన నోటి దురుసుతనం కారణంగా బీహార్ నుంచి వెళ్లగొట్టే పరిస్థితి తెచ్చుకున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని కాదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారని గుర్తు చేశారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరు పదవుల్లో ఉన్నారు కాబట్టే వారిని బ్యాడ్ బ్రదర్స్ అని కేటీఆర్ అన్నారని వ్యాఖ్యానించారు. వారిద్దరూ మోదీ శిష్యులేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి బాధ్యతను రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇదీ ఒకటని విమర్శించారు. రేవంత్‌రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక డ్రగ్స్ సంబంధత నేరాలు ఎక్కువయ్యాయని అన్నారు. పోలీసు కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి భాషతో తెలంగాణ పరువు పోతోందని, ఇప్పటికైనా ఆయన తనతీరు మార్చుకోవాలని హితవు పలికారు.


దొంగతనం జరిగిన దుకాణం పరిశీలిస్తున్న డిఐ బాల్‌రెడ్డి

## జ్యుయెలరీ షాపులో చోరీ

### 15 కిలోల వెండి అపహరణ

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 8, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తులు జ్యుయెలరీ షాపులో వెండి ఆభరణాలు దొంగలించిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ, భౌరంపేట పరిధి ఒక్రిడ్జ్ స్కూల్ సమీపంలో మోత్కూర్ సోమేశ్వర్ అనే వ్యక్తి సోమేశ్వర జ్యుయెలరీ పేరుతో బంగారు, వెండి ఆభరణాల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి సోమేశ్వర్ దుకాణం మూసి వెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం తెరిచి చూడగా ఓవైపు గోడకు రంధ్రం ఉండడంతో పాటు వెండి ఆభరణాలు కనిపించ లేదు. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఘటనాస్థలికి చేరుకున్న క్లూస్‌టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. దుకాణంలోని 15 కేజీల వెండి ఆభరణాలను దొంగలించబడినట్లు సోమేశ్వర్ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎం కీలుబొమ్మలు

### ఎన్నికల ప్రచారసభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకొని ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. మధురానగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు గెలిచినంత మాత్రాన జరిగే మార్పు ఏమీ ఉండదని, ఈ ఒక్కసారి బీజేపీ అవకాశం ఇచ్చి నరేంద్ర మోదీ నాయ కత్వాన్ని బలపర్చా లని కోరారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ లు పాలించాయి కానీ బతుకులు మారలేద న్నారు. డ్రైనేజీ నీటిలో నిలబడి మీటింగ్‌లు పెట్టు కోవాల్సిన దుస్థితి వచ్చింది. రహ్మత్ నగర్, వెంగళరావు నగర్, బోర బండ కాలనీల్లో మురుగు నీరు పారుతున్నా, ఈ కంపు వాసనలో ప్రజలు ఎలా బతుకుతున్నారో కేసీఆర్ ఒక్క రోజైనా ఆలోచించారా అన్నారు. వర్షం వస్తే రోడ్లన్నీ మునిగి పోతా యని, ఇక్కడ 11 ఏళ్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా, జూబ్లీహిల్స్‌ను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎం కీలుబొమ్మలుగా మారాయన్నారు. ఈ మూడు పార్టీలు నిజానికి ఒక్కటేనని. పాతబస్తీలో మజ్లిస్ నేతలు హిందువులపై దాడులు చేశారన్నారు. పాతబస్తీలో మంత్రులు పర్యటించాలంటే ఎంఐఎం కార్యాలయం అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రేపు జూబ్లీహిల్స్ అదే పరిస్థితి రావచ్చని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకుండా, ఇప్పుడు డబ్బులతో ఓట్లు కొనాలని చూస్తున్నారన్నారు. మోసపూరిత పార్టీలకు ఓటు వేయకుండా, ఆత్మగౌరవంతో ఈ రెండు పార్టీలపై ప్రతీకారం తీర్చు కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జూబ్లీ హిల్స్ ప్రజలు అమ్ముడుపోకుండా పులిబిడ్డలా నిలబడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

# ప్రజల ఆకాంక్షే మా అజెండా

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే తమ ప్రభుత్వ అజెండా అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకే బీఆర్ఎస్, బీజేపీ తమపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా శనివారం శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడలోని పలు కాలనీల్లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పాలనలో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలను ఓటర్లకు వివరించారు. మేం వేసే ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని, ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురయ్యిందన్నారు. చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో నిలదీయాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ... స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్ ను ఇక్కడ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే... ఇక్కడి ప్రజలు, నియోజకవర్గానికి మేలు జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియోజకవర్గం అభివృద్ధికి అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిరంతరం రాష్ట్రాభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కాంగ్రెస్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసిమ్ మునీర్‌కు మరిన్ని అధికారాలు!

### 27వ రాజ్యాంగ సవరణకు షరీఫ్ సర్కారు బిల్లు



**ఇస్లామాబాద్, నవంబరు 8:** పాకిస్థాన్‌లో పేరుకే ప్రజాస్వామ్య ప్రభుత్వం అధికారం చెలాయించేది మాత్రం ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్. ఇంటా బయటా మునీర్ ప్రభావం పెరుగుతోన్న నేపథ్యంలో పాకిస్థాన్ తన రాజ్యాంగంలో మార్పులు చేయాలని యోచిస్తోంది. ఈ మార్పుల ద్వారా సైన్యానికి మరిన్ని అధికారాలను కట్టబెట్టనున్నారు. త్వరలోనే 27వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ధ్రువీకరించింది. ఇందులో సాయుధ దళాల కమాండ్‌కు సంబంధించిన ప్రతిపాదిత మార్పులు కూడా ఉన్నాయి. ఈ చర్యతో పాకిస్థాన్‌పై మునీర్ మరింత పట్టుసాధించే అవకాశం ఉందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాయాది దేశంలో పౌరసైనిక సంబంధాలు ఎప్పటినుంచో సంక్లిష్టంగా ఉన్నాయి. సైన్యం నేరుగా పాలించిన చరిత్ర, ప్రజా ప్రభుత్వాలపై దాని విస్తృత ప్రభావం, అలాగే జాతీయ భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం దీనికి కారణం. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ చేసిన ఒక ట్వీట్‌తో రాజ్యాంగ సవరణలపై ఊహాగానాలు మొదలయ్యాయి. 27వ రాజ్యాంగ సవరణకు మద్దతు ఇవ్వమని ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తనను సంప్రదించిందని ఆయన ట్వీట్ చేశారు. అలాగే, పాక్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ ధర్ సెనేట్‌లో మాట్లాడుతూ రాజ్యాంగ సవరణను ధ్రువీకరించారు. 'అవును, ప్రభుత్వం ఈ సవరణను త్వరలోనే తీసుకురానుంది 27వ రాజ్యాంగ సవరణ రాబోతోంది. మేము చట్టాలు, రాజ్యాంగానికి అనుగుణంగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు.

## మళ్లీ అలుముకున్న యుద్ధమేఘాలు

# పాక్, అఫ్ఘాన్ చర్చలు విఫలం



**ఇస్తాంబుల్, నవంబరు 8:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటినీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారహితమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని ముందురోజే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణిం చారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వ భౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# భారత్‌లో హైడ్రోపోనిక్ గంజాయికి పెరుగుతున్న డిమాండ్

### యేడాదిలో విదేశాల నుంచి రూ.500 కోట్ల విలువైన సరకు స్మగ్లింగ్

### ఘాటు, అధిక మత్తు దృష్ట్యా ఎగబడుతున్న వ్యసనపరులు

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త:** భారత్‌లో ఏడాదిగా విమానాశ్రయాలతోపాటు రైల్వే స్టేషన్లలో విదేశాల నుంచి స్మగ్లింగ్ అవుతున్న హై డ్రోపోనిక్ గంజాయి భారీగా పట్టుబడుతుండడం హాట్ టాఫిక్‌గా మారింది. ఇప్పటి వరకు విదేశాల నుంచి భారత్‌కు కొకైన్ సహా కొన్నిరకాల రసా యన డ్రగ్స్ మాత్రమే స్మగ్లింగ్ అవుతుండగా ఈ జాబితాలో ఇప్పుడు హైడ్రోపోనిక్ గంజాయి కూడా చేరిపోయింది. గంజాయి విదేశాల నుంచి స్మగ్లి ంగ్ అవడం ఏమిటని అందరు ఆశ్చర్యపోతున్నా ఇక్కడే వుంది అసలైన ట్విస్టు. దేశంలో లభించే గంజాయితో పోలిస్తే అమెరికా, కెనడా, నెథర్లాండ్స్ , ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ దేశాల్లో ఎక్కువగా సాగయ్యే హైడ్రోపోనిక్ గంజాయికి ఇటీవల కాలంలో భారత్‌లో విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో స్మగ్లర్లు ఇతర మాదకద్రవ్యాలను వదిలి హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్‌కు కొత్త కొత్త దారులు వెతకసాగారు. భారత్‌లో లభించే గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయి ధర కాస్త ఎక్కువైనా ఘాటు, మత్తు ఎక్కువగా వుండడం వల్ల దీనికి మంచి డిమాండ్ ఏర్పడిందని దర్యాప్తు సంస్థలు చెబు తున్నాయి. భారత్‌లో ఏడాది కాలంలో ఇప్పటి వరకు విదేశాల నుంచి 500 వంద కోట్ల రూపాయల హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ అయ్యిందంటే దీనికున్న డిమాండ్‌ను ఊహించుకోవచ్చు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం నాడు బ్యాంకాక్ నుంచి వచ్చిన భారతీయ మహిళ వద్ద నాలుగున్నర కోట్ల రూపాయల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులను కొత్త తరహాలో సాగు చేసేందుకు శాస్త్రజ్ఞులు ఎంచుకున్న నూతన మార్గం హైడ్రోపోనిక్ పద్ధతి. నీరు, మట్టి అవసరం లే కుండా కొబ్బరి పీచు సహాయంతో చిన్నపాటి కుండీలలో కూరగాయలు ముఖ్యంగా ఆలుగడ్డలు, ఇతర దుంపలను పండించడం హైడ్రోపోనిక్ పద్ధతి లో ప్రత్యేకమైనది. హైదరాబాద్‌లోనూ ఈ తరహా వ్యవసాయం పలుచోట్ల జరుగుతున్నా వాణిజ్య పరంగా ఇంకా ఎదగలేదు. అయితే హైడ్రోపోనిక్ వ్యవసాయం కూరగాయల సాగులో ఎలావున్నా గంజాయి సాగుకు ఇప్పుడు విదేశాలలోని డ్రగ్స్ స్మగ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. దీనివల్ల దేశం లో మాదకద్రవ్యాల వ్యసనపరులు ఘాటైన మత్తుకోసం హైడ్రోపోనిక్ గంజాయి వెంట పడసాగారు. దేశంలో ఇప్పటికే లభ్యమవుతున్న దేశీయ మత్తు పదార్థాలు గంజాయితో పాటు నల్లమందు (ఓపిఎం), రసాయన డ్రగ్స్, సింథటిక్ డ్రగ్స్, కొకైన్, హెరాయిన్, ఎల్ఎస్‌డి వంటిని కాదని కొంతకాలం గా వ్యసనరరులు హైడ్రోపోనిక్ గంజాయిపై మక్కువ పెంచుకుంటున్నారు. ఏడాది క్రితం శంషాబాద్ విమానా శ్రయంలో 13 కోట్ల రూపాయల హై డ్రోపోనిక్ గంజాయికి పట్టుబడగా ఇద్దరు నేరగాళ్లు అరెస్టయ్యారు. ఈ గంజాయి బ్యాంకాక్ నుంచి వచ్చిం దని తేలింది. అంతకు ముందు ఢిల్లీ, గోవా, కర్నాటకలోని కొడుగులో 87 కోట్ల రూపాయల విలువచేసే హైడ్రోపోనిక్ గంజాయికి పట్టుబడింది. దీని తరువాత శంషాబాద్‌లో ఆరు నెలల వ్యవధిలో నాలుగుసార్లు ఈ తరహా గంజాయి పట్టుబడింది. వీటి విలువ 15 కోట్ల రూపాయల వరకు వుంటుంది. కాగా ఈ హైడ్రోపోనిక్ గంజాయికి థాయ్‌లాండ్, అమెరికా, కెనడా దేశాల నుంచి పలు దేశాల మీదుగా భారత్‌కు స్మగ్లింగ్ అవుతుందని డిఆర్ఐ అధికారులు తేల్చారు. సాధారణ గంజా యి పంటను ఎక్కడైనా ఎలాంటి పరిస్థితుల్లో అయినా సాగుచేసే వీలుంది. కానీ హైడ్రోపోనిక్ గంజాయి గ్రీన్ హౌస్‌లో లేదా ఇళ్లలో ప్రత్యేకంగా ఏ ర్పాటు చేసిన కుండీలలో సాగు చేయాల్సి వుంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా కుండీలు ఏర్పాటు చేయాలి. హైడ్రోపోనిక్ గంజాయి మొక్కల కోసం అనేకరకాల పోషకాలు కలిగిన ఎరువులతో పాటు చేపలు, బాతుల తాజా విసర్జితాలను వాడాల్సి వుంది. గంజాయి మొక్కలను నాటే కుండీలలో ఇసుక, కంకర రాళ్లు, ఒకసారి నీటిలో తడిపిన కొబ్బరిపీచు వాడాలి, వీటి సాగుకు నీటి అవసరం పెద్దగా వుండదు. గాలి సోకితే చాలు. మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

ఈ మొక్కలను నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు నిరంతరం పర్యవేక్షిస్తుం డడం వల్ల రెండున్నర నెలల నుంచి మూడు నెలల మధ్యలోనే ఇవి ఏపుగా పెరిగి వాడేందుకు ఉపయోగకరంగా వుంటాయి. ఇక హైడ్రోపోనిక్ గంజాయి మొక్కలకు ఆ పేరు రావడం వెనుక చిత్రమైన కథ వుంది, హైడ్రోపోనిక్ అనేది గ్రీకు పదం. హైడ్రో అంటే నీరు, ఫోనిక్ అంటే శ్రమ. ఈ కారణంగానే సంకర జాతి మొక్క అయిన దీనికి హైడ్రోపోనిక్ గంజాయిగా నామకరణం చేశారు. భారత్‌లో గడచిన ఏడాది వ్యవధిలో హైడ్రోపోనిక్ గంజాయికి స్మగ్లింగ్ చేస్తూ 80 మందికి పైగా దొరికిపోగా ఇందులో రష్యా సహ విదేశీయులు ఐదుగురు ఒకరున్నారు.

# ఇండియా ఎదుగుదలపై పొరుగు దేశాలకు అసూయ

### ఎల్‌కె అద్వానీ నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెంకయ్యనాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 8:** వందేమాతరాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని భారతదేశ అభివృద్ధి కోసం పని చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. ఇండియా ఎదుగుదలను చూసి పక్క దేశాలు అసూయ పడుతున్న తరుణంలో, భారతదేశ యువత మరింత మెరుగ్గా పని చేసి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాను సరి చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది మాత్రమే కాదని.. ఆయా రాజకీయ పార్టీలది కూడా అని సూచించారు. ఓటర్ల జాబితాలో కూడికలు, తీసివేతలు సహజమేనని.. వాటిని రాజకీయ పార్టీలు పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్కే అద్వానీ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు చెప్పారు. ఈక్రమంలో ఢిల్లీలోని ఎల్కే అద్వానీ నివాసానికి వెంకయ్య నాయుడు వెళ్లి కలిశారు. ఈ నేపథ్యంలో ఎల్కే అద్వానీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో వెంకయ్య నాయుడు మాట్లాడారు. భారత రాజకీయాల్లో మహోన్నత వ్యక్తి, ఉక్కు మనిషి లాల్ కృష్ణ అద్వానీ పుట్టినరోజు, ఎల్కే అద్వానీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి తాను ఢిల్లీ వచ్చానని పేర్కొన్నారు. అద్వానీకి ఉన్న దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేవుడు ఆయనకు పరిపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఎల్కే అద్వానీ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. నక్సల్స్ మూమెంట్ దాదాపు అంతరించిపోయే దశకు వచ్చిందని.. ఇది మంచిదేనని చెప్పుకొచ్చారు. నక్సల్స్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నక్సల్స్‌లో ఎవరికి వాళ్లే తమ సిద్ధాంతాలు చెబుతారని, కమ్యూనిస్టుల మధ్యే ఎన్నో విబేధాలు ఉన్నాయని ఆరోపించారు. మొదట్లో నక్సల్‌కు ప్రజల మద్దతు ఉండేదని తెలిపారు. అయితే, బుల్లెట్ కంటే బ్యాలెట్ పవర్ ఫుల్ అని ఉద్ఘాటించారు. సోషల్ మీడియాని నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఎల్కే అద్వానీ క్రౌడ్ పుల్లర్‌గా ఉండే వారని అభివర్ణించారు. 2014లో నరేంద్రమోదీ శకం మొదలు పెట్టాల్సి వచ్చిందని, అప్పటికే గుజరాత్ మోడల్‌పై దేశ వ్యాప్తంగా చర్చ జరిగిందని తెలిపారు. గుజరాత్‌లో ఆ సమయంలో నరేంద్ర మోదీ సక్సెస్ ఫుల్ చీఫ్ మినిస్టర్‌గా ఉన్నారని నొక్కిచెప్పారు. ప్రపంచంలో మల్టీనేషనల్ కంపెనీలను భారతీయులు కొనసాగిస్తున్నారని వివరించారు. అమెరికాలో పరిస్థితి దాదాపుగా మారిందని, ఆయా ఎన్నికల్లో భారతీయ సం తతి వాళ్లు గెలుస్తున్నారని తెలిపారు. ఇండియా ఇతర దేశాలతో పోలిస్తే చాలా తెలివైనదని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.



# జూబ్లీలో వార్ వన్‌సైడ్

### కాషాయ జెండా ఎగరడం ఖాయం: కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ అని, కాషాయ జెండా ఎగరడం ఖాయమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు ద్వారా రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో హిందూ రాజ్య స్థాపనే తమ లక్ష్యమని అన్నారు. చార్మినార్ మీద కాషాయ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా షేక్‌పేట, మీనాక్షిపురం(రహమత్‌నగర్) కూడలిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ బీజేపీ-కాంగ్రెస్ మధ్య అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిస్సుగ్గుగా ముస్లింలంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే ముస్లింలని చెబుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇస్లామిక్ రాజ్యంగా మారుస్తుందన్నారు. తెలంగాణలో ఆర్‌కే(రేవంత్‌రెడ్డి, కేటీఆర్) టాక్స్ కొనసాగేదని, ఇప్పుడు ఓఆర్(ఓవైసీ, రేవంత్‌రెడ్డి) టాక్స్ కొనసాగుతుంద న్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఎంఐఎం పార్టీ చైన్ స్నాచర్స్ పార్టీ అని, మన దగ్గర ఉన్నవన్నీ లాక్కొని వెళ్తారన్నారు. బంజారా హిల్స్‌లో పెద్దమ్మగుడికి స్థలం కేటాయించి గుడి నిర్మాణం చేపట్టి కేంద్ర మంత్రి అమిత్‌షాను తీసుకొచ్చి కొబ్బరికాయ కొట్టిస్తామని అన్నారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి టోపీలు పెట్టుకొని ప్రచారం చేస్తున్నారని, పక్కన స్వామీజీలను పెట్టుకొని ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్నించారు. తాను ఎన్ని కేసులకైనా, ఎన్నిసార్లు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని అన్నారు. నిజామాబాద్‌లో కానిస్టేబుల్ హత్య, నగరంలో డీసీపీపై దాడి, కరీంనగర్‌లో మైనర్ బాలికపై అత్యాచారం సంఘటనలో ఉన్న నిందితులెవరో గుర్తించాలని అన్నారు. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకోవాలని, ఓటు మాత్రం కమలానికి వేయాలన్నారు. మాగంటి ఆస్తులపై రేవంత్‌రెడ్డి, కేటీఆర్ కన్ను పడిందన్నారు. మాగంటి గోపీనాథ్ వ్యవహారంలో తాను ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తానని ముఖ్యమంత్రి అంటున్నారని, ప్రభుత్వం, పోలీసులు ఆయన చేతిలో ఉన్నారన్నారు. ఇప్పటికే మాగంటి భార్య కుమారుడు నెల కిందట మాదాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడని, ఈ విషయం సైతం ఇంటిలిజెన్స్ సీఎంకు చెప్పలేదా అంటూ ప్రశ్నించారు. శనివారం రాయదుర్గం పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేయడానికి వెళ్లారన్నారు. మాగంటి సునీతకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయని ఆయా దృశ్యాలను బండి సంజయ్ విడుదల చేశారు. అలాగే ఎన్నికల సంఘానికి మాగంటి సునీత సమర్పించిన అఫిడవిట్‌లో ఒకదానిలో పదో తరగతిగా, మరో రెండింటిలో చదువు లేదని పేర్కొన్నట్లు తెలిపారు. కేంద్రం నిధులు ఇవ్వ కుంటే రేవంత్‌రెడ్డి డబ్బులు ఎక్కడి నుంచి తీసు కొస్తున్నాడని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ జెండా కచ్చితంగా ఎగురుతుందని అన్నారు. బీజేపీ అధ్యక్షుడు రాంచదర్‌రావు మాట్లాడుతూ.. కాం గ్రెస్, బీఆర్ఎస్ మోసపూరిత పాలనకు జూబ్లీ హిల్స్ ప్రజలు ముగింపు పలుకబోతున్నా రన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే సాధ్యమైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

# 14 తర్వాత రాష్ట్రంలో తుఫాన్ రాబోతోంది

### ఆకురౌడీలను రేవంత్‌రెడ్డి కాపాడలేడు

### ఎర్రగడ్డ ప్రచారసభలో కెటిఆర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 8, ప్రభాతవార్త:** ఈ నెల 14 తరువాత రాష్ట్రంలో తుఫాను రాబోతుందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు చారిత్రా త్మక తీర్పునివ్వబోతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎర్రగడ్డలో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం రెండేళ్ల నుంచి నాశనం అయ్యిందని, ఆటో అన్న మహమూద్ ఇదే విషయాన్ని తనకు చెప్పాడన్నారు. గతంలో ప్రతి రోజు 2 వేలు సంపాదిస్తే ఇప్పుడు కేవలం వెయ్యి రూపాయలు వస్తున్నాయని చెప్పాడ న్నారు. పిల్లలకు ఫీజు, ఇల్లు ఎలా గడపాలని ప్రశ్నించాడన్నారు. ఒక్కసారి ఓటు వేస్తే అయిదు ఏళ్లు శిక్షను అనుభవించాల్సి వస్తుందని, ఆలోచించి, ఆచితూచి నిర్ణయం తీసుకొని ఓటు వేయాలని కోరారు. ఇందుకు జూబ్లీ హిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించి వారికి బుద్ధి చెప్పడమే పరిష్కారమన్నారు. బీఆర్ ఎస్ లీడర్ షరీఫ్‌ను బలవంతంగా తీసుకెళ్లి కండువా కప్పారని, పార్టీ నేతలపై దౌర్జన్యం చేస్తూ వారిని తీసుకెళ్తున్నారన్నారు. ఇలాంటివి చేయడానికి కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలన్నారు. దమ్ముంటే ఎన్నికల్లో పోరాడాలని హితవు పలికారు. ఒక్క చాన్స్ ఇస్తే నాశనం చేశాడని, మరోసారి జూబ్లీహిల్స్‌లో ఓటు వేస్తే సర్వనాశనం చేస్తాడని అన్నారు. పుట్టిన పిల్లల నుంచి మొదలు పెడితేవృద్ధుల వరకు కాంగ్రెస్ అందరినీ మోసం చేసిందన్నారు. కత్తి కాంగ్రెస్‌కు ఇచ్చి మమ్మల్ని యుద్ధం చేయమంటే చేయలేమని, కత్తి మాకిస్తేనే యుద్ధం చేయడం సాధ్యమని అన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత కరెంటు సమస్య, తాగునీటి సమస్య వచ్చిందన్నారు. మైనార్టీలకు ఇస్తానన్న ఒక్క హామీ అయినా కాంగ్రెస్ అమలు చేసిందా? అంటూ ప్రశ్నించారు. మైనార్టీల కోసం కేసీఆర్ స్కూళ్లు కట్టారని, వారికి అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ నేతలు ఓటుకు రూ.5వేలు, రూ.6వేలు, యూసుఫ్‌గూడలో రూ.8వేలు ఇస్తున్నారని, ప్రజలు బరాబర్ డబ్బులు తీసుకొని హామీలు అమలు చేయకుండా బాకీలు పడ్డ డబ్బుల కోసం ప్రశ్నించండి అన్నారు.

# హెచ్-1బి దుర్వినియోగంపై ట్రంప్ 'ఫైర్‌వాల్'

### 175 కేసుల్లో దర్యాప్తు

**వాషింగ్టన్, నవంబరు 8:** హెచ్-1బి వీసా దుర్వినియోగం వల్ల విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తోంది. అందులో భాగంగా కార్మిక శాఖ సెప్టెంబరులో ప్రాజెక్టు ఫైర్‌వాల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాని కింద ఈ వీసా అవకతవకలపై దర్యాప్తు ప్రారంభించిన కార్మిక శాఖ 175 కేసులో నమోదు చేసింది. ఈ మేరకు అమెరికా మీడియా సంస్థ కథనం పేర్కొంది. హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాతే కార్మిక శాఖ ప్రాజెక్టు ఫైర్‌వాల్‌ను ప్రారంభించింది. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులతో కంపెనీలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా చూడటమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. అలాంటి దుర్వినియోగంపై లేబర్ విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తున్నామని ఆ శాఖ మంత్రి లోరి చావెజ్ వెల్లడించారు. అయితే ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలను మాత్రం బయట పెట్టలేదు. అధ్యక్షుడి నాయకత్వంలో అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు మొదట అమెరికా కార్మికులకే వెళ్లేలా చూస్తామని పేర్కొన్నారు.

# ఎయిర్‌లైన్స్ సంస్థల్లో ఉద్యోగాల పేరిట మోసం

### నకిలీ ఉద్యోగ రాకెట్ గుట్టురట్టు చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, నవంబరు 8:** ఎయిర్‌లైన్స్ సంస్థల్లో ఉద్యోగాల పేరుతో చేస్తున్న మోసం బయటపడింది. నకిలీ ఉద్యోగ రాకెట్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఉద్యోగి, ఏడుగురు మహిళా టెలికాలర్లు వీరిలో ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. పశ్చిమ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఇండిగో సహా ప్రముఖ విమానయాన సంస్థలకు రిక్రూటర్లుగా నమ్మిస్తున్నారు. ఉపాధి అవకాశాలను కల్పిస్తామని చెప్పి ఉద్యోగార్థులను మోసం చేస్తున్నారు.

కాగా, ఓఎల్ఎక్స్, ఇతర ఉద్యోగ పోర్టల్‌లలో నకిలీ ప్రకటనల ద్వారా ఉద్యోగార్థులను వీరు ఆకట్టుకుంటున్నారు. ఎయిర్‌లైన్ అధికారులుగా నటిస్తూ ఫోన్లలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ప్రాసెసింగ్ ఫీజులు, యూనిఫాం ఛార్జీలు, జీతం కోసం బ్యాంకు ఖాతాలను తెరిచే పేరుతో దరఖాస్తుదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పలు దశల్లో రూ. 2,500 నుంచి 15,000 వరకు వసూలు చేస్తున్నారు. మరోవైపు ఈ ఉద్యోగ కుంభకోణంలో ఒక వ్యక్తి రూ. 11,000 పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సుభాష్‌నగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో నిందితులు ఉన్నట్లు తెలుసుకున్నారు. ప్రధాన నిందితుడు వికాశ్‌కుమార్ అలియాస్ వీక్కీ (38), అతడి సహచరుడు, టెలికాం కంపెనీ ఉద్యోగి బల్జీత్‌సింగ్ (31)ను అరెస్టు చేశారు. కస్టమర్ల బయోమెట్రిక్ డేటా ఉపయోగించి మోసపూరితంగా సిమ్‌కార్డులు వీరు జారీ చేస్తున్నట్లు దర్యాప్తులో తెలిసింది.

కాగా, గణేశ్‌నగర్, తిలక్‌నగర్ నిర్వహిస్తున్న అక్రమ కాల్‌సెంటర్లపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు మహిళా టెలికాలర్లను అరెస్టు చేశారు. చరణ్‌జిత్ అలియాస్ చారు, షాలిని భరద్వాజ్, ఆర్తి కౌర్, పర్వీన్ కౌర్, నందిని, పూజాగుప్తా, శ్వేత అలియాస్ శివాన్‌సింగ్‌గా వీరిని గుర్తించారు. జాబ్ పోర్టల్‌ల ద్వారా వారిని నియమించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉద్యోగార్థులకు కాల్ చేసి వారిని ఒప్పించడానికి ఒక్కొక్కరికి నెలకు రూ. 15,000 చెల్లిస్తున్నట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. 22 మొబైల్ ఫోన్లు, డెస్క్‌టాప్ కంప్యూటర్, 19 సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాల క్యూఆర్ కోడ్‌లు, ఎయిర్‌లైన్ పేర్లను పోలి ఉండే యుపిఐ ఐడిలు, వై-ఫై రౌటర్ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఈ నకిలీ జాబ్‌రాకెట్ ముఠా దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. 40 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిసిందన్నారు. అయితే చిన్నతరహా ఆర్థిక మోసాల వల్ల నష్టపోయిన పలువురు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో యేడాదిగా వీరి మోసాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.





## కార్తికమాసం శివదర్శనానికి
# పోటెత్తిన భక్తులు

**శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త** కార్తీక మాసం శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయం శివ రాత్రిని మరపించింది. ఎటు చూసినా భక్త జనమే.ఉదయం నుంచి ఆలయంలో శివ నామస్మరణతో మార్మోగింది.అయితే కార్తీక మాసంలో భక్తజనులకు సంబంధించి అవ గాహన ఉన్న ఇఒ డి.బాపిరెడ్డి చక్కటి ఏర్పాట్లు చేసారు. ఉదయం నుంచి ఆలయంలోని క్యూలైన్ల వద్ద భక్తులకు సత్వర దర్శనం-సుదర్శనం కల్పించుటకు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా శని,ఆది, సోమవారాల్లో ఆలయానికి భక్తుల తాకిటి అధికంగా ఉంటుంది. అయితే కార్తీక మాసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ సిబ్బందిని జాగృతపరచారు. ఎవ్వరికి ఇబ్బంది లేకుండా లఘుదర్శనంతో సుదర్శనం ఏర్పాటు చేసారు. కార్తిక మాసంలో శివదర్శనం శ్రేష్ఠమని చెబుతారు. అయితే దక్షిణ భారత దేశంలోని శైవ క్షేత్రాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిసు_న్నాడు. అయితే భక్తిభావంతో పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులకు సరైన సమాచారం లేదన్నారు.

# అమరావతి నుంచి జనవరిలో క్వాంటం కంప్యూటర్ ఆవిష్కరణ!

**- కుప్పంలో 7 పరిశ్రమలకు రూ. 2,203 కోట్లతో వర్చువల్ శంకుస్థాపన చేసిన సిఎం చంద్రబాబు**



అమరావతినుంచి కుప్పం ప్రజలు, రైతులతో వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

**కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త** పిల్లలకు ఆస్తికంటే మంచి చదువు, సంప్రదాయాలు ఇవ్వాలని తన తపన అంతా భావితరాల కోసమేనని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో రూ2203కోట్లతో ఏర్పాటయ్యే ఆదిత్య బిర్లా, మదర్ డెయిరీ, శ్రీజ డెయిరీ, ఎస్‌విఎఫ్ సోయా, ఏస్ ఇ ంటర్నేషనల్, ఇ-రాయిస్, అలీప్ తదితర ఏడు పరిశ్రమలకు సిఎం శ ంకుస్థాపన చేశారు. అనంతరం పారిశ్రామికవేత్తలు, కుప్పం ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కుప్పంలో ఇంకా 6339కోట్లతో మరో ఎనిమిది పరి శ్రమలు రానున్నాయని ప్రకటించారు. తమది సంక్షేమ ప్రభుత్వం అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్‌హిట్ చేశామని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఈజ్‌ఆఫ్ డూయింగ్ విధానంలో ముందుకుసాగుతున్నామన్నారు. శు క్రవారం ఒక్కరోజే ఎస్‌ఎపిజి ద్వారా లక్ష కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఇంటికో పారిశ్రామికవేత _,ఇంటికో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)నిపుణుల ద్వారా చరిత్ర సృష్టిస్తామన్నారు. జనవరినెలలో రాజధాని అమరావతి నుంచి క్వాంటం కంప్యూటర్‌ను ఆవిష్కరిస్తామని ప్రకటించారు. రాష్ట్రానికి మున్ముందు భారీపరిశ్రమలు రానున్నట్లు చెప్పారు. వైజాగ్‌కు గూగుల్ డేటా సెంటర్ తెచ్చామని అలాగే వైజాగ్‌కు యాభై బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సేఫ్‌సిటీ, ఏరోస్పేస్, క్వాంటంవా ్యలీ, డ్రోన్ సిటీలనుఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హై డ్రోజన్ హబ్‌గా మార్చుతున్నట్లు సిఎం ప్రస్తావించారు. గతంలో తాను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ప్రారంభించగా నేడు దేశంలోనే ప్రముఖ స్థానానికి వెళ్లిందన్నారు. గతంలో తీసుకువచ్చిన ఐ.టి.పాలసీతో నేడు విదేశాల్లో ఎంతోమంది తెలుగువారు స్థిరపడ్డారనే విషయం గుర్తు చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతులు 33వేల ఎకరాలు ల్యాండ్ పూలి ంగ్ విధానంలో ఇచ్చారన్నారు. వారికి భూములు అభివృద్ధి చేశాక కొంతమేర అప్పగించామని తద్వారా భూముల ధర అమాంతం పెరిగిందన్నారు. ప్రజలు పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం : రాష్ట్రంలో తొలిదఫా లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకై డ్వాక్రా సంఘాల మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.పాతికేళ్ల క్రితం మహిళల అభివృద్ధికి చర్యలుచేపట్టామన్నారు. నేడు మహిళల ఖాతాల్లో 25వేల కోట్ల కార్పస్ ఫండ్ ఉందన్నారు. ఇ ంటికో పారిశ్రామికవేత్త రావాలనేది తన ఆశయమన్నారు. విద్య అనేది సమస్య కాదని ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలు ప్రోత్సహించాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులు, స్థానిక వనరులను పారిశ్రామికవేత _లు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు కూడా పరిశ్రమలకు సోలార్ రూఫ్‌టాప్‌లపై దృష్టి సారించాలని సూచించారు. కుప్పంలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు నీటి ఇబ ్బంది లేకుండా కృష్ణాజలాలు తీసుకువచ్చామన్నారు.కుప్పం నుంచే బిందుసేద్యాన్ని దేశానికి పరిచయం చేశామని సిఎం గుర్తు చేశారు. కుప్పంలో పాల ఉత్పత్తి పది లక్షల లీటర్లకు చేరేలా చర్యలుచేపట్టామన్నారు. సంజీవని ప్రాజెక్ట్ గేమ్ ఛేంజర్ : కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సంజీవని ప్రాజెక్ట్ దేశానికి గేమ్ ఛేంజర్ లాంటిదని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై సిఎం చంద్రబాబుకు శ్రద్ధ లేదు :పిసిసి అధ్యక్షురాలు షర్మిళ

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబుకు నదుల అనుసంధానంపై ఉన్న శ్రద్ధ. పోలవరం పూర్తి చేయడంపై లేదని పీసీసీ అధ్యక్షురాలు వై.షర్మిళారెడ్డి వాఖ్యానించారు. ఈ మేరకు షర్మిళ పీసీసీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్.. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా చంద్రబాబు ఆశ మాత్రం చావలేదని షర్మిల వ్యాఖ్యానించారు. పనికి రాని ప్రాజెక్ట్ కు డీపీఆర్‌ల మీద , నిధుల సమీకరణ మీద పెట్టే దృష్టిని ఇతర ప్రాజెక్టులపై పెట్టడం లేదన్నారుజ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై పెట్టడం లేదన్నారు. పోలవరంతో పాటు 56 ప్రాజెక్టులు పెండింగ్ లో ఉంటే, వాటిని గాలికొదిలేసి లింక్ ప్రాజెక్ట్ జలయజ్ఞానికి నిధులు లేవు కానీ.. రూ.58 వేల కోట్లతో పోలవరం నల్లమల సాగర్ లింక్ కడతారట అని ఎద్దేవా చేసారు. ఇది భారీ అవినీతికి స్కెచ్ కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. లింక్ ప్రాజెక్ట్ తో ఉపయోగం లేదని నిపుణులు మొత్తుకుంటున్నా.. డీపీఆర్ పేరిట హడావిడి ఎందుకు ? అన్నారు. పోలవరం,పెండింగ్ జలయజ్ఞం ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికున్నది సవతి తల్లి ప్రేమ అన్నారు. ఎత్తు తగ్గించి కేంద్రం అన్యాయం చేసినా నోరు మెదపనిది ఇందుకే. పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 కు కుదించి జీవనాడిలో జీవం తీశారు. రూ.25వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ మిగులు కోసం ప్రాజెక్టుని డ్యామ్ గా మార్చారు. 7 లక్షల ఎకరాలకు, 25 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, 30 లక్షల మందికి మంచి నీరు అందించే పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చి ప్రశ్నార్థకం చేశారన్నారు. బ్యారేజ్ గా తప్ప బహుళార్థక సాధకంగా పనికి రాకుండా చేశారన్నారు.సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందక తీరని ద్రోహం చేశారు.జాతీయ హోదా ప్రాజెక్టుకి కేంద్రం ఇంత అన్యాయం చేస్తుంటే, మిగులు బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రయోజనాలకు సమాధి కడుతున్నారన్నారు. కూటమిలో పెద్దన్న పాత్ర



పోషించే చంద్రబాబు గారు నోరుమెదపకుండా ,. లింక్ పేరుతో హంగామా చేయడం దుర్మార్గం అన్నారు. బాబుకి ఏటీఎం గా పనికొచ్చేందుకే ఈ కొత్త ప్రాజెక్టు అన్నారు.జరాష్ట్రంలో జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్ట్ ల సంఖ్య 56 అన్నారు. ఇవ్వాల్టి అంచనాల ప్రకారం పూర్తి చేయాలంటే కావాల్సి న నిధులు రూ. 60 వేల కోట్లు అవుతుందన్నారు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అందుబాటులోకి వచ్చే సాగునీటి లభ్యత 581 టీఎంసీలు అన్నారు. సాగుబడి జరిగే అదనపు విస్తీర్ణం అక్షరాల 54 లక్షల ఎకరాలు అన్నారు. గోదావరి లింక్ ప్రాజెక్టుకు పెట్టే 80 వేల కోట్ల నిధులతో జలయజ్ఞం పూర్తి చేస్తే అదనంగా 30 లక్షల ఎకరాలకు ప్రయోజనం అన్నారు. ఇంత తెలిసి చంద్రబాబు గారు పెండింగ్ ప్రాజెక్ట్ లపై కన్నెత్తి చూడటం లేదంటే.. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంతుందో అర్థమవుతుందన్నారు.

## న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయం కోసం
## రూ. 46 కోట్లు విడుదల

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు అండగా నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 46 కోట్లను విడుదల చేసింది. ప్రతి కుటుంబానికి రూ. 4 లక్షల చొప్పున ఈ సాయం అందనుంది. ఈ మేరకు అర్హులైన న్యాయవాదుల జాబితాను ఖరారు చేస్తూ ప్రభుత్వం రెండు వేర్వేరు జీవోలను జారీ చేసింది. "ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ మ్యాచింగ్ గ్రాంట్" కింద ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరణించిన న్యాయవాదికి సంబంధించిన నామినీకి ఈ ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిధుల పంపిణీకి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శిని ప్రభుత్వం ఆదేశించింది. న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభా దేవి ఈ ఉత్తర్వులను జారీ చేశారు. వృత్తిలో కొనసాగుతూ దురదృష్టవశాత్తు మరణించిన న్యాయవాదుల ఆదుకోవాలనే లక్ష ్యంతో ప్రభుత్వం నిర్ణయం

# తిరుమల సమాచారం

## కపిలేశ్వర సన్నిధిలో రుద్రహోమం

**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ప్రముఖ శైవాలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా శనివారం రుద్రహోమం ఆరంభమైంది. గతనెల నుండి పలు హోమాలు చేపడుతున్నారు. శనివారం రుద్రహోమంలోభక్తులు పాల్గొన్నారు. 500 రూపాయలు చెల్లించి గృహస్థ భక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు.



ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## కల్యాణకట్ట, లడ్డూకౌంటర్‌ల వద్ద హెల్ప్‌డెస్కులు

**- పరిశుభ్రత విషయంలో రాజీలేదు : అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు, సమాచారం కోసం కల్యాణకట్ట,లడ్డూవితరణకౌంటర్‌ల వద్ద హెల్ప్‌డెస్కులు ప్రారంభిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. లడ్డూకౌంటర్‌ల వద్ద, వైకుంఠం కంపార్టుమెంట్లలో పరిశుభ్రత విషయంలో రాజీలేదన్నారు. గోపార్క్‌టెక్నాలజీ ప్రైవేట్ లిమిటడ్ సంస్థ తిరుమలలో పార్కింగ్ సమస్య, స్మార్ట్‌ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ప్రీబుకింగ్ వంటివాటి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తెలిపారు. అన్నప్రసాదం, క్యూలైన్లనిర్వహణ, లడ్డూకౌంటర్ విభాగాలపై భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించే సమయంలో చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. శనివారం తిరుమలలో జరిగిన సమావేశంలో సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్(ఆర్1),సోమన్నారాయణ(ఆరోగ్యం), రాజేంద్ర(అన్నదానం), ,క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## పరకామణి చోరీ కేసులో కీలక నిందితుడు సివి రవికుమార్, అతని కుటుంబసభ్యులను విచారించిన సిఐడి అధికారులు



**తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023లో జరిగిన అమెరికన్ డాలర్లు చోరీ కేసులో సిఐడి అధికారులు దర్యాప్తుపురోగతి సాధిస్తున్నారు. ఈ కేసులో కీలకనిందితుడు సివి రవికుమార్‌ను, అతని కుటుంబసభ్యులను శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో అత్యంత భద్రతనడుమ విచారణ చేశారు. సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పి,న్యాయసలహాఅధికారి అడిగిన చోరీకి సంబంధించిన ప్రశ్నలకు రవికుమార్ సమాధానాలు దాటవేశారని తెలుస్తోంది. పరకామణితోబాటు పెద్దజీయర్‌మఠంలో ఉద్యోగిగా 45వేల రూపాయలు జీతం తీసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న నీకు 14కోట్ల రూపాయలకుపైగా విలువైన ఆస్తులు ఎలా సంపాదించావు ?ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు స్టాంప్‌డ్యూటీ ఫీజుకు 42లక్షలు రూపాయలు ఎక్కడ నుండి ఎవరి నుండి తీసుకున్నావు అనే ప్రశ్నలు సంధించారు.అయితే వీటన్నిటికీ అతని నుండి సమాధానాలు పొంతనలేకుండా వినిపించాడని సమాచారం. కాగా ఇదే కేసులో 2023లో తిరుమలలో పనిచేసిన గత సిఐ జగన్మోహన్‌రెడ్డిని, సిఐ చంద్రశేఖర్‌ను, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను పోలీసు అధికారులు విఆర్‌కు పంపడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ కేసులో వీరిని త్వరలోనే విచారణ చేపట్టే సూచనలు ఉన్నాయి. ఇంకా శనివారం పరకామణి డిప్యూటీ ఇఒ , కొందరు సిబ్బందిని సిఐడి విచారణ చేపట్టి అవసరమైన సమాచారం రాబట్టింది.

## జగన్ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

**శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ**

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పెంచి పోషిస్తున్న పేటీఎం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ హెచ్చరించారు. తల్లి, చెల్లిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననం చేయించిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. కల్తీమద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి ఎందరో తల్లులకు గుండెకోత మిగిల్చారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించి వారిని జైలుకు పంపుతూ.. తల్లిదండ్రులకు ఆవేదన మిగుల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పిల్లలతో జగన్ చేయిస్తున్న వికృత చేష్టల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అనురాధ సూచించారు. భాస్కర్ రెడ్డి లాంటి చెంచాలను జగన్ ఎందరిని ప్రయోగించినా.. వారంతా కటకటాల వెనక్కి వెళ్లక తప్పదని తెలిపారు. పనికిమాలిన పేటీఎం బ్యాచ్‌తో ఇంకెంత కాలం విషప్రచారం సాగిస్తారు అని ప్రశ్నించారు. తలా తోక లేకుండా అర్థం లేని వ్యాఖ్యలతో మహిళల్ని కించపరిచే మీరు అసలు మనుషులేనా అని నిలదీశారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదా అని ఆక్షేపించారు.

# ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం వైపు ఆకర్షణ పెరుగుతోంది

**- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు**



**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రపంచవ్యాప్తంగా సోషలిజం పట్ల ఆకర్షణ పెరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. తొలి సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఎన్‌టిఆర్ జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యాన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు జరిగింది. అనంతరం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'సోషలిజం ఔన్నత్యం సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు జరిగిన సభలో బి.వి రాఘవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు జోహ్రాన్ మమ్దాని సాధించిన ఘన విజయాన్ని ప్రస్తావించారు. ప్రపంచ వ్యాప్త పెత్తనం కోసం, సామ్రాజ్యవాద విధానాల అమలుకోసం ఒత్తిడి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో న్యూయార్క్ ప్రజానీకం సోషలిస్టు మమ్దాని వైపు నిలిచారని చెప్పారు. ఇదొక్కటే కాదని, ఇటీవల అమెరికాలో యువతపై నిర్వహించిన ఒక సర్వేలో 60 శాతం మంది సోషలిజం కావాలని కోరుకుంటున్నారని తేలిందని చెప్పారు. రాజరికపాలన సాగిస్తున్న ట్రంప్ విధానాలపై అమెరికాలోని 200 పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయని తెలిపారు. పపంచ సంపదను దోచుకుని అమెరికాలో పెట్టడం తప్ప అక్కడ ప్రజలకు పెట్టుబడిదారీ విధానం చేస్తున్నదేమీ లేదని అర్థం అయిందన్నారు. దీంతో అక్కడి యువతలో సోషలిజం వైపు మొగ్గు పెరుగుతోందని తేలిందన్నారు. గత 40 రోజుల నుండి అమెరికాలో పాలన నిలిచిపోయిందని, వేతనాలు చెల్లించకపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. అమెరికాలో ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ట్రంప్ ఓడిపోతున్నారని, రాజరికం వద్దనే ప్రదర్శనలు అందులో భాగమేనని తెలిపారు. రష్యాలో సోషలిజం పాలన కూలిపోయిన తరువాత పెట్టుబడిదారీ విధానాన్ని భరించాల్సిం దేనని ప్రజలు భావించారని అన్నారు. ఇప్పుడు వారే సోషలిజం వైపు మళ్లుతున్నారని అన్నారు. ప్రపంచంలో వ్యాపారం 40 శాతం తగ్గిందని, పెట్టుబడిదారీ విధానం క్షీ ణిస్తోందని చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణని అన్నారు. ఆ విధానం ప్రజలకు ఉపాధి కల్పించ లేకపోతోందని చెప్పారు. కష్టాల పాల్జేస్తున్న పెట్టుబడిదారీ విధానాన్ని తొల గించుకోవాలనే నిర్ణయానికి ప్రజానీకం వస్తోందని, ఈ పరిణామాలన్ని సోషలిజానిదే భవిష్యత్తు అని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. డాలర్ విలువ తగ్గుతోందని, అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత

## అక్షరాలు పొందికగా రాయటం నేర్పిస్తున్న టీచర్ ఫిరోజ్‌బాషాకు అభినందన: మంత్రి లోకేష్

**అమరావతి, నవంబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** పిల్లల తలరాత మార్చే విద్యను అందిస్తూ, అందమైన అక్షరాలు పొందికగా రాయడం నేర్పిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్న పిడుగురాళ్ల మండలం, తుమ్మలచెరువు మెయిన్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న షేక్ ఫిరోజ్ భాషాకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా...అంటూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మేరకు శుక్రవారం సాయంత్రం ప్రకటన చేశారు. ప్రతి రోజూ ఉదయం ముందుగా స్కూలుకు వెళ్లి, సాయంత్రం అదనపు సమయం స్కూలులోనే ఉంటూ విద్యార్థులకు క్లాసులు తీసుకునే మీ కమిట్మెంట్‌కు హ్యాట్సాఫ్ అని పేర్కొన్నారు.. మీరు పిల్లలకు నేర్పిన తెలుగు, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ డిజిటల్ ప్రింటింగ్‌లా అందంగా ఉంది. పిల్లలకు వివిధ సబ్జెక్టుల్లో ఉన్న భయాలను పోగొట్టేందుకు, వారిలో ఒకరిగా కలిసిపోతూ ఆటపాటలతో విద్యా బోధన చేస్తున్న షేక్ ఫిరోజ్ భాషా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు.




తరగతి గదిలో ఉపాధ్యాయుడు షేక్ ఫిరోజ్‌బాషా

స్కూల్లో ప్రస్తుతం 200 మంది పిల్లలు చదువుతుండడం గొప్ప విషయం అని, ఇదే ప్రభుత్వ పాఠశాలల్లో నేను కోరుకుంటున్న మార్పు అని పేర్కొన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు తన శక్తి మేర కృషి చేస్తున్న షేక్ ఫిరోజ్ బాషాకు, సహకరిస్తున్న తోటి టీచర్లు, సిబ్బందికి ధన్యవాదాలు అంటూ మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వారిపై సత్వరం చర్యలు తీసుకోవాలి

**- 17న ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**

**చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన వారిపై సత్వరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసనతో పాటు ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ అన్నారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో శనివారం ఎంఆర్‌పిఎస్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగి నెల రోజులు కావస్తున్న ఇప్పటి వరకు పోలీసు శాఖ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దాడికి గురైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడు కావడంతోనే ఇతర శాఖలు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే రౌడీషీటర్లు ఎన్‌కౌంటర్లకు గురైతే స్పందించి సుమోటోగా కేసులు తీసుకునే మానవ హక్కుల కమీషన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని సుమోటోగా తీసుకోకపోవడం దళితులకు జరుగుతున్న అ న్యా య ా ల క ు నిదర్శ నంగా నిలుస్తోం దన్నారు. ఇటు పోలీసులతో పాటు న్యాయ విభా గాలు ఈ విషయంను పట్టించుకోకపోవడం దారుణం అన్నారు.



సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించి అనంతరం సొంత రాష్ట్రానికి వెళ్ళిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి అక్కడ సైతం ఆయనకు అధికారులు సరైన గౌరవం ఇవ్వలేదన్నారు. ఈ విషయాలపై దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించడానికి ఈ నెల 17వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వ హిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా వున్న మాదిగ సోదరులు ఛలో ఢిల్లీ కార్యక్రమంకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కుటుంబ కలహాలతో భార్యపై హత్యాయత్నం

**- భర్త ఆత్మహత్య, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబరు 8 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో దంపతుల మధ్య తలెత్తిన కుటుంబ కలహాల కారణంగా ఏర్పడ్డ వివాదం చివరకు భార్యపై హత్యాయత్నం చేసి ఆపై భర్త ఆత్మహత్య చేసుకోవడంతో హృదయ విధరకంగా సంఘటనగా మారింది . దీంతో వారిద్దరికీ చెందిన కుమారుడు, కుమార్తె అనాధలుగా మిగిలారు. ఒకపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీలో చోటు చేసుకోగా.. మరోపక్క కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పోలీసు సర్కిల్ కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. భార్య డ్రైవర్స్ కాలనీలో హత్యాయత్నానికి గురికాగా.. భర్త తాళ్లరేవు మండలం పటవల గ్రామ శివారులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు, కోరంగి ఎస్సై పి సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం ఈ ఘటనలో భార్య చీపురుపల్లి దేవి తీవ్ర గాయాల పాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆమె భర్త చీపురుపల్లి రాజేష్ (38) ఆత్మహత్యకు పాల్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కోరంగి ఎస్సై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. బార్బర్ వృత్తి చేసుకుంటున్న రాజేష్ భార్యాపిల్లలతో కర్ణాటకలో ఉంటున్నాడు. అయితే ఇటీవల దీపావళి సందర్భంగా రాజేష్ స్వగ్రామమైన కాజులూరు మండలం శీల గ్రామానికి వచ్చారు. రాజేష్ భార్య దేవి కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీకి వాళ్ల పుట్టింటికి వెళ్ళగా శుక్రవారం సాయంత్రం వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు ఎక్కువ అవ్వడంతో న్యాయవాది ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించి అనంతరం చాకుతో భార్య దేవిని భర్త రాజేష్ తీవ్రంగా గాయపరిచి వారి ఇద్దరి పిల్లలను తీసుకుని రాజేష్ స్వగ్రామమైన శీల వెళుతూ.. పటవల గ్రామపంచాయతీ పరిధిలోని మంజేరు రోడ్డు సమీపంలో తనతో పాటు తెచ్చుకున్న పాయిజన్ తీసుకుని, భార్యపై దాడి చేసిన కత్తితో అతను పీక కోసుకుని పిల్లలను అక్కడే వదిలేసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం కోరంగి ఎస్ఐ పి సత్యనారాయణకు సమాచారం రాగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. దీనిపై కోరంగ ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామపంచాయతీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ వద్ద హత్యాయత్నానికి గురైన దేవి తీవ్ర గాయాల పాలవడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నది.

# కొబ్బరిపాలతో వంటలు


కొబ్బరి కమ్మదనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేం ఉంది?! కూర, రసం, చారుల్లో కొన్ని పాలు చేర్చామంటే వాటి రుచి రెట్టింపైపోతుంది. అంతేనా.. వీటితో కొబ్బరన్నం, పాయసం, బిస్కెట్లు ఇలా ఎన్నెన్నో వంటలు చేయొచ్చు. మహత్తరమైన మరి కొన్ని కొబ్బరిపాల రెసిపీలు మీ కోసం..

## కేక్



**కావలసినవి..** పంచదార అర కప్పు, మిల్క్ పౌడర్ అర కప్పు, నెయ్యి 3 టేబుల్‌స్పూన్లు, తాజా కొబ్బరి తురుము కప్పు, పిస్తా పలుకులు 2 చెంచాలు, కొబ్బరి పాలు అర కప్పు **తయారీ..** ప్యాన్‌లో పంచదార, అర కప్పు నీళ్లు పోసి మరిగించాలి. నాలుగు నిమిషాల తర్వాత మిల్క్ పౌడర్, కొబ్బరి పాలు జతచేసి కలుపుతూ.. ఇంకో మూడు నిమిషాలు చేయాలి. చిక్కగా అయ్యాక నెయ్యి, కొబ్బరి తురుము వేసి కలపాలి. మరో నాలుగు నిమిషాల తర్వాత సెగ తీయాలి. ఈ మిశ్రమాన్ని బటర్ పేపర్ పరిచి, నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా సర్దాలి. పైన పిస్తా పలుకులు, కాస్త కొబ్బరి తురుము చల్లి.. ఓ గంట ఫ్రీజర్లో ఉంచాలి. బయటకు తీసి ముక్కలుగా కోసుకుంటే సరిపోతుంది..

## పాస్తా...



**కావలసినవి....** టొమాటో గుజ్జు కప్పు, తుంచిన బ్రోకలీ పూలు అర కప్పు, వెల్లుల్లి రెబ్బలు కొబ్బరిపాలు అర లీటర్, ఉప్పు రుచికి తగినంత, మిరియాల పొడి అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు అర కప్పు, పాస్తా 400 గ్రాములు, చిల్లీ ఫ్లేక్స్ చెంచా, ఆలివ్ నూనె 2 టేబుల్ స్పూన్లు, చీజ్ తరుగు 2 చెంచాలు, పుదీనా ఆకులు ఏడెనిమిది **తయారీ...** వెల్లుల్లిని సన్నగా తరగాలి. పాస్తాను తెర్లుతున్న నీళ్లలో వేసి ఉడికించి, ఆ నీళ్లు వడకట్టి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఉల్లిపాయ ముక్కలను కాస్త వేయించి.. సగం వెల్లుల్లి తరుగు వేయాలి. అందులో టొమాటో గుజ్జు, బ్రోకలీ, చిల్లీ ఫ్లేక్స్ జోడించి మీడియం సెగ మీద కలియతిప్పుతుండాలి. రెండు నిమిషాల తర్వాత ఉప్పు, మిరియాల పొడి జతచేయాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ పన్నెండు నిమిషాలు ఉడికించి దించాలి. చల్లారాక గ్రైండ్ చేసి... మళ్లీ ప్యాన్‌లో వేసి, రెండు కప్పుల నీళ్లు, కొబ్బరిపాలు, పాస్తా వేసి దగ్గరగా ఉండే వరకు ఉడికించాలి. చివర్లో మిగిలిన వెల్లుల్లి తరుగు వేసి కలియబెట్టి సెగ తీయాలి. పుదీనా, చీజ్ చల్లి.. వేడివేడిగా ఆస్వాదించండి.

## ఐస్‌క్రీమ్



కావలసినవి: తాజా క్రీమ్ కప్పు, మొక్కజొన్న పిండి 4 టేబుల్ స్పూన్లు, కొబ్బరిపాలు 1 కప్పులు, కొబ్బరి తురుము, పంచదార కప్పు చొప్పు తయారీ.. కొబ్బరితురుములో కొబ్బరిపాలు అర కప్పు, మొక్కజొన్న పిండి వేసి పక్కనుంచాలి. ప్యాన్‌లో మిగిలిన కొబ్బరిపాలను వేడిచేయాలి. అందులో పంచదార జోడించి మధ్యమధ్యలో కలియతిప్పుతుండాలి. నాలుగైదు నిమిషాల తర్వాత మొక్కజొన్న పిండి కలిపిన కొబ్బరిపాలు జతచేసి కలియబెడుతూ చిక్కగా అయ్యాక సెగ తీయాలి. చల్లారాక మరో పాత్రలోకి తీసి అల్యూమినియం ఫాయిల్‌తో కప్పేసి ఆరేడు గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. బయటకు తీసి మెత్తగా అయ్యేవరకూ గ్రైండ్ చేసి మళ్లీ ఇందాకటి పాత్రలో వేసి.. అల్యూమినియం ఫాయిల్ చుట్టి.. నాలుగైదు గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. అంతే నోరూరించే కొబ్బరి ఐస్క్రీమ్ తయారైపోతుంది.

## బర్ఫీ..



**కావలసినవి ...** ఫుల్ క్రీమ్ పాలు, కొబ్బరిపాలు 2 కప్పుల చొప్పున, పంచదార అర కప్పు, యాలకుల పొడి పావు చెంచా, నెయ్యి 2 చెంచాలు, పిస్తా, బాదం పలుకులు గుప్పెడు, కుంకుమ పువ్వు కొద్దిగా **తయారీ..** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పాలు, కొబ్బరిపాలను వేడిచేయాలి. మీడియం సెగ మీదుంది.. నిమిషానికోసారి కలియతిప్పుతుండాలి. నాలుగు నిమిషాల తర్వాత పంచదార, పిస్తా పలుకులు, కుంకుమ పువ్వు, బాదం పలుకులు జోడించి. ఇక కలుపుతూనే ఉండాలి. కొంచెం చిక్కబడ్డాక.. యాలకుల పొడి వేసి మరింత గట్టిపడే వరకూ ఉంచి సెగ తీసేయాలి. చల్లారాక ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా సర్దాలి. నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కోసుకుంటే.. తియ్యటి బర్ఫీ తిని ఆనందించవచ్చు. □

# ఆమె పరిశోధనకు కోట్ల బహుమానం




**కోరుకున్న చదువు, మంచి ఉద్యోగం! కానీ విధుల్లో భాగంగా ఆమెకు ఎదురైన సంఘటన ఆమె ఆలోచనలో పడేసింది. దాంతో పరిశోధనకు వెళ్లారు. ఏళ్ల తరబడి దానికి అంకితమయ్యారు. తాజాగా ఆ కృషికిగానూ ప్రతిష్టాత్మక 'మ్యాక్ ఆర్థర్' ఫెలోషిప్ అందుకున్నారు... థెరెసా పుతుస్సెరి!**

చదువు పూర్తయ్యాక ఓ ఆసుపత్రిలో ఆప్టోమెట్రిస్ట్‌గా చేరారు థెరెసా. తన వద్దకు ఓ 20 ఏళ్లబ్బాయి చూపు తగ్గుతోందంటూ వచ్చాడు. అతనికి 'రెటినైటిస్ పిగ్మెంటోసా' అని తేలక ఆలోచనలో పడ్డారామె. ఇంత చిన్న వయసులో చూపుకోల్పోతే అతని భవిష్యత్తేంటి అనుకున్నా... దీనికి పరిష్కారం కనుక్కోవాలి అనుకున్నారు. పరిశోధనల వైపు వెళ్లారు. భారతీయ సంతతికి చెందిన ఈమె చిన్నప్పుడే ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. ఇంట్లో తండ్రికి చిన్న బయాలజీ ల్యాబ్ ఉండేది. స్కూలు నుంచి రాగానే నాన్నతోపాటు దానిలోకి వెళ్లడం, జీవశాస్త్ర అంశాలను అధ్యయనం చేయడం ఆమెకు ఇష్టమైన వ్యాపకం. దానివల్లే ఆరోగ్య రంగాన్ని ఎంచుకున్నారు థెరెసా. మానవ మెదడు, ఇంద్రియ వ్యవస్థలపై ఆసక్తితో 'ఆక్యులర్ థెరప్యూటిక్స్'లో పీజీ చేసి, ఆప్టోమెట్రిస్ట్‌గా మారారు.

రిసెర్చ్ వైపు వెళ్లాలనుకున్నాక ఉద్యోగాన్ని వదిలి, న్యూరోసైన్స్‌లో పిహెచ్ చేశారు. ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ పూర్తిచేసి... ప్రస్తుతం ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్స్లో అసోసియేట్ ప్రొఫెసర్గా చేస్తున్నారు. దానితోపాటే కంటి సమస్యలు, దృష్టి లోపానికి గల కారణాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మెరుగైన కంటి చూపు రెటీనాపైనే ఆధారపడి ఉంటుంది. కానీ, రెటినైటిస్ పిగ్మెంటోసా, వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే కంటి సమస్యలు రెటీనాపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా దృష్టిలోపల బారిన పడుతున్నారు. అయితే వీటికి సరైన చికిత్స లేదు. ఈ అంతరాన్ని తొలగించాలన్నదే నా ప్రయత్నం అంటారీమె. ఇదే కాదు, ఇతర పరిశోధకులతో కలిసి 'మూన్‌షాట్' అనే ప్రాజెక్ట్ చేస్తున్నారు థెరెసా. తన పరిశోధనలకు గుర్తింపుగా మ్యాక్ ఆర్థర్ జీనియస్ గ్రాంట్‌కి ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో విశేష పరిశోధనలు చేసినవారికి 'మ్యాక్ ఆర్థర్ ఫౌండేషన్' ఈ ఫెలోషిప్ అందిస్తుంది. ఈ ఏడాదికిగానూ 22 మందిని ఎంపిక చేయాలి... భారత సంతతికి చెందినవారు థెరెసా ఒకరే. దీనికి దాదాపు రూ.7 కోట్లు అందుకోనున్నారామె. ఈ ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌కి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఈ నగదు కంటి సమస్యలపై అధ్యయనానికే వినియోగిస్తా. బాధితులు తిరిగి కంటిచూపు పొందేలా కొత్త చికిత్సలు అందజేయడమే నా లక్ష్యం అంటోన్న ఈమెను అభినందించాల్సిందే! □

# ప్రార్థిస్తే..ఫలితం తప్పనిసరి




'అంతట ఏలీ–నీవు క్షేమముగా వెళ్లుము, ఇశ్రాయేలు దేవునితో నీవు చేసికొనిన మనవిని ఆయన దయచేయును గాక అని ఆమె(హన్నా)తో చెప్పగా..'(1 సమూయేలు 1:17). ఏలీ దేవుడి మందిరంలో ఉండే యాజకుడు. హన్నా పిల్లలు లేక బాధపడుతున్న స్త్రీ. షిలోహులో ఉన్న దేవుడి వద్దకు వచ్చి, తనకు సంతానం ఇవ్వాలని ప్రార్థన చేసుకున్నది. అదే విషయం ఆమె ఏలీకి చెప్పింది. తాను దేవుడికి మొఱపెట్టుకుంటున్నట్లుగా చెప్పడంతో ఏలీ పైవిధంగా సమాధానం ఇచ్చాడు. అన్నట్లుగానే దేవుడు ఆమె ప్రార్థన విని, సంతానాన్ని ఇచ్చాడు. నిజమే కదా! మనం కూడా దేనిగురించి అయినా ప్రార్థన చేస్తే, దేవుడు తప్పనిసరిగా సమాధానం ఇస్తాడు. హన్నా కూడా మనలాంటి సామాన్యమైన గృహిణే. సంతానం కోసం ప్రార్థిస్తే ఆ ఫలాన్ని పొందింది. మనం కూడా నిజమైన విశ్వాసంతో ప్రార్థన చేస్తే, దేవుడు తప్పనిసరిగా జవాబు ఇస్తాడు. అయితే ప్రార్థనలో మనకు పట్టుదల ఉండాలి. ఇలాంటి విశ్వాసం, పట్టుదలతో దేవుడిని వేడుకుందాం..

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# ఒత్తిడిని తగ్గించే జాబితా



ఆర్గనైజ్డ్ ఉండాలని కోరుకొని మహిళలు ఉంటారా! రేపేం చేయాలో ముందు రోజు రాత్రే ఆలోచిస్తారు. కొందరికైతే వారానికి సరిపడా ప్రణాళిక ఉంటుంది. ఉద్యోగినులకైతే లక్ష్యాలు, డెడ్‌లైన్ల పేరుతో నెల మొత్తానికి చేయాల్సిన పనులు సిద్ధంగా ఉంటాయి. వీట నిలబడి 'టు డు లిస్ట్' అని రాసుకుంటారు చాలామంది మహిళలు. ప్రణాళిక ఉంది కాబట్టి, పని సులువవుతుంది. అనుకుంటారు. కానీ క్షేత్రస్థాయిలో ఇది ఇచ్చే ఒత్తిడి చాలా ఎక్కువంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈరోజు చేయాల్సిన పనులివి అంటూ లిస్ట్ రాసుకున్నాక అవి పూర్తయ్యేదాకా నిద్రపోరు. విశ్రాంతి తీసుకోరు. సమయం లేదు. పూర్తిచేయాల్సిన పనులు ఇంకా చాలానే ఉన్నాయి అంటూ తిండి తినరు. రాసుకున్న పనుల్లో ఏ కొన్ని మిగిలిపోయినా వాటి గురించే ఆలోచిస్తూ నిద్రకూ దూరమవుతారు. వీటన్నింటి ఫలితమే ఉత్పాదకత తగ్గిపోవడం, మానసిక సమస్యలు. రోజువారీ పనులను జాబితాలా రాసుకొని... ప్రణాళికాబద్ధంగా ఉండటం మంచి విషయమే కానీ... అది ఆందోళనా, ఒత్తిడికి కారణమవుతుంటే దాన్ని విస్మరించడమే మేలు చెప్పారు. మానసిక నిపుణులు. బదులుగా'పూర్తయిన పనుల జాబితా' అని కూడా అంటారు. రోజుని ఖాళీ కాగితంతో ప్రారంభించండి... పూర్తి చేసిన పనులను ఒక్కొక్కటిగా అందులో చేర్చమంటున్నారు. దీనివల్ల అసంపూర్తి అన్న అంశమే ఉండదు. పైగా ఇవి విజయాలుగా కనిపించి సానుకూల దృక్పథాన్ని పెంచుతాయట. □

# కాటన్ కొత్తగా ఉండాలంటే..



నచ్చిందని కనిపించిన డ్రెస్ నల్లా కొనేవాళ్లు చాలామందే. కానీ, వాటిని ఏళ్లు గడుస్తున్నా "త్తవాటిల్లా మన్నికగా ఉంచేవాళ్లు మాత్రం కొద్దిమందే. ముఖ్యంగా హుందాతనాన్నీ, ఒంటికి సౌకర్యాన్ని తెచ్చిపెట్టే విషయంలో ఇంకాస్త ఎక్కువగా శ్రద్ధ పెట్టాలి.

✦ నూలు దుస్తులు ఎక్కువ రోజులు మన్నికగా ఉండాలంటే... ప్రతిసారీ డ్రైవాష్ ఇస్తే స్తే చాలనుకుంటారు చాలామంది. అలా అయితే, ఈ విధానంలో వాడే రసాయనాలు కాటన్‌లోని సహజ తేమను తొలగిస్తాయి. దీంతో అవి త్వరగా చినిగిపోయే అవకాశం ఉంటుంది.

✦ వీటిని ఎప్పుడూ వేడి నీటిలో నానబెట్టకూడదు. గోరువెచ్చని లేదా చల్లటి నీళ్లల్లో మాత్రమే ఉతకాలి. అప్పుడే కుంచించుకుపోకుండా, వెలిసిపోకుండా ఉంటుంది. ✦ చాలా వరకు వీటిని గాఢత తక్కువగా ఉండే డిటర్జెంట్‌లో పదిహేను నిమిషాలు నానబెట్టి సున్నితంగా ఉతకండి. అయితే, ఇలాంటప్పుడు రంగులు, ఇతర రకాల దుస్తులను కలపొద్దు. 3.కాటన్ దుస్తులు లేకుండా ముఖ్యంగా చీరలు ముడతలు ఆరేయడం మంచిది. తీగల మీద కాకుండా నేలమీద ఆరేస్తేనే మేలు. ఐరన్ చేసేటప్పుడు కాసిని నీళ్ల చల్లుతూ చేయాలి. ప్యాడెడ్ హ్యాంగర్లు వాడితే ముడతలు రాకుండా ఉంటాయి.

✦ గంజి పెట్టడం ఓ కళ. కాటన్ దుస్తులకు ఇది ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుంది. లీటర్ నీటికి కప్పు గంజి కలిపి పదినిమిషాలైనా నాకుంటుంది. సువాసన కోసం ఆ నీటిలో ఓ చుక్క ఎసెన్షియల్ ఆయిల్ కలిపితే చీరలు సువాసనలు వెదజల్లుతాయి. అప్పుడే రంగు కోల్పోకుండానూ ఉంటాయి. ఐరన్ చేసినా చక్కగా నిలబడతాయి. □

తెర

# నవ్వుల విందు సినిమా



సెన్సేషనల్ మత్తువదలరా కాంబినేషన్ మరోసారి అలరించబోతోంది. కల్ట్ హిట్ అయిన మత్తు వదలరాతో తో దర్శకుడిగా పరిచయమై, ఆ తర్వాత మరో బ్లాక్‌బస్టర్ సీక్వెల్ మత్తువదలరా 2 విజయాన్ని అందుకున్న రితేష్ రానా తన నాల్గవ డైరెక్షనల్ మూవీని ప్రకటించారు. యూనిక్ స్టయిల్ నరేషన్ తో ఆకట్టుకునే రితేష్ రానా మరోసారి సత్యతో జతకడుతున్నారు. ఇది ప్రేక్షకులకు మరో నవ్వుల విందును అందిస్తుంది. ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 4గా చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మత్తు వదలరా ఫ్రాంచైజీలో భాగమైన వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అఫీషియల్‌గా చిత్రాన్ని ప్రకటిస్తూ, మేకర్స్ ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్.

# 'సంతాన ప్రాప్తిరస్తు'14న రిలీజ్



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు దర్శకుడు సంజీవ్ రెడ్డి.

మా మూవీని కొంతమంది ప్రొడ్యూసర్స్ ప్రివ్యూ చూశారు, బాగుందని చెప్పారు. మేల్ ఫెర్టిలిటీ ఇష్యూను మా కథలో చూపించడం వల్ల వాళ్లు ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఆ విషయం మాతో చెప్పారు. అలాగే యూఎస్ కు ప్రింట్స్ పంపినప్పుడు అక్కడ ప్రింట్స్ కోసం వర్క్ చేసే ఆపరేటర్స్ మూవీ చూసి బాగుంది, మా ఫ్యామిలీతో వెళ్లి చూస్తామని జెన్యూన్ గా చెప్పడం హ్యాపీగా అనిపించింది. మా సినిమా ద్వారా ఒక సమస్యపై అవగాహన కల్పిస్తున్నాం, ఒక చిన్న మెసేజ్ కూడా ఉంటుం "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాలో లవ్ స్టోరీ ఉంటుంది, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి, ఎంటర్ టైన్ మెంట్ ఆకట్టుకుంటుంది. ఈ ఎలిమెంట్స్ అన్నీ ఉన్న కథలో చిన్న ఇష్యూను కూడా చూపిస్తున్నాం. ఈ కథలో హీరోయిన్ గా తెలుగమ్మాయి అయితేనే బాగుంటుందని చాందినీ చౌదరిని తీసుకున్నాం. మ్యారీడ్ వుమెన్ గా నటించడానికి ఆమె ఏమాత్రం సందేహించలేదు. మా సినిమాను ఇప్పటిదాకా చూసిన వాళ్లంతా అప్రిషియేట్ చేశారు. ఆ మార్పు తెచ్చేందుకు మొదటి అడుగు మా సినిమా అవుతుందని ఆశిస్తున్నాం.

# కుంభ ఫస్ట్ లుక్ విడుదల



ఎస్.ఎస్.రాజమౌళి, మహేష్ బాబు సినిమా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్‌కి ముందు పర్ఫెక్ట్ గిఫ్ట్‌బాహుబలి ఫ్రాంచైజీ, ట్రిపుల్ ఆర్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న సినిమా గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ అత్యంత ఘనంగా జరగనుంది. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో నాయికగా నటిస్తున్నారు. భారతదేశం గర్వించదగ్గ సినిమాగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు రాజమౌళి.. ఏమాత్రం దయాదాక్షిణ్యం లేని, కరడుగట్టిన, కమాండింగ్ ప్రతి నాయకుడి పాత్రలో కుంభగా కనిపి స్తున్నారు పృథ్వీ రాజ్ సుకుమారన్. హైటెక్ వీల్ చెయిర్ లో న్యూ ఏజ్ విలన్ గా ఫస్ట్ లుక్‌లోనే మెప్పిం చేశారు పృథ్వీరాజ్ సుకుమారన్. రాజమౌళి, మహేష్ బాబు మోస్ట్ యాంబిషి యస్ వరల్డ్ బిల్డింగ్ వెంచర్ గ్లోబ్ ట్రాటర్. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులు అత్యంత ఆసక్తితో ఎదురు చూసిన వెంచర్ ఇది. నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే ఈవెంట్ మీద అంచనాలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. రాజమౌళి తన పోస్టులో..

# 'బా బా బ్లాక్ షీప్' శరవేగంగా ..



ప్రముఖ నిర్మాత వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ తెరకెక్కిస్తున్న ట్రెండీ క్రైమ్ కామెడీ సినిమా 'బా బా బ్లాక్ షీప్'. ప్రస్తుతం మేఘాలయలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. టిన్ను ఆనంద్, ఉపేంద్ర లిమయే, జార్జ్ మరియన్, రాజా రవీంద్ర, అక్షయ్ లఘుసాని, విష్ణు ఓ అయ్, కార్తికేయ దేవ్, కశ్యప్, విస్మయ, మాల్వి మల్హోత్రా, సమృద్ధి ఆర్యల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.మేఘాలయలో సంపూర్ణంగా షూటింగ్ జరుపుకుంటున్న తొలి సినిమా ' బా బా బ్లాక్ షీప్' కావడం గమనార్హం. వేణు దోనేపూడి మాట్లాడుతూ"మా బా బా బ్లాక్‌షీప్ మేఘాలయాలో పూర్తి స్థాయిలో షూటింగ్ చేసుకుంటున్న తొలి చిత్రం. కథ మొత్తం నార్త్ ఈస్ట్ ఇండియాలో సాగుతుంది కాబట్టి, ఇక్కడే చిత్రీకరిస్తున్నాం. కథలోనే ఓ బ్యూటీ ఉంటుంది. జలపాతాలు, కొండలు, అందమైన ప్రదేశాల్లో సాగే కథ ఇది. ఎన్నో చోట్ల రెక్కీ చేసి, మా కథకు మేఘాలయా పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని ఇక్కడ ఫిక్స్ అయ్యాం అని అన్నారు.

# 'సైక్ సిద్ధార్థ' కొత్తగా ఉంది




నందు, వరుణ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి, స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ 'సైక్ సిద్ధార్థ' మ్యాడ్లీ హ్యూమరస్ టీజర్ రిలీజ్, డిసెంబర్ 12న ఆసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్ ద్వారా గ్రాండ్ రిలీజ్ యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు వరుణ్ రెడ్డి ఒక యువతను దృష్టిలో ఉంచుకుని కథను రూపొందించాడు, శ్రీ నందు పాత్రను హై ఎనర్జీతో ఎంటర్టైనింగ్ చేశారు. ఈ టీజర్ హ్యూజ్ బజ్‌ను సృష్టిస్తుంది, డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా విడుదల కానుంది. మార్కెటింగ్‌ను రానా స్పిరిట్ మీడియా నిర్వహిస్తుంది.టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో శ్రీ నందు మాట్లాడుతూ.. ఈ సినిమా, ఈవెంట్ మాకు చాలా స్పెషల్. ఈ సినిమా మీ అందరికీ నచ్చి మా టీమ్ అందరు జీవితంలో వెలుగు నిండాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ .. అందరికీ హాయ్. చాలా కొత్తగా అనిపించే సినిమా ఇది. సురేష్ బాబు గారు రానా గారు చాలా సపోర్ట్ చేశారు. ఈ టైటిల్ కథకి పర్ఫెక్ట్ యాప్ట్. ఈ సినిమా ఎలా ఉండబోతుందో ప్రమోషన్స్ లో చాలా క్లియర్‌గా చెప్పబోతున్నాము. యామిని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది మాకు చాలా స్పెషల్ ఫిలిం. మా టీమ్ అందరు చాలా నమ్మకంతో చేశాం.

# పాన్ ఇండియా ఫిల్మ్ 'నాగబంధం'



యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వం దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న పాన్‌ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నాగబంధంతో అలరించబోతున్నారు. విరాట్ తన పాత్ర కోసం ఎంతో డెడికేషన్‌తో అద్భుతంగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. నాగబంధం ఆధ్యాత్మికత, యాక్షన్, విజువల్ స్ప్లెండర్ మిళితమైన ఓ మ్యాసీవ్ సినిమాటిక్ జర్నీ. అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం భక్తి, యాక్షన్, మిస్టరీని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది..ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణగా నిలవనున్న డివోషనల్ సాంగ్ "ఓం వీర నాగ" ప్రస్తుతం రామానాయుడు స్టూడియోస్‌లో అత్యద్భుతంగా నిర్మించిన శివాలయ సెట్‌లో షూట్ చేస్తున్నారు. సినిమా కథ భారతదేశంలోని ప్రాచీన విష్ణు ఆలయాల నేపథ్యంపై సాగుతుంది. శతాబ్దాలుగా రహస్యంగా కొనసాగుతున్న "నాగబంధం" అనే ఆధ్యాత్మిక సంప్రదాయం చుట్టూ నడిచే ఈ కథ, పద్మనాభస్వామి, పూరి జగన్నాథ్ ఆలయాల ధన నిధుల మిస్టరీల స్ఫూర్తితో వుంటుంది. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీ, ఆర్ సి ప్రణవ్ ఎడిటర్. నాగబంధం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. ప్రమోషనల్ యాక్టివిటీస్ త్వరలో ప్రారంభం కానున్నాయి.



# టైటిల్ పోరుకు సబలెంకా

**న్యూఢిల్లీ:** సబలెంకా అనిసిమోవాను అధిగమించి డబ్ల్యూటిఎ ఫైనల్స్ టైటిల్‌కు చేరుకుంది. ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకా 6-3, 3-6, 6-3 తేడాతో అమండా అనిసిమోవాను ఓడించి ఎలెనా రైబాకినాతో ఫైనల్స్ పోరుకు అర్హత సాధించింది. ఇద్దరు క్రీడాకారులు తమ మొదటి బిల్లీ జీన్ కింగ్ ట్రోఫీని లక్ష్యంగా చేసుకుని తలపడనున్నారు. 2022 ఫైనలిస్ట్ సబలెంకా, రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో తలపడిన విజయంతో సహా, రైబాకినాపై 8-5 హెడ్‌టుహెడ్ రికార్డుతో ఆధిక్యంలో ఉంది. అనిసిమోవాతో ప్రారంభ మ్యాచ్‌లలో కఠినమైన పోటీ తర్వాత, ఇటీవల జరిగిన యుఎస్ ఓపెన్ ఫైనల్‌లో సబలెంకా 5-3 ఆధిక్యంలోకి దూసుకెళ్లి, గంటలోపు తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో ఆమెకు అనుకూలంగా మారింది. అంతకుముందు ఐదు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న న్యూయార్క్ ఛాంపియన్, రెండవ సెట్‌లో అనిసిమోవా మొదటి నాలుగు గేమ్‌లను తిరిగి ఆడటంతో వెనుకబడిపోయింది. మూడో సెట్‌లో సబలెంకా వరుసగా ఏస్‌లు కొట్టి 3-3తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాతి గేమ్‌లో భారీ బ్యాక్‌హ్యాండ్ విన్నర్‌తో నిర్ణయాత్మక బ్రేక్‌ను సాధించి తన అమెరికన్ ప్రత్యర్థిని ఓడించింది. అంతకుముందు రైబాకినా జెస్సికా పెగులాను 4-6, 6-4, 6-3 తేడాతో ఓడించి, కింగ్ సౌద్ యూనివర్సిటీ స్పోర్ట్స్ అరీనాలో అద్భుతమైన రికార్డుతో ఫైనల్‌కు చేరుకుంది. రైబాకినా చేసిన 25వ అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్ కారణంగా 31 ఏళ్ల పెగులా తొలి స్టాంజాను దక్కించుకుంది, కానీ తదుపరి సెట్‌లో ఆమె 1-4 తేడాతో వెనుకబడి ఉండటంతో అకస్మాత్తుగా జోరు మారింది. పెగులా సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ 10వ గేమ్‌లో రైబాకినా గట్టిగా స్పందించి నిర్ణయాత్మక పోరాటంలో మళ్ళీ బ్రేక్‌లను మార్చుకుంది. ఎనిమిదో గేమ్ చివరిలో పెగులా నుండి ఫోర్‌హ్యాండ్ నెట్‌లోకి వెళ్లడంతో రైబాకినా ఆధిక్యాన్ని తిరిగి పొందింది, ఆమె తదుపరి గేమ్‌లో నిలుపుకుని తన అజేయ పరుగును కొనసాగించిన విజయాన్ని ఖాయం చేసుకుంది.




హాంగ్‌కాంగ్ సిక్సెస్ నుంచి

# భారత్ ఔట్

## కువైట్ చేతిలో సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** కువైట్, యూఏఈ చేతిలో భారత్‌కు వరుస ఓటములు ఎదురై హాంగ్ కాంగ్ సిక్సెస్ టోర్నీ నుంచి ఔట్ అయింది. క్రికెట్‌లో టీమ్‌ఇండియాపై పసికూన కువైట్ 27 పరుగుల తేడాతో ఓడించింది. క్రికెట్‌లో పటిష్ఠమైన భారత్‌ను చిన్న దేశమైన కువైట్ ఓడించడం సంచలనం అయింది. కాంగ్ వేదికగా జరుగుతున్న హాంగ్ కాంగ్ సిక్సెస్ 2025 టోర్నీలో భారత్ మాజీ ఆటగాడు దినేష్ కార్తిక్ నేతృత్వంలో బరిలోకి దిగింది. ఈ టోర్నీలో భాగంగా భారత్ శనివారం పసికూన కువైట్‌ను ఢీ కొట్టింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు షాక్ తగిలింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చూపించిన కువైట్ భారత్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కువైట్ జట్టు కెప్టెన్ యాసిన్ పటేల్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన కువైట్ నిర్ణీత 6 ఓవర్లలో 5 వికెట్లకు 106 పరుగులు చేసింది. కెప్టెన్ యాసిన్ పటేల్ (58 నాటౌట్ ) సెంచరీతో చెలరేగగాడు. బిలాల్ తాహీర్ (25 పరుగులు) రాణించాడు. టీమ్‌ఇండియా బౌలర్లలో మిథున్ 2, స్టువర్ట్ బిన్నీ, నదీమ్, దినేశ్ కార్తీక్ తలో 1 వికెట్ తీశారు. అనంతరం ఛేజింగ్‌లో భారత్ 5.4 ఓవర్లలో 79 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ దినేశ్ కార్తీక్ (8 పరుగులు), అభిమన్యు మిథున్(26 పరుగులు, 9 బంతుల్లో), షెహ్‌బాజ్ నదీమ్ (19), ప్రియాంక్ పాంచల్ (17) ఫెయిల్ అయ్యారు. కువైట్‌తో మ్యాచ్ అనంతరం భారత్, యూఏఈని ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్‌లోనూ టీమ్‌ఇండియా ఓడడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మిథున్ (50), దినేష్ కార్తిక్ (42) రాణించారు. అనంతరం యూఏఈ 5.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసి నెగ్గింది. ఈ ఓటమితో భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.




# భారత్‌దే టి20 సిరీస్

## ఆస్ట్రేలియాపై తీర్చుకున్న ప్రతీకారం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాపై టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుని సత్తా చూపించింది. టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం రోజున చివరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 2-1 తేడాతే టీమిండియా సొంతం చేసుకుంది. తొలి టీ20 కూడా వర్షార్పణం కాగా, మెల్‌బోర్న్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. అనంతరం మూడు, నాలుగు టీ20ల్లో కంగారులను చిత్తు చేసిన భారత్ జట్టు సిరీస్‌లో 2-1తో ముందజ వేసింది. ఆ తర్వాత కీలకమైన ఐదో టీ20 శనివారం వర్షం కారణంగా రద్దు కావడంతో సిరీస్ భారత్ కైవసమైంది. చివరి మ్యాచ్‌లో ఆట నిలిచిపోయే సమయానికి భారత్ 4.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 52 పరుగులు చేసింది. తొలుత ఉరుములు, మెరుపులు రావడంతో ఆటను నిలిపేశారు. ఆ తర్వాత భారీ వర్షం కూడా తోడవడంతో మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎంపికయ్యాడు. అభిషేక్ ఈ సిరీస్ అసాంతం అద్భుతమైన ప్రదర్శన కనపరిచాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 159.09 స్ట్రైక్ రేటుతో 140 పరుగులు చేశాడు. కాగా అంతకు ముందు వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో మార్ష్ సొంతం చేసుకున్నాడు.

# రాత్రికి రాత్రే సూపర్ స్టార్లు

## రిచ్ లీగ్ ఐపిఎల్‌తో కోట్లల్లో సంపాదన.. టాప్ 10లో రోహిత్ నం.1




**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత రిచ్ లీగ్‌గా నిలిచిన ఐపీఎల్‌తో రాత్రికి రాత్రే సూపర్ స్టార్లుగా మారిన క్రికెటర్లు కోట్లు సంపాదించుకుంటున్నారు. ఇప్పటివరకు జరిగిన 18 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో అత్యధికంగా సంపాదించిన టాప్10 ప్లేయర్లలో హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ అగ్రస్థానంలో ఉన్నాడు. 2008 నుంచి 2025 వరకు అతని మొత్తం ఆదాయం రూ.178.6 కోట్లుగా ఉంది. ముంబై ఇండియన్స్‌కు కెప్టెన్‌గా 5 ఐపీఎల్ టైటిళ్లు అందించిన రోహిత్ టోర్నీ ప్రారంభంలో డెక్కన్ ఛార్జర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2011లో ముంబైలో చేరిన తర్వాత అతని విలువ క్రమంగా పెరిగింది. తర్వాత స్థానంలో ఉన్న ఎంఎస్ ధోని నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది.

ఐపీఎల్‌లో అతడు రూ.176.84 కోట్లు సంపాదించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ ధోనీనే. ఇక తొలి నుంచి ఆర్సీ బెంగళూరుకే ప్రాతినిథ్యం వహిస్తున్న విరాట్ కోహ్లీ రూ.173.2 కోట్లు వెనుకేసుకున్నాడు. మిస్టర్ ఐపీఎల్ సురేశ్ రైనా 2008 నుంచి 2021 వరకు రూ.110.74 కోట్లు సంపాదించాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఛాంపియన్‌గా నిలవడంతో రైనా కీ రోల్ ప్లే చేశాడు. ఐపీఎల్‌లో ఇటు బ్యాట్‌తో అటు బంతితో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లో కీలక పాత్ర పోషించిన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా రూ.109 కోట్ల గడించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్‌లో కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్న వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ రూ.107.25 కోట్లు సంపాదించాడు.

ఐపీఎల్ ద్వారా రూ.102.52 కోట్లు సంపాదించిన దక్షిణాఫ్రికా దిగ్గజ ఆటగాడు ఏబీ డివిలియర్స్ సంచలన బ్యాటింగ్‌తో అలరించాడు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ ఐపీఎల్ సమయంలో రూ.94.62 కోట్లు కూడబెట్టాడు. కేకేఆర్‌కు కెప్టెన్‌గా 2 టైటిళ్లు, కోచ్‌గా ఒక టైటిల్ గెలిపించాడు. ఐపీఎల్‌లో వివిధ టీమ్‌లకు ప్రాతినిధ్యం వహించిన టీమిండియా మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ రూ.91.8 కోట్లు సంపాదించాడు. మాజీ వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ అనేక జట్ల తరుఫున ఆడిన దినేష్ కార్తీక్ ఐపీఎల్ రూ.86.92 కోట్లు అందుకున్నాడు.






## ఫిడే వరల్డ్ కప్‌లో అర్జున్, హారికృష్ణ

# అద్భుత విజయం

## గుకేష్, ప్రజ్ఞా విదిత్ డ్రా

**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎ అర్జున్, పెంటాల హారికృష్ణ అద్భుత విజయాలు నమోదు చేయగా, డి గుకేష్, ఆర్ ప్రజ్ఞానంద, గుజరాతీ విదిత్ బ్లాక్ తో డ్రా గా ముగించారు. పనాజీలో జరిగిన ఫిడే ప్రపంచ కప్, రౌండ్ 3లో అర్జున్, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన షంసిద్దీన్ వోఖిదోవ్‌ను కేవలం 30 ఎత్తుగడలలోనే ఓడించి టోర్నమెంట్‌లో తన అజేయ పరుగును పెంచుకున్నాడు. మొదటి రౌండ్‌లో బై పొందిన 21 ఏళ్ల ఈ యువకుడు ఇప్పుడు వరుసగా మూడు విజయాలు సాధించాడు. ప్రారంభం నుంచే ఖచ్చితమైన నియంత్రణను ప్రదర్శిస్తూ, అర్జున్ విజేత స్థానంలో తన సమయాన్ని వెచ్చించి క్లీన్ ఫినిషింగ్‌ను లెక్కించాడు. ఆత్మవిశ్వాసంతో నాల్గవ రౌండ్‌కు ఒక అడుగు దగ్గరగా వెళ్ళాడు. ప్రారంభంలో హారికృష్ణ రౌండ్ 3లో బెల్జియంకు చెందిన డేనియల్ దర్ధాను 25 ఎత్తుగడలలో ఓడించి విజయం సాధించిన తొలి ఆటగాడిగా నిలిచాడు. 39 ఏళ్ల అతను సిసిలియన్ క్లాసికల్ వేరియేషన్‌ను ఉపయోగిస్తూ, తన ప్రత్యర్థిని అయోమయానికి గురి చేశాడు. అలాగే గుకేష్, ప్రజ్ఞానంద, విదిత్ బ్లాక్ పావులతో డ్రాల్లో నిలకడగా ఉన్నారు. ఇతర భారతీయ పోటీదారులలో, గుకేష్ జర్మనీకి చెందిన ఫ్రెడెరిక్ స్వాన్నేతోను, ప్రజ్ఞానంద అర్మేనియాకు చెందిన రాబర్ట్ హోవన్నిస్యాన్‌తో డ్రా చేసుకున్నారు. విదిత్ అమెరికన్ గ్రాండ్ మాస్టర్ సామ్ షాంక్లాండ్‌తో పాయింట్‌ను పంచుకున్నాడు. ఈ ముగ్గురూ ఇప్పుడు తిరిగి వచ్చే ఆటలను తెల్లటి పావులతో ఆడతారు.

# వాణిజ్యం



## వచ్చే 3 నెలల్లోనూ

# ఆటోమొబైల్ సేల్స్ వృద్ధి

### జిఎస్టీ తగ్గింపు, గ్రామీణ ఆదాయం వృద్ధి కీలకమని ఫాడా అంచనాలు

**న్యూఢిల్లీ,నవంబరు 8:** భారత్ ఆటోమొబైల్ సేల్స్ వచ్చేమూడునెలల్లో కూడా ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాలున్నాయి. జిఎస్టీ రేట్ హేతుబద్ధీకరణ, గ్రామీణుల ఆదాయంలో వృద్ధి వంటి వాటితో వచ్చే మూడు నెలల్లోకూడా కొనుగోళ్లు పెరగవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఫాడా తెలిపింది. అక్టోబరులో ఆల్‌టైమ్ గరిష్టస్థాయిలో అంటే4.02 మిలియన్ వాహానాలు విక్రయించామని,గత ఏడాదితోపోలిస్తే 40.53శాతం వృద్ధినమోదయిందని చెపుతోంది. జిఎస్టీ 2.0 అమలులోకి వచ్చినతర్వాత గ్రామీణ ఆదాయవనరులు పెరిగాయిన, పెళ్లిళ్ల వంటిశుభకార్యాలయాల సందర్భంగా సీజనల్ డిమాండ్‌కూడా పెరిగిందని చెపుతున్నారు. ఏడాదివివరిలో ఇచ్చే ఆఫర్లతో పాటు కొత్త సంవత్సర రిజిస్ట్రేషన్లు కూడా పెరుగుతాయని ఫాడా డీలర్ సర్వేప్రకారం 70శాతం వృద్ధి ఉండవచ్చని చెపుతున్నారు. అక్టోబరులో ప్యాసింజర్ వాహానాలు 11శాతం పెరిగి ఐదులక్షలు క్రాస్ అయ్యాయి. టూవీలర్లుకూడా 3.15 మిలియన్ యూనిట్లు సేల్స్‌తో 52శాతం పెరిగాయి. అక్టోబరులో రిటైల్ విక్రయాలు 40.5శాతం వృద్ధినమోదు చేసాయని ఫాడా అధ్యక్షుడు సిఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. 2025లో ఉన్న 42 రోజుల పండుగల కాలంలో మొత్తంగా రిటైల్ వాహానాల విక్రయాలు 21శాతంపెరిగి 5.23 మిలియన్ యూనిట్లువరకూ అమ్ముడుపోయినట్లు ఫాడా చీఫ్ తెలిపారు.

# డిజిటల్ గోల్డ్‌పై జరజాగ్రత్త సుమా!

## ఇన్వెస్టర్లకు సెబీ అలర్ట్..




**న్యూఢిల్లీ, నవంబరు 8:** బంగారంలో పెట్టుబడులకోసం ఇటీవలికాలంలో డిజిటల్ గోల్డ్‌పైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. ఇంటినుంచే కొనుగోలుకు అవకాశం రావడంతో ఈ తరహా కొనుగోళ్లకు ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ డిజిటల్ లేదా ఆన్‌లైన్‌ప్లాట్‌ఫామ్‌లలో లభించే బంగారం ఉత్పత్తులపైఅప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం కూడా ఉందని శనివారం ప్రకటించింది.

కొన్ని డిజిటల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు పెట్టుబడిదారులకు డిజిటల్ గోల్డ్ ఇగోల్డ్ ఉత్పత్తులను అందిస్తున్నట్లు మాదృష్టికి వచ్చిందని, బంగారంలోపెట్టుబడికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ ప్రచారంలోకి వచ్చిందని ప్రస్తుత చట్టాలప్రకారం అవి సెక్యూరిటీలు, కమోడిటీ డెరివేటివ్‌లు కావని వాటికి సెబీ నియంత్రణ వర్తించదని స్పష్టంచేసింది.

సెబీ నిబంధనల వెలుపలే అవి పనిచేస్తాయని, దీనివల్ల సెక్యూరిటీల మార్కెట్‌పరంగా ఇన్వెస్టర్లకు రక్షణ విధానాలు ఏవీ కూడా వర్తింపచేయలేమని వెల్లడించింది. డిజిటల్ గోల్డ్‌లో కౌంటర్‌పార్టీ, నిర్వహణ రిస్క్‌లు పొంచి ఉంటాయని తెలిపింది. సదరు ప్లాట్‌ఫామ్ తిరిగి డబ్బు చెల్లించలేకపోవడం, నిర్వహణ పరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉంటుందని తెలిపింది. ఫండ్స్ అందించే ఇటిఎఫ్‌లు, స్టాక్ ఎక్ఛేంజిల్లో ట్రేడ్ అయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్‌లు వంటివిసెబీ పరిధిలో ఉంటాయని వీటిని రిజిస్టరుఅయిన మధ్యవర్తులనుంచి కొనుగోలుచేసుకోవచ్చని సెబీ సూచించింది.

## మార్కెట్ విలువల్లో

# జియో 170 బిలియన్ డాలర్లు!

### ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల అంచనాలు

**ముంబయి, నవంబరు 8:** మార్కెట్లలో లిస్టింగ్ అవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్ మార్కెట్ విలువలు 170 బిలియన్ డాలర్లుగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు విలువలు కట్టడంతో సంస్థ విలువలు మరింతపెరిగాయి. భారత్‌లో ముందెన్నడూ లేనివిధంగా ఐపిఒ ఆఫరింగ్స్ తెస్తోందని కూడా ఇన్వెస్టర్లు చెపుతున్నారు. భారతి ఎయిర్‌టెల్ 143 బిలియన్ డాలర్ల విలువలు కడితే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు విలువలు 185 బిలియన్ డాలర్లుగా అంచనావేసారు. ఈ మూడు టాప్ కంపెనీలు మార్కెట్ విలువలపరంగా భారత్‌లో దిగ్గజకంపెనీలుగానే కొనసాగుతున్నాయి. అదే జియో మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలు 225 బిలియన్ డాలర్లు అంటే 20 లక్షల కోట్ల రూపాయలుగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు చెపుతున్నారు. 2026 మొదటి అర్ధభాగంలో జియో ఐపిఒకు వస్తుందని చెప్పినట్లుగానే సంస్థ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు, లీడ్‌మేనేజర్లను సిద్ధంచేసుకుంది. జియో మొట్టమొదటి ఐపిఒయే ప్రపంచ వాణిజ్యంలో రికార్డుస్థాయిలో ఉంటుందన్న అంచనాలున్నాయి. 2006లో రిలయన్స్ పెట్రోలియం ఇదేవిధంగా ఐపిఒ జారీచేసిందని ఇన్వెస్టర్లు అంటున్నారు. జియో ఇప్పటివరకూ వ్యూహాత్మక పెట్టుబడులద్వారా 10 బిలియన్ డాలర్లు ఐదేళ్ల క్రితమే సాధించింది. మెటా, ఆల్ఫాబెట్ వంటి దిగ్గజకంపెనీలు టెక్నాలజీసాయం అందిస్తున్నాయి. పెట్టుబడులు పెట్టాయి. తొలిదశలో సుమారు 6 బిలియన్ డాలర్లకుపైగా ఐపిఒ ఉంటుందని అంచాలున్నాయి. జియోలో 2.5 శాతం ఈక్విటీ తోనే సుమారు 150 బిలియన్ డాలర్లవరకూ పెట్టుబడులు ఆకర్షించవచ్చన్న అంచనాతో ఉంది. ఎగువసర్క్యూట్ విలువలకు వెళితే 4.3 బిలియన్ డాలర్లవరకూ ఉంటుందని అంచనా. సెప్టెంబరునాటికి జియో 50.6 కోట్లమంది కస్టమర్లు ఉన్నారు. సగటు చందారూపంలో జియోకు 211.4 రూపాయలుగా వస్తోంది.






# రూ.13,740.43 కోట్ల ఎఫ్‌పిఐలు విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, నవంబరు 8:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈ వారంలో అధికశాతం విక్రయాలు జరిపారు. మార్కెట్లనుంచి 13,740.43 కోట్ల విలువైన పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. ఈనెల 3 నుంచి ఏడో తేదీవరకూ విత్‌డ్రాల పరంపర కొనసాగిందని ఎన్‌ఎస్‌డిఎల్ గణాంకాలు చెపుతున్నాయి. ఎఫ్‌పిఐలు సోమవారం ఒక్కరోజే 6422.49 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఆతర్వాత శుక్రవారం 3754కోట్లు విత్‌డ్రాచేసారు. గురువారం ఒక్కరోజే స్వల్పంగా పెట్టుబడులు అంటే 20.14 కోట్లు వచ్చాయి. మళ్లీ మంగళవారం కూడా 1583.52 కోట్లు ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేసుకున్నారు.

అక్టోబరులో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 3902 కోట్లు కొనుగోళ్లుజరిపితే నవంబరులో తమ పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారని జియోజిత్ ఇన్వెస్ట్ ఛీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త డా.వికె విజయకకుమార్ తెలిపారు. నవంబరులో ఎనిమిదోతేదీవరకూ పరిశీలిస్తే 13,367 కోట్లు విత్‌డ్రాచేసారని, దీన్నిబట్టి మొత్తం విదేశీ ఇన్వెస్టర్లు 2025లో ఇప్పటివరకూ 2,07,568కోట్లు వెనక్కితీసుకున్నట్లు తేలిందని ఆయన వివరించారు. ఇందుకు రూపాయి క్షీణత కూడా ఒకకారణం అని చెప్పవచ్చు. 88.72 రూపాయలుగా చెలామణీలో కొనసాగింది. అదే శుక్రవారం 88.60 రూపాయలుగా కొనసాగింది. దీనివల్లనే ఎఫ్‌పిఐలపై అమ్మకాల ఒత్తిడిపెరిగిందనే చెప్పాలి. ఇక డెట్ విభాగంలో ఎఫ్‌పిఐలు మిశ్రమంగా ఉన్నాయి. డెట్ ఎఫ్‌ఎఆర్ కేటగిరీలో విదేశీ ఇన్వెస్టర్లు బయ్యర్లుగా ఉన్నారు. 1,003.81 కోట్లుగా ఇన్వెస్ట్‌చేసారు. డెట్ విఆర్‌ఆర్ సెగ్మెంట్‌లో 1,416.67 కోట్లు ఇన్వెస్ట్‌చేసారు. ఇక జనరల్ డెట్ లిమిట్‌కేటగిరీలో 1857.59 కోట్లు విత్‌డ్రా అయ్యాయి.

## వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలో

# టాప్ టెన్‌లో ఎస్‌బిఐ!




**న్యూఢిల్లీ, నవంబరు 8:** భారతీయ స్టేట్‌బ్యాంకు వచ్చే ఐదేళ్లలో ప్రంచంలోనే టాప్ పది బ్యాంకుల్లో ఒకటిగా నిలిచేందుకు కృషిచేస్తోంది. ఇప్పటికే దేశంలో నంబర్‌వన్ బ్యాంకుగా నిలిచిన ఎస్‌బిఐ 100 లక్షలకోట్ల బిజినెస్ టర్నోవర్ అధిగమించింది. ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి మాట్లాడుతూ క్యాపిటల్ అడక్వసీ రేషియో 15శాతం, కోర్ ఈక్విటీ టైర్ అంటే సిఇటి-1 12శాతంగా ఉండాలన్న లక్ష్యం ఉందన్నారు. 2025లో సెప్టెంబరునాటికి బ్యాంకు సిఎఆర్ 14.62శాతంగా ఉంది. బ్యాంకుకు ఆరు నుంచి ఏడులక్షలకోట్ల మూలధన నిల్వలునానయని, లాభాలను పెంచుకోవడంద్వారా మూలధన వనరులను కూడా పెంచుకోగలిగామని వెల్లడించారు.

ఈ టర్నోవర్ పెరగడం ద్వారా ఇతర హెచ్‌డిఎఫ్‌సి, టిసిఎస్, రిలయన్స్, భారతి ఎయిర్‌టెల్, ఐసిఐసిఐబ్యాంకుల జాబితాలో చేరింది. సెప్టెంబరు త్రైమాసికంలోనే బ్యాంకు 10శాతం లాభాలను పెంచుకోగలిగింది. 20,160 కోట్ల నికరలాభాలు ఆర్జించింది. వనయవసాయం, ఎంఎస్‌ఎంఇ, రిటైల్ రంగాల్లో పటిష్టమైన పనితీరు చూపింది. అలాగే యెస్‌బ్యాంకులో వాటా విక్రయం కూడా బ్యాంకుకు కలిసొచ్చింది.

## మూడేళ్లకు గాను అమెరికాలో 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

### మెటా సిఇఒ మార్క్ జుకర్‌బెర్గ్



**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 8:** మెటా సిఇఒ మార్క్ జుకర్‌బెర్గ్ తమ కంపెనీ అమెరికాలో 2028 నాటికి 600 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతుందని ప్రకటించారు. మౌలిక వనరులు, ఉపాధికల్పనలోనే ఈ పెట్టుబడులుంటాయని వెల్లడించారు. ప్రత్యేకించి ఎఐ టెక్నాలజీ ఆధారిత డేటా కేంద్రాలను అమెరికా వ్యాప్తంగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి ఎఐ టెక్నాలజీ వృద్ధికోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నది. అలాగే ఉద్యోగుల నియామకాలు కూడా మరింతపెరగనున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటు ఇందుకు కీలకమని ప్రకటించిన జుకర్‌బెర్గ్ మౌలికవనరులు కూడాముఖ్యమేనన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల్లో 30 వేల మంది నిపుణులతో కూడి ఉన్నాయని, మరో ఐదేవేల మంది ఆపరేషనల్ విభాగంలో 2010 నుంచి కొనసాగుతున్నట్లు తెలిపింది. అమెరికా కస్టమర్లు, జనరల్ కాంట్రాక్టర్లు, ఉత్పత్తిదారులనుంచిదేశవానయప్తంగా మరో 20 బిలియన్ డాలర్ల బిజినెస్ రాగలదన్న ధీమా వ్యక్తంచేసారు. అలాగే అమెరికా పవర్‌గ్రిడ్స్ ఇంధన ఉత్పత్తిలో తాము 15 గిగావాట్ల కొత్త ఇంధన సామర్థ్యం పెంచుకోగలిగామని చెప్పారు. సిఎస్‌ఆర్ పరంగా స్కూళ్లకు గ్రాంట్లుగా 58 మిలియన్ డాలర్లు ఇచ్చామని మెటా జుకర్‌బెర్గ్ వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.